పట్టణాలు కంపుకొడుతున్నాయ్!

పట్టణాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులు నిర్వహించడంతోపాటు వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందే ప్రాంతాలను గుర్తించి పరిశుభ్రతపై జనానికి అవగాహన కల్పించాలి. కాలువల్లో మురుగు తొలగించాలి. తడి చెత్త నిల్వ లేకుండా చూడాలి. ఖాళీ ప్రదేశాలలో, కాలువల్లో మురుగునీటిపై ఉండే దోమలను లార్వా దశలోనే అంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో గంభూషియా చేపలను వదలాలి. దోమలను నియంత్రించేందుకు అబెట్, పైరిత్రిమ్, మలాథియన్‌తో స్ప్రే, మలాథియన్ ద్రావణంతో ఫాగింగ్ చేయాలి. వాటితోపాటు ప్రతి వీధిలోనూ చెత్తను తొలగించిన అనంతరం బ్లీచింగ్ చల్లి పరిశుభ్రమైన వాతావరణం కనిపించేలా చూడాలి. కానీ ఇలాంటి పరిస్థితి జిల్లాలోని ఏ పట్టణంలోనూ కనిపించడం లేదు. మురుగునీటి కుంటలలో గంభూషియా చేపలు, ఆయిల్ బాల్స్ వదలడం, డీడీటీ స్ప్రేయింగ్ చేయడం మచ్చుకైనా కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పట్టణాల్లో దోమలు దడపుట్టిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కుట్టేస్తున్నాయి. దీంతో జనం వ్యాధుల భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా జలుబు, జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. పారిశుధ్యం అధ్వానంతో దోమల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. అధికారులు వార్డులు, డివిజన్లలో పర్యటించి నీటి నిల్వలు.. ఇళ్ల మధ్య మురుగు, చెత్తాచెదారం లేకుండా చూడాల్సి ఉంది. అయితే పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు మృగ్యమయ్యాయి. ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వంటి నియంత్రణ పనులు చేపట్టడం లేదు. అన్నిచోట్లా పాలకవర్గాలు ఉన్నా దోమల నివారణపై మాట్లాడే వారు కరువయ్యారు. ఒకపక్క దోమల నిర్మూలనకు, పారిశుధ్యం మెరుగునకు ఉపక్రమించాలని ప్రభుత్వం ఆదేశించినా ఆ స్థాయిలో మునిసిపాలిటీలలో కదలిక కరువైంది.



బాబోయ్.. దోమలు

పట్టణాల్లో ప్రజలపై దండయాత్ర..!



ఒంగోలు నుంచి అగ్రహారం వెళ్లే దారిలో రైల్వే గేటు వద్ద పేరుకుపోయిన మురుగు

పట్టణాల్లో జనాభా

ఒంగోలు	:	3లక్షలపైనే
మార్కాపురం	:	71,092
గిద్దలూరు	:	35,150
కనిగిరి	:	37,420
చీమకుర్తి	:	30,279
నివాస గృహాలు	:	3.50లక్షలకుపైనే

ప్రతి ఇంటిలో రోజూ దోమలకు ఖర్చుచేస్తోంది : రూ.30
జిల్లాలో నెలకు వ్యయం : సుమారు రూ.కోటి

- వ్యాధుల భయంలో ప్రజానీకం
- నియంత్రణ చర్యల గురించి పట్టించుకోని యంత్రాంగం
- పూర్తిస్థాయిలో చిత్తశుద్ధి కరువు
- నిధుల పరిస్థితి అంతంతమాత్రమే

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బోబోయ్ దోమలు.. ఇదీ ప్రస్తుతం జిల్లాలోని పట్టణాల్లో జనం ఆందోళన. పారిశుధ్యం అధ్వానంతో అందరికీ నిద్రలేకుండా చేస్తున్నాయి. అలాగే వ్యాధుల భయం వెంటాడుతోంది. దోమకాటు నుంచి తప్పించుకొనేందుకు ప్రజలు లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఒంగోలు నగరంలో లక్షకుపైగా గృహాల్లో 3లక్షలపైనే జనాభా ఉన్నారు. ఇకపోతే ఫుట్‌పాత్‌లపై జీవించేవారు, ఇతర ప్రాంతాల నుంచి రోజువారీ పనుల కోసం నగరానికి వచ్చేవారు వేలల్లోనే ఉంటారు. ఇంతవరకు బాగానే ఉన్నా వారి రోజువారీ ఖర్చులతోపాటు కచ్చితంగా దోమల నియంత్రణకు రోజుకు సగటున రూ.20 నుంచి రూ.30 వరకూ ఖర్చు చేస్తున్నారు. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, చీమకుర్తి పట్టణాల్లో 1.43లక్షల మంది వరకు నివసిస్తున్నారు. ఇటీవల పగలు, రేయి తేడా లేకుండా దోమలు దాడి చేస్తున్నాయి. వాటి నియంత్రణ టార్టాయిస్, జెట్, స్లీప్‌వెల్, గుడ్‌నైట్, మస్కిటో బ్యాట్‌లు ఇలా రకరకాల ఆయుధాలను ఉపయోగిస్తున్నారు. దీంతో ఒక్కో ఇంటికి తెలియకుండానే నెలకు రూ.500 నుంచి రూ.800ల వరకు ఖర్చు చేస్తున్నారనడంలో సందేహం లేదు. ప్రజారోగ్యం మెరుగు కోసం మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు లక్షలు ఖర్చుచేస్తున్నామని చెబుతున్నా నగరవాసులకు ఎటువంటి ప్రయోజనం కలగడం లేదు.

ముందస్తు చర్యలేవి?

ఖాళీ ప్రదేశాల్లో ఎక్కువగా మురికినీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో పారిశుధ్యం లోపించింది. ఆ స్థలాల్లోని మురికినీరు గురించి పట్టించుకుంటే

మిగతా 6వ పేజీలో

27 నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు

షెడ్యూల్ విడుదల

ఒంగోలు విద్య, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 27నుంచి 30 వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్-3 (ఎఫ్‌ఏ-3) పరీక్షలు నిర్వహించనున్నారు. ఈమేరకు డీఈవో కిరణ్‌కుమార్, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు షెడ్యూల్ విడుదల చేశారు. 1 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 27వతేదీ ఉదయం 10నుంచి 11 గంటల



వరకు ఓఎస్ఎస్ఎస్, 28న ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 29న ఉదయం ఇంగ్లిషు, మధ్యాహ్నం పరిసరాల విజ్ఞాన పరీక్షలు జరుగుతాయి. 6,7,8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 వరకు, మళ్లీ 2.20 నుంచి 3.20 వరకు ప్రతి రోజూ రెండు పరీక్షలు నిర్వహిస్తారు. హైస్కూళ్లలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 10నుంచి 11 గంటల వరకు, మళ్లీ 11.15నుంచి 12.15 గంటల వరకు రెండు పరీక్షలు జరుగుతాయి. 1నుంచి 5 తరగతుల ప్రశ్నపత్రాలను స్కూలు కాంప్లెక్స్‌ల్లో, 6నుంచి 10 తరగతుల ప్రశ్నపత్రాలను ఎమ్మార్సీలలో భద్రపర్చాలని వారు ఆదేశించారు.


వాగు భూమిలో ఆక్రమణల పరిశీలన

- 40 మందికి నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

6

నీరు-చెట్టు పెండింగ్ బిల్లులకు మోక్షం





- ప్రభుత్వ ఆదేశాలతో అప్‌లోడ్ చేస్తున్న ఇరిగేషన్ అధికారులు
- రూ.28.75కోట్లకుపైన ఉన్నట్లు సమాచారం

ఒంగోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీరు-చెట్టు పనులు చేసి బిల్లులు రాక ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వారికి ఊరట కలగనుంది. పెండింగ్ బిల్లులకు మోక్షం లభించనుంది. అందుకు వీలుగా తక్షణం బిల్లుల వివరాలను అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జలవనరులశాఖ అధికారులు తదనుగుణమైన చర్యలు చేపట్టారు. జిల్లాలో ఇంకా రూ.28.75కోట్లకుపైగా పెండింగ్ బిల్లులు ఉన్నట్లు గుర్తించి వర్క్‌ల వారీగా అప్‌లోడ్ చేసే పనిలో ఉన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నీరు-చెట్టు పేరుతో సాగునీటి వనరుల అభివృద్ధి చేపట్టారు. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, సాగర్‌తోపాటు ఇతర ప్రాజెక్టుల కాలువలు ఇలా అన్ని రకాల నీటి వనరులలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, షట్టర్లు, డ్రాప్‌ల పునరుద్ధరణ, మట్టికట్టల పటిష్టతతోపాటు ఇతరత్రా పనులు చేశారు. వర్షపు నీటిని వీలున్నంత మేర నిల్వ చేయాలన్నది ఈ పనుల లక్ష్యం. టీడీపీ కాలంలో ఉమ్మడి జిల్లాలో రూ.400 కోట్ల విలువైన పనులు చేపట్టి 90శాతం పనులు పూర్తి చేశారు. అప్పట్లోనే చేసిన పనులకు సంబంధించి రూ.75శాతం వరకు బిల్లులు చెల్లింపు కూడా జరిగింది.

వైసీపీ ప్రభుత్వం రాగానే నిలిపివేత

2019లో వైసీపీ అధికారంలోకి రాగా నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు అన్నింటినీ ఆపేసింది. దాదాపు రూ.80 కోట్ల వరకు అలా ఆగినట్లు సమాచారం. దాదాపు రెండేళ్లపాటు ఆ బిల్లులు ఇవ్వాలని, పనులు చేసిన వారు కూడా నాటి ప్రభుత్వాన్ని గట్టిగా అడిగే పరిస్థితి లేకపోయింది. అనంతరం కొంత ఒత్తిడి పెంచారు. కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో బిల్లులు ఇవ్వకపోగా తమపై కోర్టును ఆశ్రయిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేసిన నాటి వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఒకవైపు కోర్టుకు యంత్రాంగం ద్వారా సమాధానం ఇస్తూనే మరోవైపు విజిలెన్స్ అలాగే ఇతర శాఖల ఇంజనీరింగ్ అధికారులతో తనిఖీలు చేయిస్తూ బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేసింది. తప్పని పరిస్థితుల్లో కోర్టు ఆదేశాలతో ఇవ్వాల్సి వచ్చి

మిగతా 6వ పేజీలో

ఒంగోలులోని పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్టీఆర్ కళాపరిషత్ 25వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. శుక్రవారం స్థానిక నళినీ ప్రియ కూచిపూడి నృత్యనికేతన్ వారు ప్రదర్శించిన శ్రీశంకర విజయం నృత్యరూపకం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. 6

భళా.. శ్రీశంకర విజయం నృత్యరూపకం





బాలికల సంరక్షణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, మేయర్ సుజాత

సామాజిక రుగ్మతలను రూపుమాపాలి

- ఆడపిల్లలు స్వేచ్ఛగా ముందుకు సాగాలి
- బాలికా దినోత్సవ సభలో మంత్రి డాక్టర్ స్వామి పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సామాజిక రుగ్మతలను రూపుమాపి ఆడపిల్లలు స్వేచ్ఛగా ఎదిగే సమాజ ఆవిష్కరణకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వ యంత్రాంగానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆడపిల్లలు లేని సమాజం చీకటితో సమానమన్నారు. ఆడపిల్లలు పుట్టకూడదనుకోవడం, బాల్య వివాహాలు చేయడం వంటి రుగ్మతలను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత వహించాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను నివారించేందుకు కలెక్టర్ అన్సారియా ప్రత్యేక చొరవ తీసుకొని బంగారు బాల్యం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం తరఫున రూపొందించే ప్రతి పోస్టర్‌లోనూ బంగారు బాల్యం తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రప్రభుత్వం కూడా బాలికల భద్రత, ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. బాల్య వివాహాలను నివారించేందుకు అవసరమైతే కేజీబీవీ, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో బాలికలకు సీట్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ స్వీయ నిర్ణయం స్థాయికి మహిళలు ఎదగాలన్నారు. ప్రతిబాలిక కనీసం డిగ్రీ పూర్తిచేయాలన్నారు. సమాజంలోని పరిణామాలను గమనిస్తూ సొంత భావాలు వ్యక్తపర్చేలా ఉండాలని, తమశక్తి సామర్థ్యాలను ప్రదర్శించే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ దిశగా ప్రభుత్వం కూడా విజన్ డాక్యుమెంట్‌లో మానవ వనరుల అభివృద్ధి-వినియోగానికి ప్రాధాన్యం ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు బాలికా

మిగతా 6వ పేజీలో

6

- అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం
- ఎస్పీతో కలిసి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్ల పరిశీలన
- సమన్వయంతో పనిచేయాలని సూచన

పండుగ వాతావరణంలో గణతంత్ర వేడుకలు



ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ, అధికారులు



లాటరీ తీసి ప్రకటిస్తున్న జేసీ గోపాలకృష్ణ

గీత కార్మికులకు మద్యం దుకాణాలు

- లాటరీ పద్ధతి ద్వారా కులాల వారీ ఎంపిక చేసిన జేసీ
- 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- వచ్చే నెల 7న లాటరీ ద్వారా కేటాయింపు

7

ఒకే రోజు ఏడువేలకుపైగా ఇంకుడు గుంతలు

- గ్రామాల వారీ కార్యాచరణకు డ్వామా పీడీ ఆదేశం
- ఎంపీడీవోలు, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్
- నెలాఖరుకు గోకులాల నిర్మాణాలు పూర్తి
- రికవరీలు చేయని ఎఫ్ఏలపై క్రిమినల్ కేసులు

6

పండుగ వాతావరణంలో గణతంత్ర వేడుకలు

● అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్/ క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలుసూచనలు చేశారు. ఆదివారం జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు, వీక్షించేందుకు వచ్చే వారి హోదాను, సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమ నిర్వహణలో సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలన్నారు. పోలీసు కవాతు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్ధిష్ట సమయం ప్రకారం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను తెలియజేసేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరవుతున్నందున అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్, ఇతరత్రా అంశాలపై పోలీసు అధికారులకు ఆయన పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు నాగేశ్వరరావు, అశోక్‌బాబు, డీఆర్వో చినఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నతోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాగు భూమిలో ఆక్రమణల పరిశీలన

● 40 మందికి నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం



ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న ఆర్ఐ మూర్తి, వీఆర్వో పెద్దన్న

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముండ్లమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేముల పంచాయతీ పరిధి లోని వాగు పోరంబోకు ఆక్రమణలపై అధి కారులు కదిలారు. ఆ భూమిని పరిశీలించారు. 'వాగు పోరంబోకు భూమి' ఆక్రమణ శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ అన్సారియా స్పందించారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణను ఆదేశించారు. ఆయన సూచనతో ఆర్ఐ మూర్తి, వేముల వీఆర్వో పెద్దన్న, గ్రామ సర్వేయర్ మస్తాన్ ఆక్రమణకు గురైన భూములను పరిశీలించారు. 40 మంది ఆక్రమణదారులు వాగుపోరంబోకు భూమిలో బావులు, వరి పైరు, పశువుల మేత సాగు చేసుకుంటున్నట్లు గుర్తించారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేశారు. వీరందరికీ శనివారం నోటీసులు అందజేయనున్నారు.

ఒకే రోజు 7వేలకుపైగా ఇంకుడు గుంతలు

● గ్రామాల వారీ కార్యాచరణ
● ఏర్పాట్లు చేయాలని డ్వామా పీడీ ఆదేశం
● ఎంపీడీవోలు, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్
● నెలాఖరుకు గోకులాల నిర్మాణాలు పూర్తి
● రికవరీలు చేయని ఎఫ్ఏలపై క్రిమినల్ కేసులు

ఒంగోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఒకే రోజున ఏడువేలకుపైగా ఇంకుడు గుంటలు తవ్వకాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ చెప్పారు. ఈనెలాఖరులోనే ఆ కార్యక్రమం చేపట్టాలని అందుకు వీలుగా గ్రామ యూనిట్‌గా కార్యచరణ రూపొందించాలని ఎంపీడీవోలు, ఏపీవోలకు సూచించారు. ఆ మేరకు శుక్రవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు ఇచ్చారు. నెలాఖరులో ఒకే రోజు అన్ని పంచాయతీల్లో ఇంకుడు గుంతలు తవ్వేలా చర్యలు తీసుకోవాలన్న ఆలోచనకు కలెక్టర్ రావడంతో తదనుగుణ చర్యలను ఆయన వివరించారు. జిల్లాలో మొత్తం 729 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కొక్క పంచాయతీలో కనీసం 10 ఇంకుడు గుంటల వంతున ఒకే రోజు 7,290 తవ్వకాలు చేసేలా ప్రజలను సన్నద్ధం చేయాలని సూచించారు. ఒక్కొక్క దానికి ఉపాధి పథకం ద్వారా రూ.6వేలు ఇవ్వనుండగా లబ్ధిదారుల ఎంపిక తక్షణం చేయాలని తెలిపారు. అలాగే జిల్లాలో చేపట్టిన మినీగోకులాల నిర్మాణాలు నెలాఖరు నాటికి పూర్తిచేయాలని మండల అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1,131 మినీ గోకులాలు నిర్మాణం చేపట్టగా సుమారు 570 వరకు పూర్తయ్యాయని, మరో 130 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆయా దశల్లో ఉన్నవాటితోపాటు ఇతర వాటిని కూడా నెలాఖరులోగా పూర్తిచేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇక సోషల్ ఆడిట్ లో గుర్తించిన లోటుపాట్లకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి ఆయా మొత్తాల రికవరీపై దృష్టిసారించాలని మండలస్థాయి అధికారులను పీడీ ఆదేశించారు. ఇటీవల జిల్లాలో పెద్దఎత్తున ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామాలు, తొలగింపులు జరగ్గా అలాంటి వారి నుంచి దాదాపు రూ.32 లక్షలు రికవరీ చేయాల్సి ఉందని, ఆ మొత్తాలను వసూలు చేయాలన్నారు. అవసరమైతే వారిపై క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని ఆదేశించారు. వీసీలో డ్వామా విజిలెన్స్ అధికారి యూన్సీ పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలను రూపుమాపాలి

(5వ పేజీ తరువాయి)

స్వేచ్ఛ-బాల్యవివాహాల నివారణ కోసం మద్దతుగా ఏర్పాటు చేసిన బ్యానర్‌పై కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ గంగాడ సుజాతతో కలిసి మంత్రి స్వామి సంతకాలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, హేనసుజన్, కిరణ్‌కుమార్, లక్ష్మానాయక్, అంజల, అనిత, అర్చన, దినేష్‌కుమార్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహం చేసుకోకుండా ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న ఓ విద్యార్థిని చెప్పిన మాటలు ఇతర విద్యార్థులలో స్ఫూర్తిని నింపాయి. తానది దర్శి సమీపంలోని ఒక గ్రామమని, తల్లిదండ్రులు లేరన్నారు. 7వతరగతి పూర్తికాగానే బంధువులు పెళ్లిచేయాలని చూశారని, అది ఇష్టంలేక ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి తెలియజేశానని తెలిపారు. ప్రస్తుతం బొమ్మరిల్లులో ఉంటూ బీఎస్సీ చదువుకుంటున్నానని ఆమె చెప్పగా మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియాలు అభినందించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

యువత చేతిలోనే కళల భవిత

● సందేశాత్మకంగా కమనీయం నాటిక ● అలరించిన మహిళల కోలాటం ● ఉత్సాహంగా కొనసాగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యక్రమాలు



కోలాట ప్రదర్శన

ఒంగోలు కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ 25వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు వివిధ వైవిధ్య భరితమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి కళాపరిషత్ వేదికలపై వివిధ కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. మొదటిగా పాకలకు చెందిన శ్రీలక్ష్మి తిరుపతమ్మతల్లి నాదస్వర బృందంచే నాదస్వర కచ్చేరి జరిగింది. ఇందులో కొత్తకోట శ్రీనివాసరావు, బోయినపల్లి సుబ్బారావు, కొత్తకోట వెంకట్రావు, వల్లూరి మోహనరావులు నాదస్వరం, డోలుపై చక్కటి శాస్త్రీయ గీతాలను వినిపించారు.

అనంతరం అల్లూరుకు చెందిన మైత్రి కోలాట బృందంచే ప్రదర్శితమైన కోలాట ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. సుమారు 70 మంది మహిళలు ఈ కోలాటంలో పాల్గొనగా శిక్షకులు నాంచారయ్య ఆధ్వర్యంలో శివ శివమూర్తివి గణనాథ, యశోదమ్మ నీకొడుకు ఏడీ, గున్నగున్న మామిడి, నల్లనయ్యా రావా వంటి పలు గీతాలకు మహిళలు ఉత్సాహంగా కోలాటాన్ని ప్రదర్శించారు. ఇక మహిళలు అందరూ చీపుర్లు పట్టుకుని స్వచ్ఛభారత్ సందేశాన్నిస్తూ చేసిన కోలాట ప్రదర్శన హైలైట్‌గా నిలిచింది. ఇక ప్రతిరోజు నిర్వహించే చర్చాగోష్టిలో భాగంగా మూఢనమ్మకాలు, జాతకాలు, శకునాలు వంటి అంశాలపై చర్చా కార్యక్రమం జరిగింది. ఇందులో మహిళలు ఉత్సాహంగా పాల్గొని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు.

'కమనీయం'గా..

ఇక నాటకం విషయానికి వస్తే కళలు రాబోయే తరానికి అంది కలకాలం వర్ధిల్లాలంటే యువత చదువుతో పాటు ఏదో ఒక కళలో నైపుణ్యం సాధించాలని, అందుకు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలనే సందేశంతో శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారు ప్రదర్శించిన కమనీయం సాంఘిక నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. విద్యాధర్ మునిపల్లె రచించిన ఈ నాటికకు బసవరాజు జైశంకర్ దర్శకత్వం వహించగా ఆయనతో పాటు టి.వేణుగోపాల్, గుడివాడ లహరి ప్రధాన పాత్రలు పోషించారు.



కమనీయం నాటకం

శ్రీశంకర విజయం నృత్యరూపకం

ఒంగోలు నళినీప్రియ కూచిపూడి నృత్యనికేతన్ వారు ప్రదర్శించిన శ్రీశంకర విజయం నృత్యరూపకం సైతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కూచిపూడి నృత్య శిక్షకురాలు పి.శివకుమారి నేతృత్వంలో నృత్య కళాకారులు శంకరాచార్యుల వారి జీవిత గాథను చక్కగా ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాలను ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు పర్యవేక్షించగా, ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తదితరులు పాల్గొని కళాకారులకు ప్రదర్శనా పారితోషికం, జ్ఞాపికలను బహూకరించి సత్కరించారు.

న్యాయం చేయాలంటూ రాస్తారోకో

పొదిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని మండలంలోని సల్లూరు గ్రామస్థులు శుక్రవారం పొదిలి పోలీస్‌స్టేషన్ ఎదుటరోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. ఏలూరు పంచాయతీ పరిధిలోని సల్లూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (45) ఇటీవల అనారోగ్య కారణాలతో విజయవాడలో మృతి చెందారు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామం సల్లూరుకు తీసుకొచ్చారు. ఈ తరుణంలో గ్రామానికి వేరే సామాజిక వర్గంవారు గ్రామంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు చేయడానికి వీలు లేదంటూ ఘర్షణ పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చారు. వారి చొరవతో శుక్రవారం వేకువజామున అంత్యక్రియలు నిర్వహించారు. అయితే గురువారం రాత్రి అంత్యక్రియలు చేయడానికి వచ్చిన వర్గంపై పొదిలి సీఐ, ఎస్ఐలు లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ ఆ వర్గంవారు ధర్నా, రాస్తారోకో చేశారు. అంతకు ముందు బీసీవైపీ రాష్ట్ర వ్యవస్థాపకుడు బోడె రామచంద్రయాదవ్ సల్లూరు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయితే మృతదేహానికి దహన సంస్కారాల విషయంలో జరిగిన వివాదాన్ని తెలుసుకొన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు దురుసుగా ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్ఐ, సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పొదిలి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. రోడ్డుపై కూర్చున్నవారికి పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సల్లూరు గ్రామస్థులకు, పోలీసులకు కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులపై ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రామచంద్రయాదవ్ చెప్పారు. గ్రామస్థులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమించారు.



నిరసన తెలుపుతున్న బీసీవైపీ వ్యవస్థాపకుడు రామచంద్రయాదవ్‌కు సర్దిచెబుతున్న పోలీసులు

ఆలయ భూములు స్వాధీనం

● రూ.10 కోట్ల విలువ ఉంటుందని అంచనా
● హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దేవదాయశాఖ అధికారులు



స్వాధీనం చేసుకున్న భూమిలో హెచ్చరిక బోర్డును పాతుతున్న దేవదాయశాఖ అధికారులు

మార్కాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన పరాధీనంలో ఉన్న భూములను ఒక్కొక్కటిగా దేవదాయ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. రెండుమాసాల క్రితం మార్కెట్‌యార్డు సమీపంలో రూ.30 కోట్ల విలువైన భూములను కాపాడి రక్షణ కంచె ఏర్పాటు చేశారు. తాజాగా శుక్రవారం పట్టణ పరిధిలోని పలుచోట్ల ఉన్న రూ.8.78 ఎకరాల స్వామివారి మాన్యం భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణలో ఉన్న స్వామివారి భూములను దేవదాయశాఖ అధికారులు ఇప్పటికే గుర్తించి నోటీసులు అందజేశారు. ఆక్రమణదారుల నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం, ఉన్నతాధికారుల స్పష్టమైన ఆదేశాలతో శుక్రవారం రంగంలోకి దిగారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్‌శాఖ అధికారుల సహకారాన్ని తీసుకున్నారు. ఏడు సర్వే నంబర్ల పరిధిలోని 8.78 ఎకరాల భూమిలో ముందుగా ఆక్రమణలు, పిచ్చిచెట్లు పూర్తిగా తొలగించారు. అనంతరం ఆయా భూముల్లో దేవదాయశాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావు, ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరాజు, ఈవోలు గొలమారి శ్రీనివాసరెడ్డి, రమేష్, నర్రా నారాయణరెడ్డి, టూటౌన్ ఎస్సై రాజమోహన్, వీఆర్‌వోలు రమణారెడ్డి, వెంగళరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బిడ్డ బాల్యం.. బంగారుమయం అవ్వాలి

కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి బిడ్డ బాల్యం బంగారుమయం అయ్యేలా ప్రభుత్వశాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం సాయంత్రం బంగారుబాల్యం కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బంగారుబాల్యం కార్యక్రమం ప్రత్యేకంగా జిల్లాలో రూపొందించిన నేపథ్యంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. ప్రధానంగా బాల్య వివాహాలను నివారించడంతో పాటు బాలికల సమగ్ర ఎదుగుదల కోసం బంగారు బాల్యం కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఆస్పత్రులలో ప్రసవాలు, జనన రిజిస్ట్రేషన్లు, ఆధార్‌కార్డుల కోసం రిజిస్ట్రేషన్లు, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారి ఆరోగ్యం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. డ్రాపౌట్ అయిన 15నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించడంతో పాటు బాల పంచాయతీలు, కౌమార దశ పిల్లల క్లబ్‌లు ఏర్పాటు, బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా చూడాలని చెప్పారు. ఉల్లంఘనలు జరిగినప్పుడు కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ పోలీస్‌శాఖ రెస్క్యూ ఆపరేషన్ ద్వారా విడిపించిన పిల్లలకు తదుపరి మెరుగైన భవిష్యత్ కోసం అందుబాటులో ఉన్న మార్గాలను కూడా తెలియజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు హేనసుజన్, దినేష్‌కుమార్, వెంకటేశ్వరరావు, రవికుమార్, కనకదుర్గ, డాక్టర్ వెంకటేశ్వర్లు, సూరిబాబు, అంజల, కిరణ్‌కుమార్; చిరంజీవి, శ్రీమన్నారాయణ, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

నీరు-చెట్టు పెండింగ్ బిల్లులకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

కొంతమేర ఆ ప్రభుత్వం దిగిపోయే నాటికి చెల్లింపు చేసింది. అలా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి ఇంకా రూ.40కోట్ల వరకు పెండింగ్ ఉంది. ఈ ప్రభుత్వం వచ్చాక కోర్టు కేసుల తీర్పు ఇతర రూపాలలో సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసి ఉన్న సుమారు రూ.12కోట్ల మేర బిల్లులను రెండు నెలల క్రితం క్లియర్ చేశారు.

ఇరిగేషన్ డివిజన్ల వారీ అప్‌లోడ్

ఇంకా చాలా జిల్లాల్లో పెండింగ్ ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు మార్చితో ఖర్చుచేయాల్సి ఉన్న నేపథ్యంలో పెండింగ్ బిల్లులపై దృష్టి సారించింది. జిల్లాల వారీ, ఇరిగేషన్ డివిజన్ల వారీ బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వారంరోజులుగా ఇరిగేషన్ అధికారులు ఆ ప్రక్రియలో ఉన్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఇంకా 799 పనులకు సంబంధించి రూ.28.75 కోట్లు పెండింగ్ ఉన్నట్లు గుర్తించారు. అందులో ఇప్పటికే కోర్టు తీర్పులు వచ్చి ఇవ్వాల్సినవి 31 పనులకు రూ. 3.21 కోట్లు ఉండగా కోర్టుకు వెళ్లకుండా ఉన్న వారికి సంబంధించి 159 పనులకు రూ.11.57 కోట్లు ఉన్నాయి. అలాగే జీఎస్టీ బిల్లులు లేవంటూ గత ప్రభుత్వం కొర్రీలు వేసి ఆపేసినవి 610 పనులకు రూ.14.07 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం అలాంటి వాటిని కూడా అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం సూచించింది. దీంతో అన్నిరకాల పెండింగ్ బిల్లులను ఇరిగేషన్ అధికారులు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. త్వరలో ఈ బిల్లులకు మోక్షం కలగనుంది.

బాబోయ్.. దోమలు

(5వ పేజీ తరువాయి)

కొంతవరకు సమస్యను అధిగమించవచ్చు. గతంలో ప్రైవేటు స్థలాల యజమానులకు నోటీసులు జారీచేయడం, ఎంతకీ స్పందించకపోతే జరిమానా విధించడం వంటివి చేపట్టేవారు. అయితే ప్రస్తుతం వాటి గురించి పట్టించుకోకపోవడంతో యజమానులు సైతం వాటిపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫాగింగ్ ద్వారా దోమలు అదుపునకు కృషిచేస్తున్నామని అధికారుల చెబుతున్నా దోమలు మాత్రం అదుపులోకి రావడం లేదంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రజారోగ్య విభాగం పనితీరు రోడ్డు మీద సున్నం లాగానే ఉందని వాఖ్యానిస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, జనవరి24(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థి కె.గుణవర్ధనరెడ్డి(23) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం రాత్రి కరవది-ఒంగోలు మధ్యలో రైల్వే ట్రాక్‌పై జరిగింది. వివరాలలోకి వెళితే.. ఒంగోలు నగరం గాంధీనగర్ నాలుగో లైన్‌లో నివాసం ఉండే గుణవర్ధనరెడ్డి గూడూరులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో కళాశాలకు వెళుతున్నాని ఇంట్లో చెప్పి వెళ్లి ఒంగోలు రైల్వేస్టేషన్ నుంచి ట్రాక్ వెంట వెళ్ళి గురువారం రాత్రి 7 గంటల సమయంలో రైలు కింద పడి చనిపోయాడు. కొద్దిరోజులుగా గుణవర్ధనరెడ్డి ముభావంగా ఉన్నట్లు కుటుబసభ్యులు చెబుతున్నారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియవని చెప్పారు. ఈమేరకు మృతదేహాన్ని గుర్తించిన రైల్వే పోలీసులు ఆధారాలను పరిశీలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ అరుణకుమారి తెలిపారు.

విద్యాసంస్థల బస్సులను భద్రంగా నడపాలి

● డ్రైవర్లకు డీటీసీ సుశీల సూచన

ఒంగోలు క్రైం, జనవరి24(ఆంధ్రజ్యోతి): పాఠశాలల విద్యార్థులు ప్రయాణం చేసే బస్సులను డ్రైవర్లు జాగ్రతగా నడపాలని జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల సూచించారు. శుక్రవారం ఒంగోలులోని రవాణాశాఖ కార్యాలయంలో స్కూల్, కాలేజీ బస్సుల డ్రైవర్లకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ సుశీల మాట్లాడుతూ విద్యార్థులు ప్రయాణం చేసే బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సులను ఎట్టి పరిస్థితిల్లో నడపకూడదని చెప్పారు. తమ లైసెన్స్‌పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. అధిక వేగంతో బస్సులు నడపవద్దని హితవు పలికారు. రహదారి నిబంధనలు తప్పక పాటించాలని ఆదేశించారు. అంతేగాకుండా బస్సుల్లో ఫైర్ అలారం, ఫైర్ డిటెక్టర్స్ ఏర్పాటు చేయించుకోవాలని, ఏదైన అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు డ్రైవర్లు వాటిని వినియోగించే విధానంపై అవగాహన పొందాలని వివరించారు. అనంతరం డ్రైవర్లకు కంటి, ఆరోగ్య పరీక్షలు చేయించారు. మోడరన్ కంటి ఆసుపత్రి డాక్టర్లు మారం వెంకటరమణారెడ్డి, అపర్ణ కాల్విన్, కిమ్స్ డాక్టర్ బి.రామంజనేయులు వైద్యసేవలు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు రామచంద్రరావు, కిరణ్ ప్రభాకర్, సురేంద్రప్రసాద్, మధుసూధనరెడ్డి, ఏఎంవీఐలు జయప్రకాష్, ధర్మేంద్ర, భానుప్రకాష్, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐసీఎంఆర్ ఫెలోషిప్‌కు రిమ్స్ వైద్య విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన వైష్ణవి, తారాలీశ్రీ

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీలోని ఇరువురు వైద్య విద్యార్థినులు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)లో రెండు ఫెలోషిప్‌లు సాధించి సత్తా చాటారు. మెడిసిన్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కె.వైష్ణవి, జి.తారాలీశ్రీలు డాక్టర్ భాస్కర్ కొల్లి, డాక్టర్ స్పందనల గైడెన్స్‌లో ఒంగోలు నగరంలోని పేదవారిలో ప్రీ స్కూలు పిల్లల కోసం విటమిన్ ఎ సప్లిమెంటేషన్‌పై అడ్డంకులు, సులభతరం అంశంపై సెక్షనల్ స్టడీ చేశారు. దక్షిణ భారత దేశంలోని ఒక జిల్లాలోని వికలాంగత కలిగిన గిరిజన పిల్లల జీవన నాణ్యత, వారి కుటుంబాలపై భారం అనే అంశాలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక రిమ్స్‌లో మెడికల్ విద్యార్థినలుఉ వైష్ణవి, తారాలిశ్రీని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, ప్రొఫెసర్లు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా

చీరాలటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్యా బుద్ధులు, ఇతర సౌకర్యాలపై హాస్టల్ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధతో మెలగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం చీరాల పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈక్రమంలో వంట గది, పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అపరిశుభ్రంగా ఉండటం వలన విష సర్పాలు వంటివి చేరితే చిన్నారుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని హెచ్చరించారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించి ఉత్సాహపరిచారు. అలాగే చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మంత్రి వెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, చినగంజాం తహసీల్దార్ ప్రభాకరరావు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సోషల్ వెల్ఫేర్ అధికారిణి రాజా దెబోరా, డీటీలు అర్జున్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఎకరం.. పది నిమిషాల్లో..

డ్రోన్లతో మందు పిచికారీ

- సాగులో నూతన ఒరవడి ● పెరుగుతున్న వినియోగం
- ఒక్క క్లిక్‌తో పంటకు రక్షణ ● అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆసక్తి చూపుతున్న రైతన్నలు

వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. అధునికత వైపు అడుగులేస్తోంది. పంటల సస్యరక్షణ చర్యల్లో డ్రోన్ల వినియోగం అందుబాటులోకి వచ్చింది. కొద్ది సమయంలో, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం కనిపిస్తోంది. పది నిమిషాల్లో ఒక ఎకరం పిచికారీ చేస్తున్నారు. దీనిపై వ్యవసాయ అధికారులకు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ పాటికే కొందరు రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు.

గిద్దలూరు మండలం వెంగలరెడ్డిపల్లికి చెందిన పార్శ రామలింగస్వామి 3.5 ఎకరాల్లో మిర్చి, పప్పుశనగ సాగుచేశారు. తక్షణమే మందు పిచికారీకి చేయాల్సి రావడంతో డ్రోన్ ఆపరేట్ చేసేవారిని సంప్రదించారు. 40 నిమిషాల్లో డ్రోన్‌తో పిచికారీ పూర్తి చేశారు. ఇందుకు రూ.500 తీసుకున్నారు.

వెంగలరెడ్డిపల్లికి చెందిన మరో రైతు ఎడమకంటి రంగస్వామి రెడ్డి 5 ఎకరాల్లో మిర్చి, పప్పుశనగ సాగు చేశారు. మందు పిచికారీకి 55 నిమిషాల్లోనే డ్రోన్‌తో పిచికారీ చేయించారు. పొలం వేర్వేరు చోట్ల ఉండటంతో రూ.700 తీసుకున్నారు. ఇదే కూలీలతో అయితే రూ.2500 ఖర్చయ్యేది.

గిద్దలూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్ల టెక్నాలజీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వ్యవసాయ క్షేత్రంలో కూలీల కొరతను అధిగమించి సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ఎకరాకు పురుగుల మందు పిచికారీ చేయడానికి సుమారు రూ.1000 ఖర్చు అవుతోంది. అదే డ్రోన్లతో అయితే ఎకరాకు రూ.500 అద్దెగా తీసుకుంటారు. డ్రోన్ వినియోగంలో ఏ సమయంలోనైనా, ఏ పంటకైనా సులభంగా పిచికారీ చేసుకోవచ్చు. డ్రోన్లతో అన్ని రకాల పురుగు, కలుపు మందులు, ఆర్గానిక్ ద్రావణాలు, నీటిలో కరిగే ఎరువులను పిచికారి చేయవచ్చు. కేవలం 6గంటల్లో 30 ఎకరాల పంటలకు పిచికారీ చేయవచ్చని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. ఎకరం పొలానికి పురుగు మందులు పిచికారి చేయాలంటే 200 లీటర్ల నీరు అవసరం. డ్రోన్ల ద్వారా కేవలం 10 నుంచి 14 లీటర్ల నీరు మాత్రమే సరిపోతుంది. ఏ పంట మీదైనా 2, 3 అడుగుల ఎత్తులో పొలమంతా సమానంగా పిచికారీ చేయడం డ్రోన్లతోనే సాధ్యమవుతోంది. పిచికారీతో 95శాతం నీటిని, 95శాతం సమయాన్ని, 40 శాతం మందు ద్రవాన్ని ఆదా చేస్తోంది.

డ్రోన్ల వినియోగంపై శిక్షణ

డ్రోన్ల వినియోగంపై యువతకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా శిక్షణ ఇస్తోంది. డ్రోన్ల వినియోగం, పంటకు ఎరువులు, పురుగు మందులు ఎలా పిచికారీ చేయాలి, డ్రోన్ల విడిభాగాలు ఎలా అమర్చాలి అనే దానిపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తుంది. గిద్దలూరు ప్రాంతంలో గడిచిన కొద్ది రోజులుగా రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ ఉంది. ఇప్పటికే మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఒక రైతు ఎక్కువ భాగం డ్రోన్ల సహాయంతో తమ పంట పొలంలో మందులను పిచికారీ చేస్తున్నాడు.



డ్రోన్ల వినియోగం పెరిగింది

సాంకేతికత పెరగడంతో డ్రోన్ కెమెరాలను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. సాంకేతికతను అందిపుచ్చేందుకు శిక్షణ పొందాం. ప్రస్తుతం ప్రతి దానిలో డ్రోన్ల వినియోగం పెరిగింది.

- బి.సోమేశ్వర్, ఆపరేషన్ మేనేజర్

పని చేస్తుంది ఇలా . . .

- జీపీఎస్ ఆటోపైలెట్ సహాయంతో రిమోట్ ద్వారా లేదా ఎల్‌సీడీ మొబైల్‌లో అగ్రినీట్, అగ్రి అసిస్టెంట్ యాప్ ద్వారా ముందుగా పొలంపైన సెట్ చేసిన ఎత్తులో నిర్దిష్టమైన దిశలో పిచికారీ చేసేలా డ్రోన్లకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తారు.
- ప్రస్తుతం మార్కెట్ స్థాయిని బట్టి డ్రోన్ ధర రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉంది.
- 12-16000 ఎంఎహెచ్ లిథియమ్ పాలిమర్ బ్యాటరీతో 10 లీటర్ల డ్రమ్ము ఒక జత బ్యాటరీలతో ఎకరాకు కేవలం 10 నిమిషాల్లో పిచికారీ చేయవచ్చు.
- సిగ్నల్ పోయినా, మందు అయిపోయినా, బ్యాటరీ తగ్గినా, పిచికారీ పూర్తి అయినా డ్రోన్ మొదట ఉన్న చోటికే తిరిగి వస్తుంది. పని పూర్తి అయినది, చేయాల్సింది, చేస్తున్న ప్రదేశాన్ని మొబైల్‌లో ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల్లో చూడవచ్చు.
- దీనిని సులభంగా వినియోగించ డానికి వీలుగా ఒక పైలెట్ రీక్యాప్ చేస్తూ బ్యాటరీలు మార్చడానికి ఒక వ్యక్తి, మ్యాపింగ్ చేసేందుకు మరో వ్యక్తి అవసరం అవుతుంది.


కందిపై డ్రోన్‌తో పిచికారీ(ఫైల్)



రైతుకు ఆదా..

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం మంచి ఫలితాలు ఇస్తోంది. దీంతో రైతులకు కూలీల బెడద తగ్గుతోంది. సమయం, డబ్బు ఆదా అవుతాయి. ప్రభుత్వం కూడా డ్రోన్ల వినియోగం వ్యవసాయంలో పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది.

- వై.విజయభాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, గిద్దలూరు


కేఎస్‌పల్లెలో చిక్కుడు పంట డ్రోన్లు వినియోగిస్తున్న దృశ్యం (ఫైల్)

ఐదుగురు టీచర్ల జీతాలకు మోక్షం

- 15 నెలల నిరీక్షణకు తెర ● హైకోర్టు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



ఒంగోలు విద్య, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జీతాల కోసం ఎదురుచూస్తున్న ఐదుగురు ఉపాధ్యాయుల జీతాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 15 నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్న వీరి నిరీక్షణకు తెరపడింది. జీతాల చెల్లింపు విషయంలో హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. వీరికి జీతాలు చెల్లించాలని ఆదేశిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2023 సెప్టెంబరు నుంచి 2024 జనవరి వరకు ప్రభుత్వ ఉత్తర్వులతో బదిలీ అయిన 11 మంది ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ 11 మందిలో ఐదుగురు జిల్లావారున్నారు. ఒకరు కృష్ణ జిల్లా, మరో ఐదుగురు చిత్తూరు జిల్లాలో టీచర్లుగా ఉన్నారు. ప్రస్తుతం అలూరు జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న బి.తిరుపతయ్య, కొత్తపట్నం జడ్పీలో పనిచేస్తున్న జి.సుబ్బారెడ్డి, ఆరవల్లిపాడు జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న వి.పద్మజ, దైవాలరావురు జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న ఎన్.వెంకట అనూష, కొనకనమిట్ల మండలం మద్దిమడుగులో పనిచేస్తున్న అరుణలను 2023 డిసెంబరులో ప్రభుత్వ ఉత్తర్వులతో ఈ పాఠశాలల్లో బదిలీపై చేరారు. వీరిలో తిరుపతయ్య, సుబ్బారెడ్డి, పద్మజ, వెంకట అనూష పరస్పర బదిలీలు కాగా అరుణ సాధారణ బదిలీ అయ్యారు. అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయం సిఫార్సులతో ప్రభుత్వ బదిలీ ఉత్తర్వులు పొందారు. వీరిలో తిరుపతయ్య, సుబ్బారెడ్డిలకు ఇక్కడి ట్రెజరీ అధికారులు మూడు నెలల పాటు జీతాలు చెల్లించారు. ఆ తర్వాత ఈ బదిలీ ఉత్తర్వులను ఆర్థికశాఖ ఆమోదంకాలేదని ఈ 52 మంది టీచర్లకు జీతాలు నిలిపివేశారు. ఆ తర్వాత ఆర్థికశాఖ ఆమోదం కోసం ఇక్కడి డీఈవో కార్యాలయం నుంచి పొరపాటున 52 మందికి బదులుగా 47 మంది వివరాలను పంపారు. ఆ 47 మందికి ఆర్థికశాఖ ఆమోదం లభించింది. దీంతో జరిగిన పొరపాటును గుర్తించి ఈ ఐదుగురు టీచర్ల వివరాలను మళ్లీ పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి పంపారు. తర్వాత కమిషనర్ కార్యాలయం వీరి గురించి పట్టించుకోలేదు. అప్పటి నుంచి డీఈవో, కమిషనర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. దీంతో ఆ ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. 15 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంపై హైకోర్టు సీరియస్ అయింది. వెంటనే ఆ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడంతో విద్యాశాఖ అధికారులు డిసెంబరు నెల వరకు జీతాల బిల్లులు సమర్పించంతో ఆమోదం కూడా జరిగిపోయింది.

టంగుటూరు - పొదిలి రోడ్డు అభివృద్ధి పనులకు గ్రహణం!

- ఆరేళ్ల క్రితం రూ.39 కోట్లు మంజూరు
- నేటికీ పనులు ప్రారంభించని కాంట్రాక్టర్
- తరచూ ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు


అధ్వానంగా ఉన్న టంగుటూరు-పొదిలి రహదారి

మర్రిపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అతిప్రధానమైన టంగుటూరు-పొదిలి రహదారి అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. ఆరేళ్ల క్రితం నిధులు మంజూరైనప్పటికీ నేటికీ ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి రూ.39కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులతో టంగుటూరు బస్టాండ్ కూడలి నుంచి కిలో మీటర్ మేర సీసీ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. పెట్లూరు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించి బోయవారిపాలెం వరకు పెట్లూరు చెరువుకట్ట కింద రెండు వరసల రహదారిని ఏర్పాటు చేయాలి. కూచిపూడి నుంచి పొదిలి వరకూ రెండు వరుసల రోడ్డుగా అభివృద్ధికి ప్రతిపాదించారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత టెండర్లను ఖరారు చేశారు. అప్పట్లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సర్వేలతో సరిపుచ్చారు. పనులు చేయకుండానే కాలం వెల్లదీశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రహదారి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని మండల ప్రజలు ఆశించారు. కానీ కాంట్రాక్టర్ మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో రోడ్డు అభివృద్ధి పనులపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఐదేళ్లుగా ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా మర్రిపూడి చెరువుకట్ట కింద రోడ్డు పక్కనే ఉన్న కోనేరుల వద్ద 40ఏళ్ల క్రితం నిర్మించిన రక్షణ గోడలు కూలిపోయాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అటు వాహనచోదకులు, ఇటు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీనికి తోడు ఇటీవల ఈ రహదారి నుంచే బెంగళూరు, చెన్నై, కేరళకు గ్రానైట్ అక్రమ రవాణా సాగుతోంది. భారీ వాహనాల రాకపోకలతో రహదారి మరింత అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం మంత్రిగా ఉన్న డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జోక్యం చేసుకొని పనులు ప్రారంభించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.


కోనేరుల వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు

18 ఏళ్లు నిండినవారు ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు



ఒంగోలు కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల కమిషన్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఓటు హక్కు నమోదు, ఓటు హక్కు వినియోగించుకోవడం, కొత్త ఓట్ల నమోదు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 1950లో భారత ఎన్నికల సంఘం ఏర్పాటు జరిగాక ఈ 73 ఏళ్ల కాలంలో ఓట్ల నమోదుకు అనేక మార్పులు తెచ్చింది. ఎన్నికల నిర్వహణలో సంస్కరణలతో పాటు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తమ మొబైల్ ద్వారానే ఓటు హక్కును నమోదు చేసుకోనే విధంగా అనేక మార్పులు తెచ్చింది. 2011 జనవరి 25వ తేదీన ప్రతి ఏటా ఓటర్ల దినోత్సవం నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంతో అందుకు అనుగుణంగా ఓటర్ల దినోత్సవాన్ని పోలింగ్ కేంద్రాల నుంచి జిల్లాస్థాయి వరకు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సాధారణ ఓటర్లు, సర్వీసు ఓటర్లు కలిపి 18,26,103 మంది ఓటర్లు ఉన్నారు. 18 ఏళ్ల పైబడిన యువకులు 23,149 మంది ఈ ఏడాది ఓటు హక్కు పొందారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల్లో పాలకులను ప్రజలే స్వయంగా ఎన్నుకొనే హక్కును భారత రాజ్యాంగం కల్పించింది. అందుకే మన దేశంలో ఓటరుకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. తన ఓటు హక్కుతో నచ్చిన వారిని అందలం ఎక్కించగల శక్తి కల్పించారు. ఎంతో విలువైన ఓటు హక్కును అందరికీ కల్పించేందుకు ప్రతిఏటా కేంద్ర ఎన్నికల సంఘం విస్తృతంగా ప్రచారం చేస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతూ వస్తోంది. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున కొత్తగా నమోదు చేసుకున్న యువతీ యువకులకు ఓట్ల నమోదుతోపాటు కొత్త ఎపిక్ కార్డులను కూడా అందజేయన్నారు. ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓట్లు వేసిన సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించే విధంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. జాతీయ ఓటర్ల దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు పోలింగ్ కేంద్రాల వారీగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

గీత కార్మికులకు మద్యం దుకాణాలు

- లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన జేసీ

ఒంగోలు క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు కేటాయించిన 17 మద్యం దుకాణాలను ఆయా ఉపకులాలకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. శుక్రవారం స్థానిక ప్రకాశం భవన్‌లో గల జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రక్రియ జరిగింది. జేసీ ఆర్.గోపాలకృష్ణ ఆధ్యక్షతన 17 మద్యం దుకాణాలకు లాటరీ తీసి ఆయాప్రాంతాలను ఆయా ఉపకులాలకు కేటాయించారు. గౌడ్‌కు 7 కేటాయించగా ఒంగోలు, సీఎస్‌పురం, పీసీపల్లి, రాచర్ల, తర్లుపాడు, బేస్తవారపేట, గిద్దలూరు రూరల్ కాగా మార్కాపురం మున్సిపాలిటీలో ఒక దుకాణం గౌండ్లకు రిజర్వు చేశారు. గౌడా కులానికి పొన్నలూరు, మర్రిపూడి, అర్ధవీడు, వెలిగండ్ల, పుల్లలచెరువు, సంతనూతలపాడు, కొనకనమిట్లలు ఎంపికయ్యాయి. అదేవిధంగా మద్దిపాడు గమళ్ల, మార్కాపురం రూరల్ ఈడిగ ఉపకులాలకు కేటాయించారు.

27 నుంచి దరఖాస్తులు

కల్లుగీత కార్మికులకు కేటాయించిన దుకాణాలకు ఈనెల 27 నుంచి వచ్చేనెల 5 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చేనెల 6న పరిశీలన అనతరం 7న లాటరీ పద్ధతిలో యజమానులను ఎంపిక చేసి లైసెన్సులు మంజూరుచేయనున్నారు.

అమరావతిలో రిపబ్లిక్ డే పరేడ్‌కు కనిగిరి యువకుడు ఎంపిక


హర్షవర్ధన్ (ఫైల్)

కనిగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమరావతిలో ఈ నెల 26వ తేదీ జరిగే పరేడ్‌కు కనిగిరికి చెందిన యువకుడు ఎంపికయ్యారు. మండలంలోని కొత్త ఏరువారిపల్లికి చెందిన కలిగిరి హర్షవర్ధన్ గ్రామ హైస్కూల్‌లో 10వ తరగతి, ఆ తర్వాత ఇంటర్ పూర్తి చేసిన అనంతరం నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్‌లో చేరాడు. అక్కడ ఎన్‌సీసీ సెలక్షన్స్‌లో ఎంపికయ్యాడు. అప్పటి నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలతోపాటు 12సార్లు రక్తదానం చేసి ఎంతో మందికి ప్రాణదాతగా నిలిచాడు. సమాజసేవలో ఎప్పుడూ ముందుంటూ రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి రక్తదానం చేయటంతోపాటు మాదకద్రవ్యాల నిరోధంపై, ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఎన్‌సీసీ కార్యక్రమాలకు ప్రాతినిథ్యం వహించటమే కాకుండా రాష్ట్రస్థాయి ముఖ్య అతిథులకు స్వాగతం పలికే గార్డ్ ఆఫ్ హానర్‌లో కూడా తనదైన ముద్ర వేసుకున్నాడు. 2024 ఫిబ్రవరిలో జరిగిన ఎన్‌సీసీ ఆర్మీ పరీక్షల్లో "సీ" సర్టిఫికెట్ సాధించాడు.


రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


రాకపోకలకు ఇబ్బందిపడుతున్న వాహనదారులు


విద్యుత్ స్తంభానికి గుట్టగా ఉన్న కేబుళ్లు

సుజాతనగర్‌లో సమస్యల తిష్ఠ

- ఇరుకైన రోడ్లు, కనిపించని సైడు కాలువలు
- ఆక్రమణలతో కుచించుకుపోయిన వైనం
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని డివిజన్‌లలోనే అతి పెద్ద వార్డు 37వ డివిజన్. ఇక్కడ సుమారు 10 వేల మంది ఓటర్లు, 10కి పైగా కాలనీలు ఉన్నాయి. అందులో ఒకటైన సుజాత నగర్‌లో సమస్యలు పలకరిస్తే పలుకున్నాయి. గత కొన్నేళ్ళుగా ఆ కాలనీలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రత్యేకించి ఇరుకైన రోడ్లుతో ఆ ప్రాంత జనం నిత్యం అవస్థలు పడుతున్నారు. మురుగునీటి పారుదల కోసం నిర్మించిన కాలువలు కనిపించకుండా పోయాయి. కార్పొరేషన్ లేఅవుట్ ప్రకారం సుమారు 120 అడుగుల వెడల్పు కలిగిన ఆ రోడ్ ఆక్రమణలలో చిక్కుకుంది. ద్విచక్ర వాహనాలు తప్ప, బస్సులు, కార్లు, ఎదురుదెరుగా వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్నారు. మరోవైపు ఇళ్ళలో నుంచి వచ్చే మురుగు నీరు బయటకు పోయే మార్గాలన్నీ మూసుకుపోయాయి. దీంతో పారిశుధ్యం పెద్ద సమస్యగా కనిపిస్తుంది. అంతేగాకుండా రోడ్డుపైనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రతి క్షణం భయపెడుతున్నాయి. ఆవైపు పాఠశాలు ఉండటంతో స్కూలు బస్సులు, కార్లు,


రహదారి వెంట మూసుకుపోయిన సైడుకాలువలు

ద్విచక్రవాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోడ్డుకు అడ్డంగా ఉన్నటువంటి ట్రాన్స్‌ఫార్మర్లతో ఏ క్షణంలో ఏ ప్రమాదం వస్తుందోనని ఆ ప్రాంత ప్రజలు భయపడుతున్నారు. మెయిన్ రోడ్ అంతా ఆక్రమణలతో నిండిపోగా, కాలువలు సైతం ఆక్రమించేయడంతో కొద్దిపాటి వర్షం కురిసినా సుజాతనగర్‌లోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. పేరుకు పెద్ద డివిజన్ అయినా, సమస్యలు కూడా పెద్ద సంఖ్యలో ఉండటంపై ఆ ప్రాంత ప్రజలు పరిష్కారాన్ని కోరుతున్నారు. గతంలో రోడ్డు విస్తరణకు కార్పొరేషన్ అధికారులు మార్కింగ్ చేశారు. అయితే నేటికి ఎలాంటి పురోగతి లేకపోవడంతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు.

ఇల్లు అమ్మలేం.. కొనడానికి లేదు..

సుజాతనగర్‌లోని సర్వే నెం.22ఏలో రిజిస్ట్రేషన్ సమస్య తీవ్ర ఉంది. 1950 నుంచి సుజాత 1 నుంచి 11 లైన్ వరకు 27.16 ఎకరాల భూమిలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. అయితే 2009నుంచి క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. అప్పట్లో ఆ సర్వే నెంబరులోని భూములు దేవదాయ, వక్ఫ్‌బోర్డు భూమిగా తెరపైకి వచ్చింది. దీనిపై అప్పటి తహసీల్దార్ విచారణతోపాటు సర్వే చేసి, రైతువారీ భూమిగా తేల్చి చెప్పారు. రిజిస్ట్రేషన్‌కు ఇబ్బంది లేదని, వివాదానికి సంబంధం లేదని రిపోర్టు ఇచ్చారు. అయినప్పటికీ రిజిస్ట్రేషన్‌కు నిషేధం విధించడంతో ఆప్రాంతంలోని సుమారు 700కు పైగా నివాసులు తమ ఇళ్ళు అమ్ముకోవడానికి, కొనుక్కునే అవకాశం లేకుండా పోయింది. అయితే తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న దామచర్ల జనార్దన్ దృష్టికి తీసుకెళ్ళారు దీనిపై స్పందించిన దామచర్ల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివరించారు. పరిష్కార దిశగా చర్యలు ప్రారంభం అయిన తొలి దశలోనే 2019 ఎన్నికలు రావడంతో సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్ ఉండటంతో సుజాత నగర్‌వాసుల్లో ఆశలు చిగురించాయి. అంక్షల కట్టిడిలో ఉన్న సర్వే నెం.22ఏ భూమి సమస్యకు పరిష్కారం చూపాలని, రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించే దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అండర్ పాస్‌పై ఆశలు

కాగా పాత బైపాస్‌గా పిలుచుకునే ఈ రోడ్డు జాతీయ రహదారి సుజాత నగర్ వాసులకు సమస్యగా మారింది. ఒకవైపు భూమి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడం, మరోవైపు బ్రిడ్జి నిర్మించడంతో ఆప్రాంతానికి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్ పాస్ నిర్మించాలని కోరుతున్నారు. దీని ద్వారా అంజయ్య రోడ్ నుంచి సుజాతనగర్ ప్రాంతానికి రాకపోకలు సులభతరం అవుతాయని, దీర్ఘ కాలంగా ఉన్న అండర్ పాస్ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పారిశుధ్యం బాగా లేదు..
- సుబ్బరాయుడు, స్థానికుడు



కాలనీలో కాలువలు తీసేవారు కరువయ్యారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మునిసిపాలిటీ మాస్టర్ ప్లాన్‌లో 120 అడుగుల రోడ్ ఉంది. కానీ ప్రసుత్తం అది లేదు. దీని ద్వారా రాకపోకలకు అంతరాయం, ట్రాఫిక్ సమస్య ఉంది. కాలువల్లో పూడిక తీసి పారిశుధ్యం మెరుగుపరచాలి. వర్షం వస్తే రోడ్లన్నీ చెరువులుగా మారుతున్నాయి. సమస్యల పరిష్కారం వైపు కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించాలి

ఇరుకు రోడ్లతో అవస్థలు
- వెంకయ్య, స్థానికుడు



గతంలో ఎప్పుడో వేసిన రోడ్లతో ఇబ్బందిగా ఉంది. గతుకుల మయంగా మారిన రహదారులు, ఇరుకుగా ఉండటంతో ఒకేసారి రెండు బస్సులు వచ్చే పరిస్థితి లేదు. రోడ్డుపైన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు, కార్పొరేషన్ అధికారులు పట్టించుకుని సమస్య పరిష్కరించాలి. దోమల సమస్య అధికంగా ఉంది. ఫాగింగ్, బ్లీచింగ్ చేసి పారిశుధ్యం మెరుగుపరచాలి.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ


మహేష్‌ను అభినందిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు విద్య, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీలో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌పోటీల్లో 73 కేజీల విభాగంలో వెండి పతకాన్ని ఆంధ్రకేసరి యూనివర్శిటీ విద్యార్థి ఎన్.మహేష్ సాధించారు. శుక్రవారం స్థానిక యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో వెండిపతకం సాధించిన మహేష్‌ను వీసీ డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబు అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డీడీ దేవీ వరప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా పొదిలి శ్రీవెంకటేశ్వర ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఛైర్మన్ వై.వెంకటేశ్వరరావు, సీఎస్‌పురంలోని బెల్లంకొండ డిగ్రీ కళాశాల ఛైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు తదితరులు మహేష్‌ను అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎంఈవో


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

మద్దిపాడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఎంఈవో ఎంవీఆర్.ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు కడియాల యానాదయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ లెవల్ ఆటల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటలు శారీరక మానసిక ఎదుగుదలకు ఉపయోగమని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి దాసరి రమేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యాయామంపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో చలగల విజయకుమార్, నెహ్రూ యువ కేంద్రం అధికారి కమల్ తదితరులు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీడీలు సౌజన్య, బోయలపల్లి ప్రభావతి, ఉపాధి జేఈ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యం

- డీపీఎం సనిత

సింగరాయకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలలోని ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని డీపీఎం (బీఎల్) సనిత అన్నారు. శుక్రవారం స్థానిక మండల కాంప్లెక్స్‌లోని మహిళా సమాఖ్య కార్యాలయంలో లఖ్‌పతి దీదీ పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా సభ్యులకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకూ రుణా లు అందజేస్తామని తెలిపారు ఇప్పటికే మండలంలో 50 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. రుణాలు తీసుకున్న సభ్యులు వాటిని సకాలంలో బ్యాంకులకు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం (ఎల్‌హెచ్) డేవిడ్, యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజీవ్, ఫీల్డ్ అఫీసర్ సుధాకర్, ఏపీఎం భాగ్యలక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. శనివారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక రామనగర్‌లోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఆదివారం ఉదయం ఉదయం 9 గంటలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవంలో ఆయన పాల్గొంటారు.

ఆడపిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- మంత్రి డాక్టర్ స్వామి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక సాంత్వన సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాలికల సంరక్షణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రతినిధులు బాలికల హక్కులు, ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సీఐ హజరత్తయ్య, డైరెక్టర్ జయకుమార్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కొండపిలో...

కొండపి: బాలికలకు సామాజిక భద్రతతోపాటు, పోషకాహారం అందించి సంరక్షించుకోవాలని ఎంఈవో సురేఖ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ గురుకులంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్ విక్టోరియారాణి, ప్రిన్సిపాల్ అరుణ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

ఒంగోలు విద్య: స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి చదువు ప్రాముఖ్యత, ప్రవర్తనా నియామావళిని వివరించారు. లాయర్ లక్ష్మీకుమారి బాలికా సాధికారత, వారి భవిష్యత్ అనే అంశంపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగ కో ఆర్డినేటర్ పి.ఇందిర, సుష్మా, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

- విధుల నుంచి తప్పుకోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు


మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న ఆంజనేయులు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం అధికారులు తీసుకున్న నిర్ణయాలను కొందరు పెడచెవిన పెడుతున్నారు. పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ప్రక్షాళన చేస్తూ ఉత్తర్వులు జారీ ఇచ్చారు. అందులో భాగంగా 4వ డివిజన్ శానిటరీ కంకణాల ఆంజనేయులు పనితీరుపై అటు ప్రజలే కాకుండా, ఇటు డివిజన్‌లోని కార్మికులు సైతం అనేకసార్లు ఫిర్యాదు చేశారు. మహిళ కార్మికుల పట్ల అసభ్య పదజాలం వాడుతూ మరి కొందరి సిబ్బందిపై దూకుడుగా వ్యవహరించారంటూ వచ్చిన ఆరోపణలపై కమిషనర్ ఇప్పటికే నాలుగుసార్లు మెమో జారీ చేసినా ఆ ఇన్‌స్పెక్టర్ తీరు మారకపోవడంతో ఆంజనేయులను బాధ్యతల నుంచి తొలగించి, గుత్తికొండవారిపాలెం వద్ద డంపింగ్ యార్డు వద్దకు బదిలీ చేశారు. అక్కడకు వచ్చే వాహనాలను నమోదు చేసుకోవడంతోపాటు డంపింగ్ యార్డులో పనులు పర్యవేక్షించాలని కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే కమిషనర్ ఆదేశాలను సైతం లెక్కచేయని ఆంజనేయులు యధావిధిగా డివిజన్‌లో పారిశుధ్య పనులు పర్యవేక్షించడం, మస్టర్ పాయింట్‌లకు వెళ్ళి తనపై ఫిర్యాదులు చేసిన వారిని బెదిరించడం పట్ల కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఆ ఇన్‌స్పెక్టర్ తమకొద్దంటూ శానిటరీ అధికారుల వద్ద వాపోతున్నారు. ఇదిలా ఉండగా, మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్‌లు డి.వెంకటేశ్వర్లు, యు.శ్రీరామ్‌లను ఇన్‌స్పెక్టర్ బాధ్యతల నుంచి తొలగించి, వారిని పారిశుధ్య పనుల పర్యవేక్షణకు మేస్త్రీలుగా నియమించారు. అయితే వారు తమ విధులను నిర్వర్తిస్తున్నారు. దీంతో వారి స్థానంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమితులైన శానిటరీ సెక్రటరీలు డివిజన్‌లలో వెళ్ళినా పాత ఇన్‌స్పెక్టర్‌లు బాధ్యతలను తప్పుకోకపోవడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. కమిషనర్ ఆదేశాలను సైతం లెక్కచేయకపోవడంపై కార్పొరేషన్‌లో చర్చనీయాంశమైంది.

మాజీ మంత్రి పరిటాల రవికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, మాజీ మంత్రి పరిటాల రవి 20వ వర్ధంతిని శుక్రవారం నగరంలోని 36వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక నిర్మల్‌నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దాయనేని ధర్మ, నల్లూరి ప్రదీప్. జీఎస్ఆర్ శ్రీనివాసరావు, గోగినేని రామారావు, యర్ర సారథి, బత్తెర సురేష్, బెజవాడ బుజ్జి, మాజీ మునిసిపల్ ఛైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరిబాబు, శ్రీరామ్మూర్తి, ఎస్ఎస్.చౌదరి, కుబేంద్రరావు, శ్రీనివాసరావు వెంకటసుబ్బయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

80మందికి కంటి వైద్యసేవలు

నాగులుప్పలపాడు: ఒమ్మెవరం గ్రామంలో శుక్రవారం టీడీపీ నేత పరిటాల రవి వర్ధంతిని పురస్కరించుకుని కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఎల్‌వీప్రసాద్ కంటివైద్యశాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మొత్తం 80 మందికి వైద్యపరీక్షలు చేసి వారిలో 20మందిని శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు బాషా, నాగరాజు, టీడీపీ నాయకులు కోట రవి, కోట శ్రీనివాసరావు, అల్లంనేని సాయి, పమిడిమళ్ల వెంకటేశ్వర్లు, పిన్నింటి రఘు, కోట సుమంత్, పిన్నింటి బాలకృష్ణ, సుధీర్, బెల్లం సురేష్, కె.ఆంజనేయులు, భార్గవ్ పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమలకు
పవర్ హాలిడే పొడిగింపు

- కొనసాగుతున్న ఇక్కట్లు

చీమకుర్తి, జనవరి24(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు కరెంట్ కోతల కష్టాలు వీడలేదు. పవర్ హాలిడేను పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ఈ నెల 11నుంచి 22వ తేదీ వరకు పరిశ్రమలకు పవర్ హాలిడే ప్రకటించారు. తిరిగి ఈ నెల 30వరకు పొడిగిస్తూ సవరణ ఉత్వరులు జారీ చేశారు. దీంతో చీమకుర్తి ప్రాంతంలో గ్రానైట్ ఫ్యాక్టరీలకు గురు,శుక్రవారాల్లో పూర్తిగా కరెంట్ సరఫరా నిలిపివేస్తారు. మిగతా రోజుల్లో సాయంత్రం 6గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉన్నా ఉత్పత్తి ప్రక్రియకు ఉపయోగించకూడదు. అంటే మొత్తం మీద వారానికి 168 గంటలకు కేవలం 60గంటలు మాత్రమే కరెంట్ వినియేగించుకొనే అవకాశం ఫ్యాక్టరీలకు ఉంటుంది. దీంతో గ్రానైట్ పరిశ్రమకు ఇక్కట్లు కొనసాగుతున్నాయి. ఉత్పత్తి ప్రక్రియ దాదాపు 30శాతానికి పడిపోయింది. కార్మికులకు ఆదాయాలు సైతం గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో వలస కార్మికులు ఇంటిబాట పడుతున్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు

చీమకుర్తి, జనవరి24(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో బాలోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రతిభాపాటవ పరీక్షలను నిర్వహించారు. చీమకుర్తిలోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలను డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. తదనంతరం జిల్లాలో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, దేశభక్తిగీతాల్లో పోటీలను నిర్వహించారు. 432మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కడవా రామకృష్ణ, సెక్రటరీ కందుకూరి వెంకటసుధాకర్, గొల్లపూడి వెంకట్రావు, పరాంకుశం శ్రీనివాసమూర్తి, అడుసుమల్లి శ్రీనివాసరావు, అంబటి వీరారెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెల్లరేషన్ కార్డుదారులకు బీమా

మద్దిపాడు, జనవరి24(ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్‌కార్డుదారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాన్ని ఉపయోగించుకోవాలని ఎంపీడీవో వి.జ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ రూ.110 చెల్లించి ఈ ఇన్సూరెన్స్ పొందవచ్చని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు వారు అర్హులన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జత చేసి కార్మికశాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

చెరువుకొమ్ముపాలెంలోని
సమస్యలను పరిష్కరించాలి : జనసేన

పొన్నలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుకొమ్ము పాలెం గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జనసేన పార్టీ కొండపి నియోజకవర్గ సమన్వకర్త కనపర్తి మనోజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం గ్రామంలో పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మనోజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో మురికి కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, ఉన్న కాలువల్లో పూడిక తీయించాలని కోరారు. గ్రామ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు షేక్ ఖాజావలి, చిన్నబాబు, మదన్‌మోహన్, పులి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలూరి రమణారావు విగ్రహావిష్కరణ

ఒంగోలు కల్చరల్, జనవరి24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు ఆలూరు వేంకటరమణారావు కాంస్య విగ్రహ ప్రతిష్టాపన శనివారం జరుగుతుందని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కేజీ.శంకర్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక దేవస్థాన ప్రాంగణంలో విగ్రహావిష్కరణ జరుగుతుందని, మధ్యాహ్నం 12 గంటలకు అభినందన సభ, సాయంత్రం 6 గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసులు వీబీ.సాయికృష్ణ యాచేంద్రచే సంగీత గేయధార కార్యక్రమం ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఒంగోలులో ట్రాక్టర్ల ర్యాలీ

నాగులుప్పలపాడు జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26న ఒంగోలులో తలపెట్టిన మోటార్ సైకిల్, ట్రాక్టర్‌ల ర్యాలీని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జె.జయంతిబాబు కోరారు. శుక్రవారం నాగులుప్పలపాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నదాతలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'శ్రీరామ్' ఆధ్వర్యంలో ఆర్టీసీకి ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు


ఫస్ట్‌ఎయిడ్ బాక్సులను అందజేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఒంగోలు డిపో ఆర్టీసీ బస్సులకు ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ చాపల వంశీకృష్ణ చేతుల మీదుగా వాటిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన విద్యాభ్యాసం కోసం ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సాగిందన్నారు. ప్రయాణికుల అత్యవసరమైన ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. డిపో మేనేజరు శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ వంశీకృష్ణ ఆర్టీసీకి అందిస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపట్నం బస్టాండ్ ఆవరణంలో సిమెంట్ బల్లలు కూడా బహూకరించారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ విజయ, సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, ఆర్ఎం కార్యాలయ అధికారి చిన్నయ్య సూరి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీకి 'చీమకుర్తి' సేవలు ఎనలేనివి

- మంత్రి డాక్టర్ స్వామి


చీమకుర్తి వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చీమకుర్తి వెంకటేశ్వర్లు అందించిన సేవలు ఎనలేనివని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం మూలగుంటపాడు ఐటీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వెంకటేశ్వర్లు ద్వితీయ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని స్వామి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, శ్రీకాంత్, షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, సన్నెబోయిన శ్రీనివాసులు, గాంధీచౌదరి, చంటి, గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, గిరి, గుదే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు రాఘవరెడ్డి సహకారం

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సహకారం అందించారు. రోగుల సేవల కోసం కొవిడ్ సమయంలో అందజేసిన బ్యాటరీ వాహనాలు మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారడంతో వాటిని ఆయన తనయుడు రాఘవరెడ్డి తిరిగి వాటిని బాగు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆసుపత్రి అధికారులు, రోగులు మాగుంట కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

15నుంచి కరవదిలో వాలీబాల్ పోటీలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు(రూరల్), జనవరి24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవదిలోని పీఆర్ఆర్ జడ్పీ హైస్కూలులో రిటైర్డ్ హెచ్ఎం సూరిగుచ్చి హనుమంతరావు జ్ఞాపకార్థం రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ పురుష, మహిళల వాలీబాల్ పోటీలు ఫిబ్రవరి14నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పూర్వవిద్యార్థులు తెలిపారు. శుక్రవారం స్థానిక స్కూలులో జరిగిన సమావేశాంలో వారు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ పురుషులు, మహిళలకు వేర్వేరుగా రాష్ట్రస్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలను పూర్వవిద్యార్థులు సహకారంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ ప్రభాకర్, మారెళ్ల ఆంజనేయులు, నన్నపనేని మురళి, గుట్టపల్లి కోటేశ్వరరావు, చాగంటి నాగిరెడ్డి, పల్లపోలు సుబ్బారెడ్డి(పెద్దసుబ్బారెడ్డి), పాలేటి రాజేశ్వరరావు, ఎర్రమనేని ఆంజనేయులు, మారెళ్ల సుధాకరరావు, కాకుమాను బాబురావు, అంచపోగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

- ఆర్డీవో లక్ష్మీప్రసన్న

మద్దిపాడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించిన భూ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆదేశించారు. శుక్రవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ భూమి కన్వర్షన్ అనుమతులు ఇచ్చే సమయంలో అన్ని ధ్రువీకరణ పత్రాలు పొందుపరచాలన్నారు. రీ సర్వే కొలతలు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని చెప్పారు. భూములకు సంబంధించిన ప్రతీ రికార్డును క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అనంతరం సీతారాంపురం కోళ్లఫారం సమీపంలో వెంచర్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజన్‌కుమార్, సర్వేయర్ అంజనీదేవి, రెవెన్యూ అధికారి రమణయ్య పాల్గొన్నారు.

అవీ..ఇవీ


గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

రీసర్వేకు రైతులు సహకరించాలి

● తహసీల్దార్ శైలేంద్రకుమార్

పెద్దారవీడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ అన్నారు. మండలంలోని ప్రగళ్లపాడులో శుక్రవారం రీసర్వేపై రైతులతో గ్రామసభ నిర్వహించారు. తొలుత గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శైలేంద్రకుమార్ మాట్లాడుతూ రైతులు అధికారులు నిర్దేశించిన సమయానికి పొలాల వద్దకు వచ్చి తమ భూములను త్వరితగతిన సర్వేచేసేందుకు ముందుకు రావాలన్నారు. రైతులు అధికారులు సర్వే చేసే సమయంలోనే తమ అనుమానాలను నివృత్తి చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ గోపాలరెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మాంసం విక్రయాలపై నిషేధం

గిద్దలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న ఆదివారం మాంసం విక్రయాలను నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వెంకటదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాంసం అమ్మడాన్ని నిషేధించడమైనదని, 26న ఆదివారం మాంసం దుకాణాలు మూసివేయాలని, ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

గిద్దలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం చోళ్లవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్ని సేవా సంస్థ 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసింది. చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని, లక్ష్యంతో ముందుకు వెళితే మంచి మార్కులు సాధించవచ్చని సంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ ఈసందర్భంగా పేర్కొన్నారు.

ఈ నెల 28 నుంచి 30 వరకు పెన్షన్ల తనిఖీ

త్రిపురాంతకం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 28 నుండి 30 వరకు మండలంలోని పలు గ్రామాల్లో హెల్త్ పెన్షన్లను తనిఖీ చేయనున్నట్లు ఎంపీడీవో జి.రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలో మొత్తం 43 మంది హెల్త్ పెన్షన్లు పొందుతున్నారని తనిఖీ తేదీని ఇదివరకే నోటీసు ద్వారా లబ్ధిదారులకు తెలిపామన్నారు. వైద్య బృందం వచ్చినపుడు ఆయా లబ్దిదారులు అందుబాటులో ఉండి తనిఖీకి సహకరించాలని, అందుబాటులోలేనివారి పెన్షన్‌ను నిలుపుదల చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

శివస్వాములకు చద్ది ఏర్పాటు


చద్ది స్వీకరిస్తున్న శివస్వాములు

ఎర్రగొండపాలెం రూరల్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : శివమాలలు ధరించిన శివ స్వాములకు మహాశివ రాత్రి పర్వదినం వరకు ప్రతి రోజు చద్ది ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం శివ స్వాముల ఆధ్వర్యంలో సద్ది ఏర్పాటు చేశారు. మాలలు ధరించిన స్వాములు శివనామస్మరణతో ఆలయంలో ప్రతి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే శివస్వాములకు ఇబ్బంది లేకుండా చద్ది ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

విద్యతోనే మహిళల అభివృద్ధి

● ఎంపీడీవో నాసర్ రెడ్డి


ఉల్లాస్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో నాసర్ రెడ్డి అన్నారు.స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఏపీఎం డీ పోలయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎర్రగొండపాలెం ఏరియా కో ఆర్డినేటర్ డీ దానం మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలంటే చదువుకోవాలని అదేవిధంగా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. వయోజనవిద్య సూపర్ వైజర్ వెంకటేశ్వర్లు ఉల్లాస్ కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం రామచంద్రకోట, యడవల్లి పంచాయతీలకు సంబంధించిన స్వచ్ఛంద కార్యకర్తలకు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల వాలంటీర్లు, ఓబీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో తగుజాగ్రత్తలు పాటించాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ నరసింహులు మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులు తమ సంస్థను దైవంగా భావిస్తూ, ప్రయా ణికులను సురక్షితంగా గమ్యాలకు చేరుస్తున్నారన్నారు. ప్రైవేట్ వాహనాలతో పోలిస్తే ఆర్టీసీలో రోడ్డు ప్రమాదాలు చాలా తక్కువ అన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి సురక్షిత ప్రయాణం పొందాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఆర్టీసీ యూనియన్‌ల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అతివేగం.. ప్రాణాలకే ప్రమాదం

కంభం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాహనాలను అతివేగంగా నడిపి విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. శుక్రవారం కంభంలో ఫంక్షన్ హాలులో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలకు చెందిన వివిధ వాహనాల డ్రైవర్లు, యజమానుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ మార్కాపురం డివిజన్‌లో ఇటీవల పెరిగిన రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లను హెచ్చరించారు. వేగం కన్నా, ప్రాణం మిన్న అని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పకుండా తెలుసుకోవాలన్నారు. పలువురు మద్యం సేవించి కోరి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వలన ఎదుటి వారి ప్రాణాలు కూడా బలికొంటున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో కంభం సీఐ మల్లికార్జున్, మార్కాపురం ఆర్‌డీవో అమర్‌నాయక్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, కంభం ఎస్సై నరసింహారావు, బేస్తవారపేట ఎస్సై రవీంద్రరెడ్డి, అర్ధవీడు ఎస్సై సుదర్శన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాటి బకాయిలు నేడు చెల్లింపు

● ప్రభుత్వ కార్యాలయాలకు పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు
● ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
● చెల్లింపులకు చొరవ చూపిన కూటమి ప్రభుత్వం
● రూ.13 కోట్లకు రూ.9.14 కోట్ల చెల్లింపు


వైపాలెంలోని 11 కేవీ సబ్ స్టేషన్

ఎర్రగొండపాలెం రూరల్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయంలో భారీగా పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఆ బాధ్యత తమది కాదని పూర్తిగా వదిలేసింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.9.14 కోట్లు విడుదల చేసింది.

నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో రూ.13 కోట్ల మేర విద్యుత్ బకాయిలున్నాయి. నెలవారీ బిల్లులు చెల్లించకపోవడంతో ఒక్కో కార్యాలయం నుంచి లక్షల్లో బకాయిలు పెడింగ్‌లో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ శాఖ పెండింగ్ బిల్లుల చెల్లింపుల ఊసేంతిన పాపాన పోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆయా కార్యాలయ పరిధిలో పెండింగ్ ఉన్న బిల్లులకు నిధులు విడుదల చేసింది. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని 11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో సుమారు రూ.13.33కోట్లకు పైగా బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇందుకు గాను రూ.9.14 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. 11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లల చెరువు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో ప్రస్తుత పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల బకాయిల వివరాలు ఇలా ఉన్నాయి..

ఎర్రగొండపాలెం మండలంలో

పంచాయతీరాజ్‌లో 23 సర్వీసులుకు గాను రూ.49.75లక్షలు, మెడికల్ ఎడ్యూకేషన్ 15 సర్వీసులకు గాను రూ.22.23లక్షలు, ఇంటర్ కళాశాలలు 61 సర్వీసులకు గాను రూ.16.29 లక్షలు, రెవెన్యూ 3 సర్వీసులకు గాను రూ.3.43లక్షలు, సోషల్ వెల్ఫేర్ 10 సర్వీసులకు గాను రూ.7.74లక్షలతో పాటు పలు శాఖలలో మొత్తం కలపి సుమారు 217 సర్వీసులకు గాను రూ.1.08కోట్లు ఇంకా పెండింగ్‌లో ఉంది.

పుల్లలచెరువు మండలంలో

టెక్నికల్ ఎడ్యూకేషన్ 76 సర్వీసులకు గాను 10.23లక్షలు, పంచాయితీరాజ్ 13 సర్వీసులకు గాను రూ.52.61లక్షలు, ఇంటర్ ఎడ్యూకేషన్ 58 సర్వీసులకు గాను రూ.4.74 లక్షలతో పాటు ఇతర శాఖలకు సంబందించి మొత్తం రూ.72.76లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.

త్రిపురాంతకం మండలంలో

అగ్రికల్చర్, ఎడ్యూకేషన్, పోలీస్‌శాఖ, పంచాయతీ రాజ్, సీపీడీఏలతో పాటు మొత్తం 223 సర్వీసులకు గాను రూ.61.79 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోని విద్యుత్ బకాయిలను చెల్లించడంతో ప్రభుత్వ యంత్రాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని విద్యుత్ శాఖ అధికారులు అన్ని శాఖ అధికారులను, సిబ్బందిని కోరుతున్నారు. విద్యుత్‌ను ఆదా చేసి మరోకరికి వెలుగులు నింపేలా చూడాలని పేర్కొంటున్నారు.

ప్రజాసమస్యల తక్షణ పరిష్కారానికి ప్రాధాన్యత

● మన ఊరు మన ఎమ్మెల్యే కార్యక్రమానికి నారాయణరెడ్డి శ్రీకారం
● ఒకటవ వార్డులో పర్యటన


వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకే 'మన ఊరు- మన ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక 1వ వార్డులోని తూర్పువీధిలో శుక్రవారం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఉదయం 6.30 గంటల నుంచి సుమారు మూడు గంటల పాటు వార్డులోని అన్ని ప్రాంతాల్లో తిరిగారు. ఈ సందర్భంగా ప్రజలు తెలియజేసిన సమస్యలను అక్కడికక్కడే అధికారులకు తెలిపి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా వార్డును ఆనుకుని ఉండే చెరువు పంట కాలువ మురికి నీటితో నిండి దుర్గంధం వెదజల్లుతున్నట్లు తెలుసుకున్నారు. అంతేకాక ఆ కాలువను ఆనుకుని ఉన్న దారి కుంచించుకుపోవడంతో పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు రైతులు తెలిపారు. వెంటనే కాలువను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ నారాయణ రావును ఎమ్మెల్యే కందుల ఆదేశించారు. అంతేకాక సర్వే చేసి ఆ దారిని పునరుద్ధరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అదే విధంగా వార్డు పరిధిలో సాగర్ పైప్‌లైన్ నిర్మించినా రహదారులకు మరమ్మతులు చేయని విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. పట్టణమంతా ఆ సమస్య ఉన్నందున పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేసి నూతనంగా సీసీ రహదారిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఎమ్మెల్యే కందుల ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, వక్కలగడ్డ మల్లిఖార్జున్, షేక్ మౌళాలి, మాలపాటి వెంకటరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, గుంటక వెంకటరెడ్డి, మారంరెడ్డి రామకృష్ణారెడ్డి, పఠాన్ ఖాన్, మయూరి ఖాశిం, గులాబ్, దూపాటి యలమంద పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రను కలిసిన ఎమ్మెల్యే కందుల


మంత్రి రవీంద్రతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

మార్కాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శుక్రవారం కలిశారు. రాజధాని అమరావతిలోని సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో కలిసిన నారాయణరెడ్డి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా స్థానిక ఇండ్రస్ట్రియల్ ఎస్టేట్‌లోని వ్యాపారులకు జీఎస్టీ పరిమితిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్టేట్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వచ్చే సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే విద్యాకిట్లలో మార్కాపురం పలక ఉండేలా చేస్తే కార్మికులపై ఆధారపడిన పరిశ్రమకు మళ్లీ పూర్వవైభవం వస్తుందన్నారు. సమస్యలను విన్న మంత్రి రవీంద్ర తప్పక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ నాయకులు సూర పరమేశ్వరరెడ్డి ఉన్నారు.

పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కొమరోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశువైద్యశిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలో శుక్రవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం రైతులు ఆర్థికంగా నిలబడేందుకు గ్రామాల్లో పశుసంపదను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పశువులను విరివిగా పెంచుకొని ఆర్థికంగా నిలబడాలన్నారు. గ్రామాల్లో గేదెలు, కోళ్లు, మేకలు, గొర్రెలు వంటి వాటిని పెంచుకోవడమేకాక వాటిని రోగాల నుంచి కాపాడుకోవాలన్నారు. 900 గొర్రెలు, మేకలకు నట్ల నివారణకు మందులను, 200 కోళ్లకు వ్యాధులు రాకుండా మందులను, 360 కేసుల పశువులకు దాణా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ నాగార్జున, సహాయకులు కరీష్మ, నీలిమా, చాణిక్య, శ్రీనివాసులు, కొండారెడ్డి, రైతులు ముత్తుముల యల్లారెడ్డి, రమణయ్య, ప్రసాదు,పోలిరెడ్డి, శేషయ్య, మద్దిలేటి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి

గిద్దలూరు : మేకలు, గొర్రెల్లో వస్తున్న గొంతువాపు, గాలికుంటు, జ్వరాలాంటి వ్యాధుల నివారణ కోసం వెంటనే చర్యలు చేపట్టాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుమలరావు డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులతో కలిసి ఆయన మండలంలోని జయరాంపురం, కే.ఎస్.పల్లి, తిమ్మాపురం గ్రామాలలో పర్యటించి గొర్రెలు, మేకల పెంపకందారులతో మాట్లాడారు. పశువుల ఆస్పత్రిలో సరిపడ మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

బాలుర ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ


సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం నేతృత్వంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బృందంలోని అధికారులు ఎం.వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణల ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, పీఎం పోషణ సమగ్ర శిక్షణ ద్వారా అందుతున్న వివిధ వనరుల వినియోగం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివిధ స్థాయిలలో పొందిన పథకాలు, క్రీడా సంబంధిత అంశాలపై తనిఖీలు చేశారు. దీనిలో భాగంగా 28 రకాల రిజిస్టర్లు, డాక్యుమెంట్లు తదతర అంశాలు క్షుణ్ణంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి పరిసరాల పరిశీలన, నీటి సరఫరా, తరగతుల నిర్వహణ తదితర అంశాలు పరిశీలించి విద్యార్థుల నుంచి సమాచారాన్ని సేకరించారు. అనంతరం పాఠశాలలో గ్రామసభ నిర్వహించారు. వివిధ అంశాలు చర్చించి వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకు న్నారు. అన్ని అంశాలపై తనిఖీ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శర్వాణి, మేనేజ్‌మెంట్ స్కూల్ కమిటీ వైస్ ఛైర్మన్ ముంతాజ్, స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గిద్దలూరు టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వ్యక్తి తన ఇంటిలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. అందిన సమాచారం మేరకు పట్టణంలోని అర్బన్ కాలనీలో సాగర్ (60) అనే వ్యక్తి ఇంటిలోనే మృతిచెందగా, ఇంటి నుంచి దుర్వాసన వచ్చింది. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ సీఐ కె.సురేష్ ఆ ఇంటి తలుపులు తీయించి చూడగా సాగర్ మృతిచెంది ఉన్నాడు. సాగర్ కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో ఉండడంతో సాగర్ ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. సాగర్‌కు గుండెకు సంబంధించిన వ్యాధులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆత్మహత్య చేసుకున్నాడా..? గుండెపోటుకు గురయ్యాడా అనే అంశాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందుల దుకాణంలో ఆకస్మిక తనిఖీ


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకటరమణ

గిద్దలూరుటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు పురుగు మందు దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కనిగిరి సహాయ వ్యవసాయ సహాయకులు ఇ.వెంకట రమణ, వ్యవసాయాధి కారి విజయ భాస్కర్‌రెడ్డి శుక్రవారం పట్టణంలోని చీతిరాల నాగేశ్వరరావు, శ్రీకృష్ణ ట్రేడర్స్ దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిష్టర్లు, బిల్‌బుక్స్, ఇన్‌వాయిస్‌లు, ప్రిన్సిపల్ సర్టిఫికేట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూ.2,23,300 విలువైన స్టాక్ అమ్మకాలను నిలిపివేశారు. స్టాక్ బోర్డులో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఏ మందులు పడితే ఆ మందులు కాకుండా రైతులు అడిగిన మందులను మాత్రమే ఇవ్వాలన్నారు.

పరిటాల రవికి నివాళులు


పరిటాల రవి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, దివంగత పరిటాల రవి వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఎన్‌టీఆర్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు డాక్టర్ మన్నె రవీంద్ర పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలను ఆయన కొనియాడారు. నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఓవర్ లోడుపై సీఐ ఆగ్రహం

కంభం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలోని అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై పరిమితికి మించి మిర్చి లోడుతో ట్రాక్టర్ వెళుతుండగా ఆపి సీఐ మల్లికార్జునరావు వాహన డ్రైవర్‌కు కౌన్సిలింగ్ ఇచ్చారు. గురువారం రాత్రి 11గంటల సమయంలో వాహనాల తనిఖీలు చేస్తున్న సమయంలో గుంటూరు వైపు వెళుతున్న ఓవర్ లోడు ట్రాక్టర్‌ను ఆపి మందలించి జరిమానా విధించాలని ఎస్సైని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నా, మార్పు రాకపోతే ఎలా అని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా కృషి చేయాలి


ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో సుబ్రహ్మణ్యం

పెద్దారవీడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేయాలని ఎంఈవో శింగంపల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని బద్వీటి చెర్లోపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధనకే ప్రణాళిక బద్ధంగా ముందుకు పోవాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన ప్రణాళిక ప్రకారం స్లిప్‌టెస్ట్‌లు నిర్వహించాలన్నారు. మూల్యాంకనం ద్వారా విద్యార్థులను గ్రేడింగ్ విధానంలో స్థాయిలను నిర్ధేశించాల న్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రత్నశంకర్‌నాయక్, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ఎర్రగొండపాలెం రూరల్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక కస్తూరీబా గాంధీ విద్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో పి.ఆంజనేయులు హాజరయ్యారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.పద్మజ మాట్లాడుతూ బాలికలు ఎదుర్కొనే అసమానతుల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2008 సంవత్సరంలో మహిళ, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు వారికి ఉన్న హక్కుల గురించి అవగాహన కల్పించారు. ముందుగా విద్యాలయ అవరణలో ప్రతి బాలికతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేకాధికారి తిరుమల దేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్ రామ సుబ్బమ్మ, రామ కుమారి, పద్మా, షేక్ షాహిద్, విజయ లక్ష్మీ, ఉపాధ్యాయునులు కె. జ్యోతి, ఆర్ పద్మా, వై నాగమణి, పి మేరిసుజాత పాల్గొన్నారు.


గిద్దలూరులో మాట్లాడుతున్న స్వరూపారెడ్డి

బాలికలు దేశానికే గర్వకారణం

గిద్దలూరు : ఆడపిల్ల దేశానికే గర్వకారణమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా స్థానిక రాజు పారామెడికల్ కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్వరూపారెడ్డి మాట్లాడుతూ బాలికలకు తమ హక్కుల పట్ల అవగా హన కల్పించాలన్నారు. లింగవివక్షను రూపు మాపాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ మండల అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, రాజుపారామెడికల్ కళాశాల కరస్పాండెంట్ కె.రాజు, లెక్చరర్లు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

మార్కాపురం రూరల్ : సమాజంలో బాలికల సంరక్షణ మన అందరి బాధ్యత అని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నుండి బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు, బాలికలతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. బాలికలతో కలిసి 'భేటీ పడావో భేటీ బచావో, ఆడపిల్లను రక్షిద్దాం బాల్య వివాహాలను నిరోదిద్దాం' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాలికలు విద్య మీదనే దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సుశీల, సూపర్ వైజర్లు, రెవెన్యూ అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు : జాతీయ బాలిక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బద్వీటి చెర్లోపల్లిలో సీడీపీవో పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థినులతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. బాలిక ఆవశ్యకత, భద్రత తదితర అంశాలకు సంబంధించి ప్లేకార్డులు ప్రదర్శించి నినానాదు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎన్. అంజమ్మ, ఎం. లక్ష్మీదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.


మార్కాపురంలో మొక్కనాటుతున్న చిన్నారులు

కంభం : కంభంలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంభం బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమూల్య హాజరయ్యారు. బాలికలు చదువులోనే కాకుండా అన్ని రంగాలలో రాణిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కిశోర బాలికలు పాల్గొన్నారు. అంతకు ముందుగా విద్యార్థినులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఆర్టీసీ పార్శిల్ సర్వీస్‌లో దోపిడీ

చిన్న వస్తువులకు అధిక మొత్తంలో వసూళ్లు

బిల్లుతో సంబంధం లేకుండా మామూళ్లు



దర్శి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దర్శి ఆర్టీసీ పార్శిల్ సర్వీస్‌లో దోపిడీ జరుగుతోంది. నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. బిల్లులతోపాటు అదనంగా మరికొంత పిండుతున్నారు. దీంతో ప్రజలు తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చేతితో పట్టుకుని పార్శిల్‌కు సైతం హమాలీ చార్జీలు వసూలు చేస్తుండడం గమనార్హం. కొన్ని సందర్భాల్లో సంబంధిత పార్శిళ్లు వేసే ప్రాంతాలకు వెళ్లి వచ్చినా అంత ఖర్చు కాదని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఒక వ్యక్తి విజయవాడకు 200 గ్రాముల బరువు కల్గిన పార్శిల్ పంపించగా రూ.47 ట్రాన్స్‌పోర్టు చార్జీలు, హమాలీ చార్జీలు రూ.15, ఇన్సూరెన్స్ చార్జీ రూ.5, ఎస్‌జీఎస్టీ రూ.6, సీజీఎస్టీ రూ.6 మొత్తం రూ.80 బిల్లు వేశారు. నిర్వాహకుడు బిల్లుతోపాటు అదనంగా మరో రూ.10 కలిపి రూ.90 చెల్లించాడు. 200 గ్రాముల బరువు కల్గిన కవరుకు హమాలీ చార్జీలు, రెండు రకాల జీఎస్టీలతో పాటు అదనంగా మామూలు వసూలు చేయటంతో ఆ వ్యక్తి విస్మయం వ్యక్తం చెందాడు. దర్శి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పార్శిల్ సర్వీస్‌లో నిత్యం ఈ దోపిడీ జరుగుతోంది. ఇక్కడకు ప్రతిరోజు వందలాది మంది పార్శిళ్లు వేసేందుకు వస్తుంటారు. అందరి వద్ద బిల్లులతో పాటు అదనపుంగా వసూలు చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అడ్డగోలు తవ్వకాలు

ఓఎఫ్‌సీ కేబుల్ వేయడానికి గుంతలు తవ్విన వైనం

రోడ్డు పక్కనే ఉండడంతో కనిపించక ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

కురిచేడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు టెలిఫోన్ ఆపరేటరు ఓఎఫ్‌సీ కేబుల్ వేయడానికి రోడ్డు పక్కనే అడ్డగోలుగా గుంతలు తవ్వారు. రాత్రి పూట అవి కనిపించక ప్రయాణికులు వాటిల్లో పడి గాయాలపాలవుతున్నారు. కురిచేడు నుంచి నమఃశ్శివాయపురం, పెద్దవరం, దేకనకొండ, పోతవరం మీదుగా దర్శికి ఓ ప్రైవేటు టెలికం ఆపరేటరు ఓఎఫ్‌సీ కేబుల్ వేయడానికి రోడ్డు పక్కనే గుంతలు తవ్వారు.

● నిబంధనలు ఇలా...

భవిష్యత్ అవసరాలను గుర్తుంచుకుని రోడ్డుకు కనీసం 5 మీటర్ల దూరంలో రైతులతో మాట్లాడుకుని వారి భూముల్లో గుంతలు తీసి కేబుల్ వేయాలి. ఇక్కడే ఓ చిక్కు ఉంది... రైతుల భూముల్లో కేబుల్ వేస్తే నష్టపరిహారం చెల్లించాలి. రోడ్డు పక్కనే కేబుల్ వేస్తే ప్రభుత్వానికి ఎటువంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. దీనిని ఆసరాగా తీసుకుని రోడ్డు పక్కనే గుంతలు తీసి కేబుల్ వేస్తున్నారు.



రోడ్డు పక్కనే తవ్విన గుంతలు



● సాగర్ కాలువ వంతెన పక్కనే గుంత

దేకనకొండ రోడ్డు నుంచి బయ్యవరం గ్రామానికి వెళ్లాలంటే సాగర్ కాలువ బ్రిడ్జి దాటగానే కాలువ కట్టమీద పోవాలి. ఆ బ్రిడ్జిని పక్కనే పెద్ద గుంత తీశారు. దీనివల్ల బయ్యవరం వెళ్లే గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదమరిస్తే అందులో పడే పరిస్థితి. వెంటనే కేబుల్ వేయడానికి తీసిన గుంతలు పూడ్చాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బయ్యవరం సాగర్ కాలువ బ్రిడ్జి వద్ద కేబుల్ వేయడానికి తవ్విన గుంతలు

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవం

అవీఇవీ



త్యాగరాజస్వామిని ఊరేగిస్తున్న నాయీబ్రాహ్మణులు

దొనకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరబ్రహ్మేంద్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు బొమ్మలాపురం వెంకటయ్య ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. త్యాగరాజస్వామి పటంతో వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణసంఘం అధ్యక్షుడు ఎడమకంటి మస్తానయ్య, కార్యదర్శి గుడిపాటి నాసరయ్య పాల్గొన్నారు.

నూతన ఏజీపీగా రవీంద్ర నియామకం



ముప్పరాజు రవీంద్రబాబు

దర్శి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దర్శి కోర్టులలో న్యాయవాదిగా పనిచేస్తున్న ముప్పరాజు రవీంద్రబాబు నూతన ఏజీపీగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. మండలంలోని తూర్పువీరాయపాలేనికి చెందిన రవీంద్రబాబు పదేళ్లుగా న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఏజీపీ పదవి దక్కింది. దర్శి సీనియర్ సివిల్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఆయన ప్రభుత్వ న్యాయవాదిగా కేసులను వాదిస్తారు.

ఓవర్‌లోడ్‌తో ఆటోలు నడిపితే కఠిన చర్యలు



ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎంవీఐ రవికుమార్

దర్శి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లే ఆటోలపై కఠిన చర్యలు తీసుకుంటామని దర్శి మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ హెచ్చరించారు. దర్శి-తూర్పుచౌటపాలెం రోడ్డులో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటోలను ఆయన పట్టుకున్నారు. ఒక్కొక్క ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు ఉండటంతో డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వైద్య సేవలు పునఃప్రారంభం



వైద్యశాలను పరిశీలిస్తున్న డాక్టర్ గద్దె ఏడుకొండలు

పామూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభాలదిన్నెలో మూతపడిఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను టీడీపీ నాయకులతో కలిసి ఇన్‌చార్జి డాక్టర్ గద్దె ఏడుకొండలు శుక్రవారం పునఃప్రారంభించారు. పాత పంచాయతీ కార్యాలయంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో వైద్యసేవలు అందిస్తానని డాక్టర్ చెప్పారు. శుక్రవారం 30 మందికి వైద్య సేవలు అందించారు. పాత వైద్యశాలను పరిశీలించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య, గొల్ల వీరబాబు, మండల సమైఖ్యా అధ్యక్షులు ఓరుగంటి సుబ్బమ్మ పాల్గొన్నారు.

16వ మహాసభలను జయప్రదం చేయాలి



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పామూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అఖిలభారత యువజన సమైఖ్య జిల్లా 16వ మహాసభలు ఈ నెల 26 తేదీన ఒంగోలులో జరగనున్నాయని జిల్లా నాయకులు సురేష్ చెప్పారు. స్థానిక జీవైఆర్ భవన్‌లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు పాల్గొన్నారు.

సుకన్య పథకం కింద 40 ఖాతాలు నమోదు



దరఖాస్తు తీసుకొంటున్న ఎస్‌పీఎం

పామూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పామూరు సబ్ పోస్టాఫీస్ పరిధిలో 40 సుకన్య సమృద్ధి యోజన అకౌంట్లను ప్రారంభించినట్లు ఎస్‌పీఎం తిరుపాలు తెలిపారు. జిల్లా పోస్టల్ అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమం శుక్రవారం నిర్వహించినట్లు తెలిపారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు అందజేస్తున్న టీడీపీ అధ్యక్షుడు వెంగయ్య

సీఎస్‌పురం/పామూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య చెప్పారు. మండలంలోని చెర్లోపల్లి, ఉప్పలపాడు గ్రామంలో ఉచిత పశువైద్యశిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సహాయసంచాలకులు ఆర్ రమేష్, సర్పంచ్ కామనబోయిన రమణమ్మ, జేవీవో ఎస్ శ్రీనివాసులు పాల్గొన్నారు. పామూరు మండలం బొట్లగూడూరులో టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కమిటీ ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి ఉచిత పశువైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వై బాల, పశువైద్యాధికారి ఈమని శ్రీసాయి, రమణయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌పీ ఆవరణలో చిల్లచెట్ల తొలగింపు



చిల్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ముండ్లమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరులోని ఎన్‌ఎస్‌పీ డీఈ కార్యాలయం ఆవరణ చుట్టూ దట్టమైన చిల్లచెట్లతో నిండి పోయింది. ఇటీవల మోదేపల్లి మేజరుకు డీసీ చైర్మన్‌గా ఎన్నికైన కంచుమాటి శ్రీనివాసరావు ఎన్‌ఎస్‌పీ సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి రెండు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్‌తో చెట్లను తొలగిస్తున్నారు. చెట్లను తొలగించటంపై నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు చైర్మన్ వులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణిలు, ఎన్‌ఎస్‌ఈ డీఈ పూర్ణచందు అభినందించారు.

రైతులు తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేయాలి

ముండ్లమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని ఏవో ఫరూక్ చెప్పారు. ఆయన శుక్రవారం మండలంలోని కెల్లంపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

15నుంచి కరవదిలో వాలీబాల్ పోటీలు

ఒంగోలు(రూరల్), జనవరి24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవదిలోని పీఆర్‌ఆర్ జడ్పీ హైస్కూలులో రిటైర్డ్ హెచ్‌ఎం సూరిగుచ్చి హనుమంతరావు జ్ఞాపకార్థం రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ పురుష, మహిళల వాలీబాల్ పోటీలు ఫిబ్రవరి14నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పూర్వవిద్యార్థులు తెలిపారు. శుక్రవారం స్థానిక స్కూలులో జరిగిన సమావేశంలో వారు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ పురుషులు, మహిళలకు వేర్వేరుగా రాష్ట్రస్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

గ్రానైట్ పరిశ్రమలకు పవర్‌హాలిడే పొడిగింపు

● కొనసాగుతున్న ఇక్కట్లు

చీమకుర్తి, జనవరి24 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు కరెంట్ కోతల కష్టాలు వీడలేదు. పవర్ హాలిడేను పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ఈ నెల 11నుంచి 22వ తేదీ వరకు పరిశ్రమలకు పవర్ హాలిడే ప్రకటించారు. తిరిగి ఈ నెల 30వరకు పొడిగిస్తూ సవరణ ఉత్వరులు జారీ చేశారు. దీంతో చీమకుర్తి ప్రాంతంలో గ్రానైట్ ఫ్యాక్టరీలకు గురు,శుక్రవారాల్లో పూర్తిగా కరెంట్ సరఫరా నిలిపివేస్తారు. మిగతా రోజుల్లో సాయంత్రం 6గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉన్నా ఉత్పత్తి ప్రక్రియకు ఉపయోగించకూడదు. అంటే మొత్తం మీద వారానికి 168 గంటలకు కేవలం 60గంటలు మాత్రమే కరెంట్ వినియోగించుకొనే అవకాశం ఫ్యాక్టరీలకు ఉంటుంది. దీంతో గ్రానైట్ పరిశ్రమకు ఇక్కట్లు కొనసాగుతున్నాయి. ఉత్పత్తి ప్రక్రియ దాదాపు 30శాతానికి పడిపోయింది.

బాలిక విద్యతోనే సమాజాభివృద్ధి

పామూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలిక విద్యతోనే సమాజాభివృద్ధి చెందుతుందని, బాలికల చదువు భవిష్యత్తుకు వెలుగు లాంటిదని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు చెప్పారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ కటకం సజన అధ్యక్షతన స్వయంకృషి సేవా సంస్థ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, మన్నం రమణయ్య పాల్గొన్నారు. అలాగే వగ్గంపల్లి, మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి, హెచ్‌ఎంలు తిరుపతిరెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి

ఆడపిల్లలు భావితరాలకు పునాదిరాళ్లు

తాళ్లూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలు భావితరాలకు పూనాదిరాళ్లని, దేశ భవిష్యత్తు బాలికలపైనే ఆధారపడి ఉందని ఎంఈవో జి.సుబ్బయ్య చెప్పారు. స్థానిక కేజీబీవీ, వీకే గవర్నమెంట్ స్కూల్ నందు జాతీయ బాలికదినోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, హెచ్‌ఎం శేషగిరి, కేజీబీవీ ప్రిన్సిపల్ జి.సుజిత, ఉపాధ్యాయులు లక్ష్మి పాల్గొన్నారు.

బాలికలకు బంగారు భవితనిద్దాం

పీసీపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : బాలికలకు బంగారు భవిష్యత్తునిచ్చే బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ సీహెచ్ ఉష చెప్పారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారిణి మంజుల, మండల విద్యాశాఖాధికారి ఆర్.శ్రీనివాసులు, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ రేణుకాదేవి పాల్గొన్నారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఆవుల సునీత, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, మహిళా సంరక్షణ కార్యదర్శి శాంతిప్రియ, ఏఎన్‌ఎం ప్రభావతి పాల్గొన్నారు.

మహిళా సాధికారితను ప్రోత్సహించాలి

కనిగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారితను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని యూటీఎఫ్ సీనియర్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో జాతీయబాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం హెచ్‌ఎం కలవ విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, ఆదిలక్ష్మీ, రంగారెడ్డి పాల్గొన్నారు.

బాలికలు పోటీతత్వంతో ముందుకు సాగాలి

దొనకొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : సమాజంలో పురుషులతో సమానంగా మహిళలకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని, బాలికలు ఉన్నత చదువుల్లో పోటీతత్వంతో ముందుకు సాగాలని ఎంపీడీవో శ్రీదేవి చెప్పారు. జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా పోలీస్ శిరీష, ఏఎన్‌ఎం లీలాభాయి, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏ జయమణి, నసీమాసుల్తానా, నర్శమ్మ, ఝూన్సీరాణి, లలితకుమారి, లీలాకుమారి, నిర్మల పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయాలి

ముండ్లమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పేరుకు పోయిన రూ.2.30 కోట్లు విద్యుత్ బకాయిలను స్పెషల్ డ్రైవ్ ద్వారా వసూలు చేయాలని ఈఈ పాలగిరి శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన శుక్రవారం సాయంత్రం స్థానిక సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో దీర్ఘకాలికంగా బకాయిలు పేరుకు పోయాయన్నారు. దీనివల్ల సంస్థకు అప్పులు పెరిగిపోతున్నట్లు చెప్పారు. రెండు నెలల్లోపు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి వసూలు చేస్తామన్నారు. మూడు నెలల పాటు విద్యుత్ బిల్లులు చెల్లించని వారి కనెక్షన్‌లను తొలగిస్తామని హెచ్చరించారు. ప్రత్యేకంగా రైతాంగానికి తొమ్మిది గంటలపాటు నిరంతరంగా విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో చాలామంది గృహవినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకొనే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏడీఈ కృష్ణారెడ్డి, ఏఈ అంకబాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్లు ఆంజనేయులు, కోటేశ్వరరావు, నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ శ్రీనివాసులు

రజక వృత్తిదారులకు రక్షణ చట్టం అమలుచేయాలి



మాట్లాడుతున్న రజకసంఘం నాయకులు

పీసీపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం అమలుచేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి రాము, మాలకొండయ్యలు చెప్పారు. పీసీపల్లిలో శుక్రవారం ఆ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన బీసీ కులాల్లో రజక వృత్తిదారులు అధికంగా ఉన్నారన్నారు. గ్రామాల్లోనే చాలీచాలని కూలీపనులతో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలను పెంచి ఆదుకోవాలని వారు కోరారు. లాండ్రీషాపు యజమానులకు 200యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం రజక వృత్తిదారుల సంఘం ప్రచురించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలచెన్నయ్య, బ్రహ్మయ్య, లక్ష్మీనరసింహ, మల్లికార్జున, తిరుపాలు, మాలకొండయ్య, మల్లికార్జున, ప్రసాదు ఉన్నారు.

ఆడపిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● మంత్రి డాక్టర్ స్వామి

సింగరాయకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్ర వారం స్థానిక సాంత్వన సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాలికల సంరక్షణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సంస్థ ప్రతినిధులు బాలికల హక్కులు, ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సీఐ హజరత్తయ్య, డైరెక్టర్ జయకుమార్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి

కొండపిలో...

కొండపి: బాలికలకు సామాజిక భద్రతతోపా టు, పోషకాహారం అందించి సంరక్షించుకోవాలని ఎంఈవో సురేఖ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ గురుకులంలో శుక్ర వారం నిర్వహించిన కార్యక్రమ ంలో ఆమె మాట్లాడారు. సూపర్‌వై జర్ విక్టోరియారాణి, ప్రిన్సిపాల్ అరుణ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

ఒంగోలు విద్య: స్థానిక దామచర్ల సక్కుబా యమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి చదువు ప్రాముఖ్యత, ప్రవర్తనా నియా మావళిని వివరించారు. లాయర్ లక్ష్మీకుమారి బాలికా సాధికారత, వారి భవిష్యత్ అనే అంశంపై పలు సూచనలు ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 25 జనవరి 2025



కారంచేడు పోలీస్‌స్టేషన్‌లో విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

పేదింటికి.. చేయూత

సొంతిల్లు.. అందరి కల. పేదలకు గృహయోగం సాకారం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకా లు తీసుకొచ్చినా ఆశించిన ఫలితాలు రావడంలేదు. ఆయా పథకాలను సద్వి నియోగం చేసుకునేందుకు పెద్దగా పేదలు ముందుకు వచ్చే వారు కాదు. కొందరు ఇళ్లు పొందినా వాటిలో ఉండలేక చాలామంది అమ్ము కోవడం జరుగుతుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం 2015లో అమల్లోకి తెచ్చిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎం ఏవై)లో భారీ మార్పులు తెచ్చింది. పీఎంఏవై-2.0 పేరుతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సమాజంలోని అన్ని వర్గాల వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా మార్పు లు చేసింది. ఈ పథకంతో రెట్టింపు సాయం అందించి పేదల గృహయో గానికి చేయూతగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.



రెట్టింపు సాయంతో గృహయోగం

- పీఎంఏవై 2.0పై ప్రభుత్వం కసరత్తు
- మూడు రూపాల్లో పథకం విస్తరణ.. రాయితీలు
- అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరేలా పథకం రూపకల్పన

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన వారు కూడా సొంత ఇంటిలో నివాసం ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసింది. గతంలో ఎన్నో పథకాలు ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదని తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం భారీ మార్పులతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0కు శ్రీకారం చుట్టింది. పేదలకు మరింత చేయూత అందిస్తూ.. నిర్మాణానికి రెట్టింపు సాయం అందించేలా పథకంలో భారీ మార్పులు చేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉండే ఆర్థికంగా అట్టడుగు వర్గాలు, ఆర్థికంగా బలహీనమైన వారు, తక్కువ, మధ్య ఆదాయ సమూహాలుగా ఈ పథకాన్ని విస్తరించింది. తద్వారా సమాజంలోని అన్ని వర్గాలవారికి ఆర్థిక చేయూతను అందించేలా పీఎంఏవై 2.0 ఉండనున్నది. 2024 చివరిలో పీఎంఏవై 2.0కు శ్రీకారం చుట్టగా మెజారిటీ పేదలకు గృహ యోగం లభించనున్నది. కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)కి శ్రీకారం చుట్టింది. సొంత ఇల్లు కట్టుకోవాలనుకునే పేదలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం చేయూత అందించింది. ఈ పథకంలో భాగంగా పీఎం ఏవై (అర్బన్) కింద అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు (మిగతా 6వ పేజీలో)

నాలుగు రకాలుగా..

- బీపీఎల్ : దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఆర్థికంగా అట్టడుగు వర్గాలు.
- ఈడబ్ల్యూఎస్ : ఆర్థికంగా బలహీనమైన విభాగం.
- ఎల్ఐజీ : తక్కువ ఆదాయ సమూహం.
- ఎంఐజీ : మధ్య ఆదాయ సమూహం

తక్కువ ధరల్లో అద్దె ఇళ్లు(ఏఆర్‌హెచ్)

ఇప్పటి వరకు సొంత ఇళ్లకు మాత్రమే పరిమితమైన ఈ పథకం పట్టణంలో ఉండే నిలువ నీడలేని వలస కూలీల కోసం తక్కువ ధరలో అద్దె ఇళ్లు అందించే ప్రయత్నం చేస్తోంది. శ్రామిక మహిళలు, పారిశ్రామిక కార్మికులు, నిరాశ్రయులు, విద్యార్థులు ఇతర లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ప్రభుత్వ భవనాల్లోని ఖాళీ ప్లాట్లను తక్కువ అద్దెకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. వాటిని స్వల్ప కాలిక ప్రాతిపదికన అందించాలని భావి స్తోంది. ఇది ఆచరణలో సాధ్యం కాకపోవచ్చని, అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని అధికారులు భావిస్తున్నారు.



నేర నియంత్రణే లక్ష్యం

- పోలీసింగ్ ప్రతి చోటా కనిపించాలి
- కారంచేడులో డీజీపీ ద్వారకా తిరుమలరావు

కారంచేడు(పర్చూరు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తున్నదని డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. శుక్రవారం కారంచేడు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన సిబ్బంది విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పర్చూరు, చీరాల శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, ఎంఎం కొండయ్య, ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ తుషార్‌డూడీతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మీడియాతో డీజీపీ మాట్లాడుతూ పోలీసింగ్ ప్రతి చోట కనిపించినప్పుడే నేరాలు తగ్గుతాయన్నారు. నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని భవిష్యత్‌లో నేరాలు, అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సీసీ కెమేరాలను ఏర్పాటు చేసే విధంగా ముందడుగు వేస్తున్నామన్నారు. ప్రజలు ముందుకు వచ్చి వారి వారి ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, ఇంటి పరిసరాలలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయింపు

- బాపట్లలో లాటరీ తీసిన కలెక్టర్ జె.వెంకటమురళి



గీత కార్మికులకు లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయిస్తున్న కలెక్టర్ జె.వెంకమురళి, ఎక్సైజ్ అధికారులు

బాపట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గీత, గౌడ కులాలకు రిజర్వ్ చేసిన మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ శుక్రవారం జరిగింది. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం లాటరీ పద్ధతిలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. లాటరీలో జిల్లా వ్యాప్తంగా 12 మద్యం దుకాణాలు గీత కార్మికులకు కేటాయించినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. నిబంధనలు అనుసరించి దుకాణాలు కేటాయించామన్నారు. బాపట్ల పట్టణం, రేపల్లె, అద్దంకి గ్రామీణం, అమర్తలూరు, ఇంకొల్లు, చుండూరు, జెపంగులూరు, వేటపాలెం ప్రాంతాలలో గౌడకులాలకు దుకాణాలు దక్కాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖాధికారి శివలీల, అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

- గ్రీవెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశం

బాపట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. గిరిజనుల కోసం శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారి నుంచి అర్జీలు స్వీకరించారు. వెదుళ్ళపూడి, బేతపూడి, స్వావర్షపురం గ్రామాలలో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు, పాస్‌పుస్తకాలు మంజూరుచేయాలని కలెక్టర్‌కు జాతీయ గిరిజన ఫెడరేషన్ అధ్యక్షుడు దేవరకొండ రాము అర్జీ అందజేశారు.ఎస్టీకాలనీలో శ్మశానవాటికలకు ప్రహరీ నిర్మించాలని కోరారు. వెదుళ్ళపల్లి గిరిజన హాస్టల్‌ను గిరిజన సంక్షేమశాఖకు అప్పగించాలని కోరారు. చుండూరు మండలం వలివేరు, పెనుగుదురు గ్రామాలలో శ్మశానభూములు కావాలని అర్జీ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సంఘం అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు కోరారు. వలివేరు గిరిజనకాలనీలో తాగునీరు, మురుగునీటి కాల్వలు ఏర్పాటుచేయాలని స్థానికులు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, సీపీవో శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ పద్మజ, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి బి.ప్రకాష్, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్డీవో పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

డీఆర్సీ సమావేశంలో బాపట్ల అభివృద్ధికి సంబంధించి సమగ్ర వివరాలను అధికారులకు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పీపీటీ నివేదికను పరిశీలించారు. సమాచారం సమగ్రంగా ఉండాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంటింటా ప్రజారోగ్య సర్వే నిర్వహిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు 66,946 గృహాలలో ఆరోగ్యసర్వే పూర్తిచేశామన్నారు. ప్రాంతీయ వైద్యశాలను జిల్లా వైద్యశాలగా మార్చాలని నివేదిక పంపామన్నారు. రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను కాపాడటానికి ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. మనబడి, మనభవిష్యత్తు కింద 1571 పనులు మంజూరు కాగా 1052 పనులు పూర్తి అయ్యాయన్నారు. రూ.4.43కోట్లతో సమగ్ర శిక్షాభియాన్ కింద జరుగుతున్న 147 పనులను సత్వరమే పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. సేంద్రియ వ్యవసాయోత్పత్తుల పెంపుపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. 2.70 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా 78శాతం ఈ-క్రాప్ పూర్తి అయిందన్నారు. ఉద్యాన పంటల సాగులో జిల్లా 90శాతానికి పైగా లక్ష్యాలను చేరుకుని రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. గుండ్లకమ్మ జలాశయంలో 1.50 లక్షల చేప పిల్లలు వదలడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నిజాంపట్నం ఓడరేవు అభివృద్ధిపై సమగ్ర వివరాలను నివేదికలో పొందపర్చాలన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనుల గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

జీడీసీసీబీ రేసులో.. ఆ ఇద్దరు



కుర్రా అప్పారావు



మక్కెన మల్లికార్జునరావు

- చైర్మన్ పదవి కోసం పోటాపోటీ
- సిఫార్సు లేఖలతో రంగంలో మక్కెన మల్లికార్జునరావు, కుర్రా అప్పారావు
- అత్యధిక మంది ప్రజాప్రతినిధుల మద్దతుతో అప్పారావు
- వైసీపీని వీడి టీడీపీలో చేరడం మల్లికార్జునరావుకి మైనస్

గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే కీలకమైన గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జీడీసీసీబీ) చైర్మన్‌పదవి కోసం టీడీపీలో ఇద్దరు నేతలు పోటీ పడుతున్నారు. వీరిలో ఒకరు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మరొకరు టీడీపీ సీనియర్ నేత కుర్రా అప్పారావు. మక్కెన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుతో పాటు వైసీపీని వీడి ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అంతకు ముందు ఆయన వైసీపీలో కొనసాగుతూ 2019 ఎన్నికల్లో వినుకొండ వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు విజయానికి సహకరించారు. ఆ తర్వాత బొల్లాతో విభేదించి పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. అయితే అప్పటికే వైసీపీ ఎంపీగా కొనసాగుతున్న శ్రీకృష్ణదేవరాయలుతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు. ఆయనతో ఉన్న సాన్నిహిత్యం మూలంగానే 2024 ఎన్నికల నాటికి టీడీపీలో చేరి వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజయానికి కృషి చేశారు. దీంతో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవికి మక్కెన పేరును సిఫార్సు చేస్తూ ఎమ్మెల్యే ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కూడా మక్కెనకు ఇవ్వాలని కోరుతూ లేఖలు ఇచ్చారు. ఇక చైర్మన్ పదవి ని ఆశిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన కుర్రా అప్పారావు రేసులో ముందంజలో ఉన్నారు. చైర్మన్ పదవి పొందేందుకు ఏదో ఒక సొసైటీ నుంచి అధ్యక్షుడిగా గెలుపొందాల్సి ఉండటంతో తన సొంత మండలమైన యడ్లపాడులోని మర్రిపాలెం గ్రామాన్ని అప్పారావు ఎంచుకుని గ్రౌండ్ సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ సొసైటీ నుంచి ఆయన తండ్రి కుర్రా రత్తయ్య సొసైటీ అధ్యక్షుడుగా ఉన్నారు. రత్తయ్య జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా చాలా కాలం పనిచేశారు. అప్పారావు గతం లో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శిగా పనిచేశారు. తొలి నుంచి టీడీపీకి ఆయన కుటుంబం అంకితమై పని చేస్తున్నది. గతంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య విజయానికి, ఆ తర్వాత మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విజయంలో అప్పారావు కుటుంబం కీలకంగా వ్యవహరించింది. అలాగే ఇటీవల ఎన్నికల్లో సొంత నియోజకవర్గమైన చిలకలూరిపేటలో పుల్లారావు గెలుపునకు, పెదకూరపాడు నుంచి పోటీ చేసిన తన చిన్ననాటి మిత్రుడు భాష్యం ప్రవీణ్ గెలుపులోనూ అప్పారావు ప్రధాన పాత్ర పోషించారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బరిలోకి దిగిన పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి హార్థిక, ఆర్థిక సహకారం కూడా తన వంతుగా అందించారు. దీంతో అప్పారావు ఆశిస్తున్న చైర్మన్ పదవికి తొలి నుంచి పార్టీలో ఉన్న వారెవరూ కూడా పోటీకి రాలేదు. అంతేకాకుండా అప్పారావుకు పదవి ఇవ్వాలని కోరుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఇద్దరు ఎంపీలు, సీనియర్ ఎమ్మెల్యేలందరూ సిఫార్సు లేఖలు ఇచ్చారు. సీనియర్ మోస్ట్ ఎమ్మెల్యేలైన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, కన్నా లక్ష్మీనారాయణలు సైతం అప్పారావును బలపరిచారు. అలాగే గుంటూరు జిల్లా (మిగతా 6వ పేజీలో)



మత్స్యకార భృతి.. రూ.20 వేలు



చీరాల పరిధిలోని ఓడరేవు తీరంలో చేపల వేటకు వలలను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు (ఫైల్ ఫొటో)





- వేట విరామంలో రెట్టింపు భృతికి హామీ
- వారంలో కొలిక్కి రానున్న లబ్ధిదారుల జాబితా
- గత ప్రభుత్వంలో 1,500 మంది అనర్హులున్నట్లు గుర్తింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతిని రూ.10 వేల నుంచి ఇరవై వేలకు పెంచి అందిస్తామని గడచిన ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. గత ప్రభుత్వంలో అర్హులైన వేల మంది గంగపుత్రులు మత్స్యకార భృతికి దూరంగా ఉండిపోయారు. వైసీపీ నేతల అనుచరగణాన్ని కూడా మత్స్యకారుల జాబితాలో చేర్చి అనర్హులకు ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారు. ప్రస్తుతం అనర్హుల ఏరివేతతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందుకోసం పడవల సంఖ్యను నమోదు చేయడంతో పాటు వీటిలో రిజిస్ట్రేషన్ అయినవి ఎన్ని, చిన్నవి, పెద్దవి ఎన్ని వీటిపై ఆధారపడి చేపల వేట ద్వారా జీవనం సాగిస్తున్న వారి సంఖ్య ఎంత మంది అనే వివరాలను యంత్రాంగం నమోదు చేస్తోంది. ఇప్పటికే దాదాపు జాబితా ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో దాదాపు 1,500 మంది వరకు అర్హత లేకపోయినా సాయం అందుకున్నట్లు గుర్తించారు. వీరందరికి సమాచారం ఇచ్చి వివరణ కోరి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. దాదాపు 14,500 మందికి రెట్టింపు మత్స్యకార భృతి అందించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అండగా ఉండనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. జిల్లాలో సుదూర తీరప్రాంతం ఉండడంతో చేపల వేటపై ఆధారపడి బతికే మత్స్యకారుల సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. దాదాపు 48,000 వరకు మత్స్యకార జనాభా ఉండగా వీరిలో 19,000 మంది వేటే బతుకుదెరువుగా ఉన్నారు. పడవలు, మరబోట్ల సంఖ్య 2,900 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాదాపు 14,500 మంది మత్స్యకారులకు రూ.20,000 భృతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మత్స్యశాఖ సిబ్బంది గడచిన పక్షం రోజులుగా శ్రమిస్తూ ఉండగా మరో వారం రోజుల్లో జాబితా ఓ కొలిక్కి రానుందని తెలుస్తోంది.

చేపలు గుడ్లు పెట్టే వేళ....

ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో చేపల వేటకు విరామాన్ని ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సమయంలో చేపలు గుడ్లు పెడతాయి కనుక వేట వల్ల వలల్లో చిక్కుకుని అవి బయటకు వచ్చే ప్రమాదం ఉండడం, తద్వారా మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతుందనే ఉద్దేశంతో వేటకు గంగపుత్రులు రెండు నెలల పాటు దూరంగా ఉంటారు. ఈ సమయంలో వారి జీవనోపాధికి ప్రభుత్వాలు సాయం చేస్తూ ఉంటాయి.

రూ.6 వేల పింఛన్ ప్రభుత్వ ఘనతే

- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

బాపట్ల రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అంది స్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని సోషల్ వెల్ఫేర్, డిజెబుల్ అండ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్, సచివాలయం అండ్ విలేజ్ వలంటరీ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశం ఏర్పాటుచేసి వారి సమస్యలు, కావాల్సిన మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి వీరాంజనేయస్వామి



బాలికలతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా

చీరాలటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్యా బుద్ధులు, ఇతర సౌకర్యాలపై హాస్టల్ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధతో మెలగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం చీరాల పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈక్రమంలో వంట గది, పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అపరిశుభ్రంగా ఉండటం వలన విష సర్పాలు వంటివి చేరితే చిన్నారుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని హెచ్చరించారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించి ఉత్సాహపరిచారు. అలాగే చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మంత్రి వెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, చినగంజాం తహసీల్దార్ ప్రభాకరరావు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సోషల్ వెల్ఫేర్ అధికారిణి రాజా దెబోరా, డీటీలు అర్జున్, మహేష్ తదితరులు ఉన్నారు.



ధర్మవరం గ్రామంలో పశు యజమానులతో మాట్లాడుతున్న ఏపీఎల్‌డీఏ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు

పశు వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగపర్చుకుని పాడి పరిశ్రమను మరింతగా పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏపీఎల్‌డీఏ) సీఈవో డాక్టర్ యం. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం అద్దంకి మండలంలోని ధర్మవరం గ్రామంలో జరిగిన పశు ఆర్యోగ శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం వద్దకు వచ్చిన పశువుల యజమానులతో ఆ యన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ యం. మోహనరావు, డాక్టర్ ఇ. అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

బల్లికురవ : పాడిపరిశ్రమను వృద్ధిలోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని పశువైద్యాధికారులు పావనీకుమారి, మహేశ్వరరావులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో పశు అరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా రెండు గ్రామాల్లోని 62 దూడలకు, 62 గేదెలకు, 1,300 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందించారు.

ఫ్లోరిన్‌భూతాన్ని తరిమి కొడదాం

బల్లికురవ. జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఫ్లోరిన్ భూతాన్ని తరిమి కొట్టేందుకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా ఫ్లోరోసిస్ టీం అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం నక్కబొక్కలపాడు, వెలమవారిపాలెం గ్రామాలలో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాలలో ప్రజలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు భారతి, వైద్య అరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మాంసాహార దుకాణాలు తెరిస్తే చర్యలు

అద్దంకి, జనవరి24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని మాంసాహార దుకాణాలు తెరిసినా, అమ్మకాలు చేసినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలుంటాయన్నారు.

నేడు నేషనల్ ఓటర్స్ డే

నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు.

పాఠశాలలకు బిస్కెట్ ప్యాకెట్ల అందజేత

పంగులూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు అజిత్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వడ్లవల్లి వీరనారాయణ శుక్రవారం బిస్కెట్ ప్యాకెట్‌లు సమకూర్చారు. మండలంలోని పాఠశాల బాల బాలికలకు నాలుగేళ్లుగా బిస్కెట్ ప్యాకెట్లను అందజేస్తున్నారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని 44 పాఠశాలలకు స్వయంగా వెళ్లి అందులో చదువుతున్న 3,372 మంది విద్యార్థులకు సరిపడా బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు.

రామకూరు కొండపై నాగ సాధువులు

మండలంలోని రామకూరు గ్రామంలో కొండపై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని నాగ సాధువులు శుక్రవారం సందర్శించారు. ఉదయం సమయంలో ఆలయానికి చేరుకున్న నాగ సాధువులు స్వామి వారిని దర్శించుకుని అర్చన, అభిషేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. కాశీ నుంచి బయలుదేరామని, ప్రయాణ మార్గంలో పలు ఆలయాలను సందర్శిస్తూ స్వామి వారిని దర్శించుకుంటూ తమిళనాడులోని రామేశ్వరం వెళుతున్నట్లు తెలిపారు.

ఐసీఎంఆర్ ఫెలోషిప్‌కు రిమ్స్ వైద్య విద్యార్థినుల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీలోని ఇరువురు వైద్య విద్యార్థినులు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)లో రెండు ఫెలోషిప్‌లు సాధించి సత్తా చాటారు. మెడిసిన్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కె.వైష్ణవి, జి.తారాలీశ్రీలు డాక్టర్ భాస్కర్ కొల్లి, డాక్టర్ స్పందనల గైడెన్స్‌లో ఒంగోలు నగరంలోని పేదవారిలో ప్రీ స్కూలు పిల్లల కోసం విటమిన్ ఎ సప్లిమెంటేషన్‌పై అడ్డంకులు, సులభతరం అంశంపై సెక్షనల్ స్టడీ చేశారు. దక్షిణ భారత దేశంలోని ఒక జిల్లాలోని వికలాంగత కలిగిన గిరిజన పిల్లల జీవన నాణ్యత, వారి కుటుంబాలపై భారం అనే అంశాలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక రిమ్స్‌లో మెడికల్ విద్యార్థినలుఉ వైష్ణవి, తారాలిశ్రీని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, ప్రొఫెసర్లు ప్రత్యేకంగా అభినందించారు.

పర్చూరులో ఇంటింటా సర్వే

నిరుద్యోగులకు ఉద్యోగకల్పన
పదివేల ఉద్యోగాలే టార్గెట్
ఎమ్మెల్యే ఏలూరి సరికొత్త ప్రయత్నం
నేడు రెండవ విడత జాబ్‌మేళా



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

పర్చూరు నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంగా వినూత్న విధానానికి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శ్రీకారం పలికారు. ఉద్యోగం అంటే ఐటీ ఉద్యోగమే అన్న చందంగా మారిన ఈ తరుణంలో అన్నీ స్థాయిల్లోని విద్యాధికులకు ఉద్యోగం కల్పించే ఉద్దేశంతో ముందడుగు వేస్తున్నారు. అందుకోసం జాబ్ మేళా పేరుతో రండి అహో అని పిలవకుండా నిరుద్యోగులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టారు. తదనుగుణంగా గుర్తించిన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ఆయా స్థాయిల్లోని పారిశ్రామిక కంపెనీలను నియోజకవర్గానికి రప్పిస్తున్నారు. ఇందుకోసం తాను ఏర్పాటు చేసిన ఫౌండేషన్‌తో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించటంలో అపార అనుభవం గల సంస్థను కలిపి కార్యక్రమానికి శ్రీకారం పలికారు. అందులో భాగంగా మలివిడత జాబ్ మేళా కార్యక్రమాన్ని శనివారం మార్టూరు సమీపంలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేశారు.

వ్యవసాయం, సముద్ర తీరప్రాంత వృత్తులే ప్రధానమైన పర్చూరు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి జరగని విషయం తెలిసిందే. గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు వచ్చినా విద్యాధికులైన నిరుద్యోగులకు పెద్దగా ఉద్యోగాలు లభించటం లేదు. ఇక ఐటీ ఉద్యోగాల పేరుతో విదేశాలకు ఆ నియోజకవర్గం నుంచి భారీగానే తరలి వెళ్లినా ప్రస్తుతం ఆ ఉద్యోగాల పరిస్థితి గగనంగా మారింది. పారిశ్రామిక అభివృద్ధి లేకపోవటంతో క్రిందిస్థాయి విద్యాధికులకు ఉద్యోగాలు లభించటం గగనం అయింది. పరిస్థితి గుర్తించిన ఎమ్మెల్యే ఏలూరి తాను కొత్తగా ఏర్పాటు చేసిన గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ద్వారా వివిధ రకాల కార్యక్రమాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భావించారు. తదనుగుణంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే విభాగంలో మంచి అనుభవం గల హెచ్ఆర్‌కో కంపెనీతో ఒప్పదం చేసుకున్నారు. ఆ కంపెనీని రంగంలోకి దించారు. జాబ్ మేళా పేరుతో నిరుద్యోగులను ఆహ్వానించకుండా ముందుగా నిరుద్యోగులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా హెచ్ఆర్‌కో కంపెనీ సిబ్బంది ప్రతి గ్రామం వెళ్లారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంట్లో చదువుకున్న నిరుద్యోగులను గుర్తిస్తున్నారు. ఐటీ ఉద్యోగాలకు ఉపయోగపడే ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంబీఏ చదువుకున్న వారికి, అలాగే ఫార్మసీ విద్యను అభ్యసించిన వారికి మాత్రమే పరిమితం కావటం లేదు. పదవ తరగతి నుంచి పీజీ దాక చదువుకున్న నిరుద్యోగులను కూడా గుర్తిస్తున్నారు. అలా గ్రామం యూనిట్‌గా ఆయాస్థాయి విద్యాభ్యాసం చేసిన నిరుద్యోగుల జాబితా తయారు చేస్తున్నారు. అలా తొలి విడతగా నియోజకవర్గంలోని మండలానికి ఒకటి రెండు గ్రామాలను ఎంపిక చేసుకొని నిరుద్యోగులను గుర్తించారు.

ఇలా గుర్తించిన నిరుద్యోగుల్లో వారి వారి విద్యార్హతలను బట్టి నెల వారీ రూ. 10 వేల నుంచి రూ.70 వేల వరకు జీతభత్యాలు ఇప్పించే విధంగా ఉద్యోగాలు ఇప్పించాలని నిర్ణయించుకున్నారు. అందుకు అనుగుణంగా ఆయా

రూ.10 వేల నుంచి రూ.70 వేల వరకు

స్థాయి అర్హతలు ఉన్నవారికి ముందుగానే ఎలాంటి ఉద్యోగం, ఏ స్థాయిలో జీతం రావచ్చో వివరించి అందుకు సిద్ధపడిన వారి పేర్లు మాత్రమే నమోదు చేసుకుంటున్నారు.

నేడు మలివిడత

కాగా సేవా కార్యక్రమాల నిర్వాహణతో తన జన్మదినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలతో నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే చేయూత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మలివిడత జాబ్ మేళా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి గుర్తించిన పదవ తరగతి నుంచి ఆపై స్థాయిలో విద్యాభ్యాసం చేసిన నిరుద్యోగులకు ఆహ్వానం పంపారు. ఈ నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని దేశంలోని వివిధ ప్రాంతాలు ప్రధానంగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఎనిమిది పెద్ద పారిశ్రామిక కంపెనీలను రప్పిస్తున్నారు. ఆయా స్థాయిలో అన్నీ ఉద్యోగాలకు ఈ క్యాంపులో నిరుద్యోలను ఎంపిక చేస్తారు. దీంతో శనివారం జరిగే క్యాంపులో నిర్వహించే ఫలితాలపై యావత్తు ప్రజానీకం ఆశక్తిగా ఎదురుచూస్తోంది. కాగా నియోజకవర్గంలో రానున్న నాలుగున్నర సంవత్సరాల్లో పదివేల మంది నిరుద్యోలకు ఉద్యోగాలు కల్పించటమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి ప్రణాళిక రూపొందించుకున్నారని అందుకు అవసరమైన సహకారం తాము ఇవ్వబోతున్నామని హెచ్ఆర్‌కో కంపెనీ ప్రతినిధులు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు

గుర్తించిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే ఏలూరి నేరుగా కొన్ని పారిశ్రామిక కంపెనీలతో మాట్లాడగా, హెచ్ఆర్‌కో కంపెనీ వారు మరికొన్ని కంపెనీలతో మాట్లాడి అక్కడి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఇప్పించేలా ఒప్పందాలు చేసుకున్నారు. అందులో భాగంగా తొలివిడతగా గుర్తించిన 250 మంది నిరుద్యోగులను ఆహ్వానించి ఆరు రోజుల క్రితం ఒక జాబ్ మేళా నిర్వహించారు. సదరు హెచ్ఆర్‌కో కంపెనీ టెక్ మహేంద్ర వారిని పిలిపించగా ఎమ్మెల్యే ఏలూరి చొరవతో అమెరికాలో ఉంటూ ఇండియాలో కూడా ఐటీ కంపెనీ నిర్వహిస్తున్న ఒక కంపెనీకి తనకున్న పరిచయంతో పిలిపించారు. ఆ కంపెనీ అధినేత వెంకట్ నేరుగా జాబ్ మేళాకు హాజరయ్యారు. మొత్తం 250 మంది నిరుద్యోగులను ఆహ్వానించారు.

కాగా 300 మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. టెక్ మహేంద్ర కంపెనీ నాన్ ఐటీ ఉద్యోగాల కోసం నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి తొలి విడతగా సుమారు 50 మందికి అంగీకార పత్రం ఇచ్చారు. అందులో రూ.10 వేల నుంచి రూ.45 వేల వరకు నెలవారీ జీతం వచ్చే ఉద్యోగాలకు ఆఫర్ లెటర్ ఇచ్చారు. తన కంపెనీలో ఆరు మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు వెంకట్ అక్కడికక్కడే అంగీకార పత్రాలు అందజేశారు వారిలో నలుగురికి తన కంపెనీలో ఢిల్లీలో పనిచేసే అవకాశం కల్పించారు.

యువత చేతిలోనే కళల భవిత

● సందేశాత్మకంగా కమనీయం నాటిక ● అలరించిన మహిళల కోలాటం ● ఉత్సాహంగా ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యక్రమాలు



కోలాట ప్రదర్శన

ఒంగోలు కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ 25వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు వివిధ వైవిధ్య భరితమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి కళాపరిషత్ వేదికలపై వివిధ కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. మొదటిగా పాకలకు చెందిన శ్రీలక్ష్మి తిరుపతమ్మతల్లి నాదస్వర బృందంచే నాదస్వర కచ్చేరి జరిగింది. ఇందులో కొత్తకోట శ్రీనివాసరావు, బోయినపల్లి సుబ్బారావు, కొత్తకోట వెంకట్రావు, వల్లూరి మోహనరావులు నాదస్వరం, డోలుపై చక్కటి శాస్త్రీయ గీతాలను వినిపించారు.

అనంతరం అల్లూరుకు చెందిన మైత్రి కోలాట బృందంచే ప్రదర్శితమైన కోలాట ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. సుమారు 70 మంది మహిళలు ఈ కోలాటంలో పాల్గొనగా శిక్షకులు నాంచారయ్య ఆధ్వర్యంలో శివ శివమూర్తివి గణనాథ, యశోదమ్మ నీకొడుకు ఏడీ, గున్నగున్న మామిడి, నల్లనయ్యా రావా వంటి పలు గీతాలకు మహిళలు ఉత్సాహంగా కోలాటాన్ని ప్రదర్శించారు. ఇక మహిళలు అందరూ చీపుర్లు పట్టుకుని స్వచ్ఛభారత్ సందేశాన్నిస్తూ చేసిన కోలాట ప్రదర్శన హైలైట్‌గా నిలిచింది. ఇక ప్రతిరోజు నిర్వహించే చర్చాగోష్టిలో భాగంగా మూఢనమ్మకాలు, జాతకాలు, శకునాలు వంటి అంశాలపై చర్చా కార్యక్రమం జరిగింది. ఇందులో మహిళలు ఉత్సాహంగా పాల్గొని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు.

'కమనీయం'గా..

ఇక నాటకం విషయానికి వస్తే కళలు రాబోయే తరానికి అంది కలకాలం వర్ధిల్లాలంటే యువత చదువుతో పాటు ఏదో ఒక కళలో నైపుణ్యం సాధించాలని, అందుకు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలనే సందేశంతో శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారు ప్రదర్శించిన కమనీయం సాంఘిక నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. విద్యాధర్ మునిపల్లె రచించిన ఈ నాటికకు బసవరాజు జైశంకర్ దర్శకత్వం వహించగా ఆయనతో పాటు టి.వేణుగోపాల్, గుడివాడ లహరి ప్రధాన పాత్రలు పోషించారు.



కమనీయం నాటకం

శ్రీశంకర విజయం నృత్యరూపకం

ఒంగోలు నళినీప్రియ కూచిపూడి నృత్యనికేతన్ వారు ప్రదర్శించిన శ్రీశంకర విజయం నృత్యరూపకం సైతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కూచిపూడి నృత్య శిక్షకురాలు పి.శివకుమారి నేతృత్వంలో నృత్య కళాకారులు శంకరాచార్యుల వారి జీవిత గాధను చక్కగా ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాలను ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు పర్యవేక్షించగా, ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తదితరులు పాల్గొని కళాకారులకు ప్రదర్శనా పారితోషికం, జ్ఞాపికలను బహూకరించి సత్కరించారు.

న్యాయం చేయాలంటూ రాస్తారోకో

పొదిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని మండలంలోని సల్లూరు గ్రామస్థులు శుక్రవారం పొదిలి పోలీస్‌స్టేషన్ ఎదుటరోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. ఏలూరు పంచాయతీ పరిధిలోని సల్లూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (45) ఇటీవల అనారోగ్య కారణాలతో విజయవాడలో మృతి చెందారు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామం సల్లూరుకు తీసుకొచ్చారు. ఈ తరుణంలో గ్రామానికి వేరే సామాజిక వర్గంవారు గ్రామంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు చేయడానికి వీలు లేదంటూ ఘర్షణ పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చారు. వారి చొరవతో శుక్రవారం వేకువజామున అంత్యక్రియలు నిర్వహించారు. అయితే గురువారం రాత్రి అంత్యక్రియలు చేయడానికి వచ్చిన వర్గంపై పొదిలి సీఐ, ఎస్ఐలు లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ ఆ వర్గంవారు ధర్నా, రాస్తారోకో చేశారు.



నిరసన తెలుపుతున్న బీసీవైపీ వ్యవస్థాపకుడు రామచంద్రయాదవ్‌కు సర్దిచెబుతున్న పోలీసులు

అంతకు ముందు బీసీవైపీ రాష్ట్ర వ్యవస్థాపకుడు బోడె రామచంద్రయాదవ్ సల్లూరు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయితే మృతదేహానికి దహన సంస్కారాల విషయంలో జరిగిన వివాదాన్ని తెలుసుకొన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు దురుసుగా ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్ఐ, సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పొదిలి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. రోడ్డుపై కూర్చున్నవారికి పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సల్లూరు గ్రామస్థులకు, పోలీసులకు కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులపై ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రామచంద్రయాదవ్ చెప్పారు. గ్రామస్థులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమించారు.



బల్లికురవలో శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో దట్టమైన మంచును చీల్చుకొని వస్తున్న సూర్యుడు

మంచు తెరలను చీల్చుకుంటూ..

బల్లికురవ. జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వారం రోజుల నుంచి గ్రామాలలో పొగ మంచుతో ఉదయం 10 గంటల వరకు కూడా దట్టమైన మంచు పడుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బల్లికురవ మండలంలో చీకట్లు గొలిపే వాతావరణంలో మంచును దాటుకొని సూర్యుడి భగ భగలు ప్రజలను ఆకట్టుకొన్నాయి. పనులకు వెళ్లే రోజు వారీ కూలీలు సైతం సూర్యుడి వెలుగుల కోసం ఎదురు చూపులు చేశారు. ఆకాశంలో ఒక పక్క మంచు మరో పక్క సూర్యుడు భగ భగలు కనువిందు చేశాయి.

పేదింటికి.. చేయూత

(5వ పేజీ తరువాయి)

టిడ్కో ఇళ్లు అందజేసింది. పీఎంఏవై(గ్రామీణ) కింద గ్రామీణ పేదలకు ఇళ్ల నిర్మాణానికి చేయూత ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 2.95 కోట్ల ఇళ్లు నిర్మిచాలని లక్ష్యంగా పెట్టుకోగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యాప్తంగా అర్హులైన పేదల కోసం సర్వే చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు..

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని ఒక విభాగంగా గుర్తించి వారికి సొంత ఇల్లు అందుబాటులోకి తేవడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశం. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందజేస్తుంది. లేనివారికి స్థలం అందజేసి అందులో ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వమే చూసుకుంటోంది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక విధాన ప్రకటన చేసింది. పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బెనిఫిషరీ లెడ్ కన్‌స్ట్రక్షన్(బీఎల్‌సీ) కింద వీరికి ఇప్పటి వరకూ కేంద్రం అందిస్తున్న ఆర్థిక సహాయం కూడా రెట్టింపు కానుంది. ఇప్పటి వరకూ ఇచ్చే రూ.1.50 లక్షల సాయాన్ని ఇక నుంచి రూ.2.50 లక్షలకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఈ మొత్తంలో కేంద్రం వాటాలో ఎలాంటి మార్పు లేదు. గతంలో మాదిరిగా కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుండగా, అదనంగా ఇచ్చే రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వ 40 శాతం మ్యాచింగ్ గ్రాంటుగా ఉంటుందని సమాచారం. దీంతోపాటు స్వచ్ఛ భారత్ స్కీమ్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, నరేగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.27 వేలు అందించనున్నారు. ఈ పథకం కింద మురికివాడలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వితంతువులు, దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, వీధి వ్యాపారులు, చేతివృత్తుల వారు, అంగన్వాడీ కార్యకర్తలకు ఈ స్కీమ్ కింద సహాయం అందుతుంది.

● **అఫర్డబుల్ హౌసింగ్ (ఏహెచ్‌పీ)**

ఈ విభాగం కింద రాష్ట్రాలు, నగరాలు, ఇతర ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కొంత వాటా, కేంద్రం నుంచి కొంత వాటా వేసి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతుల్లో ఇళ్లను నిర్మిస్తారు. వీటిని ప్రధానంగా ఆర్థికంగా బలహీన సమూహాలు (ఈడబ్ల్యూఎస్)లకు అందిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల మాదిరిగానే కొంత మొత్తం చెల్లించి ఈ అపార్టుమెంట్లలో ప్లాట్లను అందజేస్తారు. వీటిని సరసమైన ధరల్లో అందించేందుకు వీలుగా రిడీమబుల్(వినియోగించుకో తగిన) హౌసింగ్ ఓచర్లను అందుబాటులో ఉంచుతారు.

● **వడ్డీ రాయితీ..**

ఎంతో కొంత స్థోమత ఉండి ఇల్లు కట్టుకునేందుకు బ్యాంకు ద్వారా రుణం పొందేవారిని ఉద్దేశించి ప్రభుత్వం ఈ విధానాన్ని ముందుకు తెచ్చింది. గరిష్ఠంగా రూ.25 లక్షల రుణం, లేదా రూ.35 లక్షలు ఇంటి విలువ ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకూ ఉన్న ఈడబ్ల్యూఎస్ కుటుంబాలు, 3- 6 లక్షల ఆదాయం ఉన్న ఎల్ఐజీ కుటుంబాలు, 6- 9 లక్షల ఆదాయం ఉన్న ఎంఐజీ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ వస్తుంది. వీరికి వడ్డీ రాయితీ ఐదేళ్ల పాటు గరిష్ఠంగా రూ.1.80 వేలు అందజేస్తారు.

జీడీసీసీబీ రేసులో.. ఆ ఇద్దరు

(5వ పేజీ తరువాయి)

నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్ ఆశీస్సులు కూడా అప్పారావుకే ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాత్రం తన నియోజకవర్గానికి చెందిన మక్కెనను కాదని అప్పారావుకు లేఖ ఇవ్వడం భావ్యం కాదని నిరాకరించినట్లు తెలిసింది. ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు తొలుత మక్కెనకే లేఖ ఇచ్చినప్పటికీ అప్పారావుకు కూడా లేఖ ఇస్తూ తన తొలి ప్రాధాన్యం మాత్రం మక్కెనకేనంటూ చెప్పినట్లు తెలిసింది. దీంతో అప్పారావు పేరును అధిష్ఠానం లాంఛనంగా ప్రకటించటం మాత్రమే మిగిలిఉందని చెబుతున్నారు. మక్కెన టీడీపీలో కొత్తగా చేరడం, ఇద్దరూ ఒకేసామాజికవర్గం కావడంతో ఆయన పోటీలో వెనకపడ్డారు. పైగా వినుకొండ ఎమ్మెల్యే జీవీకి ఇటీవల కేబినెట్ మంత్రిగా హోదా ఉన్న చీఫ్‌విప్ పదవి ఇవ్వడంతో అదే నియోజకవర్గానికి చెందిన మక్కెనకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ పదవి వరించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

ఒకే రోజు 7వేలకుపైగా ఇంకుడు గుంతలు

ఒంగోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఒకే రోజున ఏడువేలకుపైగా ఇంకుడు గుంటలు తవ్వకాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ చెప్పారు. ఈనెలాఖరులోనే ఆ కార్యక్రమం చేపట్టాలని అందుకు వీలుగా గ్రామ యూనిట్‌గా కార్యచరణ రూపొందించాలని ఎంపీడీవోలు, ఏపీవోలకు సూచించారు. ఆ మేరకు శుక్రవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు ఇచ్చారు. నెలాఖరులో ఒకే రోజు అన్ని పంచాయతీల్లో ఇంకుడు గుంతలు తవ్వేలా చర్యలు తీసుకోవాలన్న ఆలోచనకు కలెక్టర్ రావడంతో తదనుగుణ చర్యలను ఆయన వివరించారు. జిల్లాలో మొత్తం 729 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కొక్క పంచాయతీలో కనీసం 10 ఇంకుడు గుంటల వంతున ఒకే రోజు 7,290 తవ్వకాలు చేసేలా ప్రజలను సన్నద్ధం చేయాలని సూచించారు. ఒక్కొక్క దానికి ఉపాధి పథకం ద్వారా రూ.6వేలు ఇవ్వనుండగా లబ్ధిదారుల ఎంపిక తక్షణం చేయాలని తెలిపారు. అలాగే జిల్లాలో చేపట్టిన మినీగోకులాల నిర్మాణాలు నెలాఖరు నాటికి పూర్తిచేయాలని మండల అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1,131 మినీ గోకులాలు నిర్మాణం చేపట్టగా సుమారు 570 వరకు పూర్తయ్యాయని, మరో 130 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆయా దశల్లో ఉన్నవాటితోపాటు ఇతర వాటిని కూడా నెలాఖరులోగా పూర్తిచేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇక సోషల్ ఆడిట్ లో గుర్తించిన లోటుపాట్లకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి ఆయా మొత్తాల రికవరీపై దృష్టిసారించాలని మండలస్థాయి అధికారులను పీడీ ఆదేశించారు.

అవీ..ఇవీ



ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు, ప్రతినిధులు

చేనేత కార్మికుల నిరసన ర్యాలీ

చీరాలటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేనేత సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని శుక్రవారం పట్టణంలో చేనేత కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేనేతలు అధిక సంఖ్యలో ఉన్నట్లు వివరించారు. ధరల కారణంగా మాస్టర్ వీవర్స్ వద్ద నిల్వలు పేరుకుపోయినట్లు చెప్పారు. అలాగే 200యూనిట్స్ ఉచిత విద్యుత్ అమలు చేయాలని అన్నారు. ర్యాలీగా పట్టణంలో జౌళిశాఖ కార్యాలయం వరకు చేరుకుని నినాదాలు చేశారు. అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బాల కృష్ణ, సీఐటీయూ ప్రతినిధులు గంగయ్య, ఎన్. బాబూరావు, గాదె హేమ సుందర్, సత్యనారాయణ, కొండయ్య, రాధ, నాగమల్లేశ్వరరావు, రాఘవయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.


కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు

మధ్యాహ్న భోజనాన్ని రుచిగా తయారు చేయాలి

బల్లికురవ. జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో నూతన మెనును అమలులోకి తెచ్చిందని విద్యార్థులందరూ తినేలా రుచిగా తయారు చేయాలని చీరాల డిప్యూటీ డీఈవో అబ్బ రాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొమ్మినేని వారిపాలెం ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. ఈ తనిఖీలో హెచ్ఎం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాయపాలెం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి బాలమ్మ

విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చేలా చూడాలి

- నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి బాలమ్మ

అద్దంకిటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హాజరు పట్టిలో ఉన్న విధంగా విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చేలా చూడాలని జడ్పీ డిప్యూటీ సీఈవో, అద్దంకి నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి బాలమ్మ అన్నారు. శుక్రవారం అద్దంకి మండలంలోని కోటికలపూడి , శ్రీరామ్‌నగర్ కాలని, మోదేపల్లి, తిమ్మాయపాలెం జడ్పీహెచ్ఎస్‌తో పాటు, పట్టణంలోని పసుమర్తిపాలెంలోని ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రిజిస్టర్‌లో ఉన్న విద్యార్థులకు, హాజరైన విద్యార్థులకు మధ్య వ్యత్యాసం ఉండటాన్ని గమనించారు. స్కూలుకు రాని విద్యార్థుల గురించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులందరు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో బత్తిన సింగయ్య, ఎంఈవోలు గంగాధరరావు, సుధాకరరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న పోతురాజు

జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలి

ఇంకొల్లు,జనవరి 24,(ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులైన డ్వాక్రామహిళలు సమాజంలో ఆర్థిక, సైబర్‌మోసాలకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని వయోజన విద్యా పర్యవేక్షకులు టి.పోతురాజు అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో డిజిటల్,ఆర్థిక, క్రియాత్మక అక్షరాస్యతపై మండలంలోని వివిధ గ్రామాల వీవోఏలు, వలంటీర్లకు ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు వలంటీర్ టీచర్లు తమవంతు కృషి చేయాలన్నారు. రోజూ అక్షర కేంద్రాలను నడపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.వాణి, సీసీలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం మార్పు

ఇంకొల్లు ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో కొనసాగుతున్న మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సమీపంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలోకి శుక్రవారం మార్చినట్లు ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు తెలిపారు. మండల ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మీ, ఎంపీపీ బండారు అనూష, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలపై సీఎం ప్రత్యేక దృష్టి

శాసనసభ్యుడు ఎంఎం కొండయ్య

చీరాలటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాంకేతిక పరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చీరాల శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ టెక్నాలజీని పరిచయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేకమైన శైలి ఉందని చెప్పారు. ఈనేపథ్యంలోనే రాష్ట్రంలో సీసీ కెమెరాలు అమర్చడంలో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. టీడీపీ కూటమి అధికారంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పరిపాలన చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఉన్నారు.


డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

డీజీపీకి కారంచేడులో ఘన సన్మానం

కారంచేడు(పర్చూరు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : డీజీపీ ద్వారకా తిరుమలరావుకు శుక్రవారం కారంచేడు గ్రామంలో ఘనంగా పౌరసన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు , చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య , డీఐజీ త్రిపాఠి, జిల్లా ఎస్పీ తూషార్ డూడీ హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ మాట్లాడుతూ కారంచేడు గ్రామానికి రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంచి గుర్తింపు ఉందని, ఈ ప్రాంత వాసులు అత్యున్నత విద్యా సంస్థ అయిన జేకేసీ వంటి కళాశాలలో సభ్యులుగా ఉండటం దీనికి నిదర్శనం అని అన్నారు. తాను కారంచేడు ప్రాంతంలో జన్మించక పోయినా తన తల్లిదండ్రుల మీద ఉన్న మమకారంతో తనను ఈ ప్రాంత వాసిగా గుర్తించి ఇంత పెద్ద ఎత్తున సన్మానించటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో నిస్వార్థంగా పనిచేశానని, అందుకు నిదర్శనం ఇంత వరకు తనపై ఎలాంటి ఆరోపణలు లేకపోవటం తనకు సంతృప్తి కలిగిందన్నారు. చట్టం ముందు అందరు సమానులే అని కొన్ని సందర్భాల్లో స్నేహాలను, బంధుత్వాలను, కుల మతాలను విడిచి పని చేయాల్సి ఉంటుందన్నారు. అలాంటి సందర్భాలు కూడా తన ముందుకు వచ్చినా విధి నిర్వహణలో చట్టం ముందు అందరు సమానులే అన్న ఆలోచనతోనే పనిచేశానన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ఉన్నత పదవిని అలంకరించినా నిరాడంబరంగా ఉన్న వ్యక్తి డీజీపీ ద్వారకా తిరుమలరావు అని కొనియాడారు. అంతటి ఉన్నతమైన వ్యక్తిని పోలీసు సిబ్బంది ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని కోరారు.



కారంచేడులో డీజీపీ ద్వారకా తిరుమలరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, గ్రామస్థులు

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

అద్దంకిటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను పుట్టనిద్దాం, చదివిద్దాం, రక్షిద్దాం అనే వాటిని ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించి, ఆచరించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ కొరిశపాడు ప్రాజెక్ట్ సీడీపీవో ఏ. కృష్ణ కుమారి అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాల్య వివాహాలు, వృత్తి శిక్షణ, నైపుణ్యం, రక్తహీనత, సమతుల ఆహారం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యతోనే సాధికారత

మేదరమెట్ల: బాలికలకు విద్యతోనే సాధికారత వస్తుందని కొరిశపాడు ఐసీడీఎస్ సీడీపీవో ఏ. కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా తిమ్మనపాలెం హైస్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులతో ఆమె ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాన అవకాశాలు కల్పించాలి

పంగులూరు : లింగ బేధం లేకుండా పుట్టిన ప్రతిబిడ్డ ఎదుగుదలకు తల్లిదండ్రులు సమాన అవకాశాలు కల్పించాలని పీహెచ్‌సీ సీఎస్‌వో హిమబిందు కోరారు. మండల వైద్య సిబ్బంది శుక్రవారం పలు పాఠశాలల్లో స్థానిక ఉపాధ్యాయులతో కలిసి జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. అవకాశాలను అంది పుచ్చుకుని చదువుతో పాటు ఆటపాటల్లో రాణించి బాలికలు అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. వైద్యాధికారులు డాక్టర్ బాలరాజేశ్వరి, డాక్టర్ శివచెన్నయ్య, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బాలికల సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

చినగంజాం : బాలికలు చదువు, క్రీడలు, రక్షణ రంగాల్లో ముందుండాలని చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్ఎం డి.రత్నకుమారి, సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కే.కీర్తిసరోజ్‌లు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య అవశ్యకతను, దాని వలన కలిగే ప్రయోజనాలను హెచ్ఎం వివరించారు బాల్య వివాహ నిషేధ చట్టం, లింగ సమానత్వం, విద్యా హక్కుచట్టం గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.సుమలత అవగాహన కల్పించారు. సంతరావూరు గ్రామంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చినగంజాం జడ్పీ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఎస్.సౌజన్య, సంతరావూరు యూపీ పాఠశాల హెచ్ఎం సత్యానందం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


చినగంజాం జడ్పీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు

బల్లికురవలో..

బల్లికురవ : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో కె. కుసుమకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష, వైద్యాధికారి రవితేజ తదితరులు బాలికలకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు.

లింగవివక్ష లేకుండా చూడాలి


ప్రధానోపాధ్యాయిని మల్లీశ్వరిని సత్కరిస్తున్న ప్రతినిధులు

వేటపాలెం(చీరాలటౌన్) : బాలికల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని పలువురు వక్తలు అన్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షత లేకుండా చిన్నారుల ఆలోచన సరళిని మార్చాలని సూచించారు. అందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. చిన్నారులతో కోలాటం నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయిని మల్లీశ్వరిని ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రత్తి వెంకట సుబ్బారావు, బుర్ర సాంబశివరావు, లక్ష్మీ ప్రసాద్, శివ పార్వతి, లలిత, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలలో...

వేటపాలెం బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సజ్జా పుష్పవల్లి, ఎంఎల్‌హెచ్‌పీ సిరోరాణి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పర్చూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన ఎమ్మెల్యే ఏలూరి క్యాలెండర్‌ను శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, గుంటి వెంకటేశ్వర్లు,జంపని సాంబశివరావు, తేలప్రోలు సాంబశివరావు,పెంట్యాల శ్రీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులతో సమీక్ష

పర్చూరు నియోజకవర్గంలోని వ్యవసాయ అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమీక్ష నిర్వహించారు. వరి పంటను పండించిన రైతులకు సకాలంలో మద్దతు ధర చెల్లించి పంటను కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యం పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏడీఏ భాస్కరరావు, మోహనరావు, శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారులు అంజిరెడ్డి, మేరియమ్మ, కిరణ్, సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


క్యాంపు కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరితో నాయకులు

మోసపూరిత వ్యక్తులకు దూరంగా ఉండండి

- రూరల్ సీఐ శేషగిరిరావు


చేనేతపురి కాలనీలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత వ్యక్తుల నుంచి సామాన్య ప్రజలు దూరంగా ఉండాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. వేటపాలెం మండలం చేనేతపురి కాలనీలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయని చెప్పారు. ఇటువంటి వాటిపై ప్రజలు అవగాహన పొందాలన్నారు. అలాగే గ్రామంలో వీధి దీపాలు కచ్చితంగా పని చేసేలా చూడాలన్నారు. ప్రజలు స్నేహ భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు.


డ్రైవర్లకు గులాబీపూలు అందిస్తున్న అధికారులు

డ్రైవర్లు ప్రశాంతంగా బస్సులను నడపాలి

అద్దంకి, జనవరి24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌లు విధులలో ప్రశాంతంగా ఉండి బస్సులను నడపటం ద్వారా క్షేమంగా గమ్యం చేరుకోవచ్చని ఎంవీఐ ప్రసన్నకుమారి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్‌లకు గులాబి పుష్పాలు అందజేసి స్వాగతించి అభినందించారు. విధులలో ఏకాగ్రత ముఖ్యమని, అదే సమయంలో ఎదుటి వాహనాల డ్రైవర్‌లను ఒక కంటితో కనిపెట్టి ఉండాలన్నారు. ప్రయాణికులను ఎక్కించుకునే సమయంలో, దించే సమయంలో ఖచ్చితంగా పూర్తి రోడ్డు మార్జిన్‌లో మాత్రమే బస్సులను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ అంకమ్మరావు, అగ్నిమాపక కేంద్రం ఎస్సై వెంకటరావు, అద్దంకి రూరల్ ఎస్సై రవితేజ, డీఎం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి, సీఆర్‌సీ కొండలు తదితరులు పాల్గొన్నారు.


సీసీరోడ్లకు భూమిపూజలో తెలుగుదేశం నాయకులు

పూనూరులో సీసీరోడ్లకు భూమిపూజ

యద్దనపూడి,(మార్టూరు)జనవరి (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో శుక్రవారం రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు గ్రామంలో సిమెంటురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దాంతో 3 సిమెంటురోడ్లు దాదాపుగా 270 మీటర్లు పొడవుతో నిర్మాణం చేసేందుకు ప్రణాళికను తయారుచేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బోయపాటి సాంబశివరావు, నీటి సంఘం అధ్యక్షులు గన్నమనేని ప్రభాకరరావు, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఈదల అనిల్, తల్లపనేని సుధాకర్,పావులూరి రామారావు, ఈదల రవి, తిరుపతి రాయుడు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


కోటపాడు గ్రామంలో దూడలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న వైద్యాధికారి మురళీకృష్ణ

పశువులకు మెరుగైన వైద్యం

పంగులూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యంగా పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. గేదెలకు సూడి పరీక్షలు నిర్వహించి ఎదఇంజక్షన్లు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, ఏహెచ్‌వోలు శ్రీనివాసులు, అర్షియా శివనాయక్, రమేష్, బాజీబాబు, పశుపోషకులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

కారు ఢీకొని ఇద్దరు మహిళలకు గాయాలు

మేదరమెట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద రోడ్డు దాటుతున్న మహిళలను కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. శుక్రవారం రాత్రి తిమ్మనపాలెంలో జాతీయ రహదారికి పడమటి వైపు నుంచి తూర్పు వైపునకు వస్తున్న చెరుకూరి భూలక్ష్మి, వడ్లమూడి రమణలను జె. పంగులూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు ఢీ కొంది. ఈప్రమాదంతో తీవ్రంగా గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించించారు. మేదరమెట్ల ఏఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

భవనాసి కాలువలో వృద్ధురాలి మృతదేహం

అద్దంకి, జనవరి24(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెం వద్ద భవనాసి కాలువలో వృద్ధురాలి మృతిదేహం లభ్యమైంది. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని గొరకాయపాలెంకు చెందిన ఆర్. కోటిరత్నమ్మ(78) శు క్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. సుమారు 12 గంటల సమయంలో భవనాసి కాలువలో కోటిరత్నమ్మ మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం

మేదరమెట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డువానిపాలెంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయ్యింది. గ్రామంలోని చింతం వెంకటస్వామికి చెందిన ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి గృహోపకరణాలన్నీ కాలిపోయ్యాయి. దుస్తులు, ఇతర వస్తువులు బూడిదయ్యాయి. సుమారు రూ. 10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. మంటలను అద్దంకి నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది ఆర్పారు.


మంటలను అదుపుచేస్తున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది

'సోమశిల'లో 68.537 టీఎంసీల నిల్వ

అనంతసాగరం జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 1,866 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 68.537 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



వచ్చే నెల 1 నుంచి 3 రోజులపాటు సభలు

కవాతుతో ఎరుపెక్కిన నెల్లూరు నగరం

సీపీఎం రాష్ట్ర మహాసభల

నగారా

నెల్లూరు (వైద్యం) జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 1వ తేదీ నుంచి మూడు రోజులపాటు నెల్లూరులో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు నగారా మోగించారు. శుక్రవారం నగరంలోని వీఆర్‌సీ క్రీడా మైదానంలో డప్పు వాయించి మహాసభల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఎరుపు రంగు చొక్కాలు ధరించిన వలంటీర్ల వందనాన్ని స్వీకరించారు. అనంతరం నగరంలోని ప్రధాన కేంద్రాలలో ఎర్రదండు ప్రదర్శనతో ఆయా ప్రాంతాలు ఎరుపుమయం అయ్యాయి. సీపీఎం నేతలతోపాటు కార్యకర్తలు కూడా ఎర్ర దుస్తులు ధరించి ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అనేక ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిన సింహపురి గడ్డపై నుంచే భవిష్యత్తు పోరాటాలకు మహాసభలలో రూపకల్పన చేస్తామన్నారు. ఈ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభల ముగింపు రోజు 3వ తేదీన నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించి, వీఆర్‌సీ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు రమాదేవి, మూలం రమేష్, కత్తి శ్రీనివాసులుమోహన్‌రావ్, అజయ్‌కుమార్, గోపాల్, నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌బీ, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వీఆర్సీ మైదానంలో డప్పు వాయిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



ఉదయగిరి : రంగనాయకులస్వామి ఆలయ ముఖద్వారం

పర్యాటకం... ప్రతిపాదనల్లోనే!

నీటిమూటలవుతున్న పాలకుల హామీలు

• నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

పచ్చని చెట్ల మధ్య ఎత్తయిన కొండలు.. వాటినుంచి పాలవెల్లువలా జాలువారే సెలయేళ్లు ఓ వైపు... ఎంత పెద్దవారైనా పిల్లోడిలా మార్చేసే కడలితీరం మరోవైపు... భక్తిభావం పెంపొందించే ప్రముఖ ఆలయాలు.. ఆహ్లాదం పంచుతూ చల్లని గాలులు వీచే జలాశయాల ప్రాంతాలు, ఉద్యానవనాలు అబ్బో.. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో పర్యాటక ప్రాంతాలు చాలానే ఉన్నాయి. ఉరుకులు పరుగుల ప్రపంచంలో మానసిక ఉల్లాసం కోసం నగరం, పట్టణవాసులు సెలవు రోజుల్లో ఈ ప్రాంతాలకే తరలిపోతుంటారు. అయితే, అలా వెళ్లిన వారిని అక్కడి పరిస్థితులు వెక్కిరిస్తున్నాయి. ఇంటిల్లిపాది కాసేపు గడిపేందుకు కనీస వసతులు కరువవుతున్నాయి. కనీసం సేదతీరే సౌకర్యం లేకపోవడంతో ఊసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం అధికారులు చేస్తున్న ప్రతిపాదనలు కాగితాల్లోనే ఉండిపోతున్నాయి. ఇచ్చిన హామీలను కూడా నాయకులు విస్మరిస్తున్నారు. గత వైసీపీ హయాంలో మరింత కునారిల్లిన పర్యాటక రంగం ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ప్రగతి బాట పట్టేనా!? పర్యావరణప్రియులు ఆశగా ఎదురుచూస్తున్నారు. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల స్థితిగతులపై ఆంధ్రజ్యోతి సంక్షిప్త కథనం...

- వివరాలు 6లో..



అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

పకడ్బందీగా గణతంత్ర దినోత్సవం

• విస్తృత ఏర్పాట్లు చేయండి : జేసీ

నెల్లూరు (హరనాథపురం) జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో జరుగుతున్న గణతంత్ర

- వివరాలు 6లో

ఓటు వజ్రాయుధం

• ఓటుతోనే పాలకుల ఎన్నిక

• నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఓటు వజ్రాయుధం వంటిది. మంచి పాలకులను ఎన్నుకోవడానికి ఆ ఆయుధం పనిచేస్తుంది. 1950లో భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైంది. ఈ సందర్భంగా ప్రతి ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. 2011 నుంచి ఈ వేడుకలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి. యువత రాజకీయ కార్యకలాపాలలో నిమగ్నం అయ్యేలా చూడాలనేదే జాతీయ ఓటరు దినోత్సవ లక్ష్యం. ప్రజా సమస్యల పరిష్కారానికి మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడానికి ఓటు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఓటరు దినోత్సవం సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓటు విలువను తెలియచేసి, ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం బహుమతులు అందచేస్తారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. కాగా, జిల్లాలో 19,44,664 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలదే ఆధిక్యం. గతేడాది ఎన్నికల సమయంలో విడుదల చేసిన ఓటర్ల జాబితాతో పోల్చితే ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో 1.17 లక్షల మంది ఓటర్లు తగ్గారు. నాడు 20,61,822 మంది ఓటర్లు ఉండగా ఈ సంవత్సరం విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం 1944664 మందే ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	113081	115591	26	228698
కావలి	117540	122091	28	239659
ఆత్మకూరు	105718	109542	06	215266
కోవూరు	128642	138161	25	266828
నెల్లూరునగరం	116590	122603	67	239260
నెల్లూరురూరల్	136816	144454	21	281291
సర్వేపల్లి	112863	119257	26	232146
మొత్తం	951145	993309	210	1944664



కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానంలో మద్యం షాపులు కేటాయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గీత ఉపకులాలకు 'లక్కీ' షాపులు

• మద్యం దుకాణాలు కేటాయించిన కలెక్టర్

నెల్లూరు (క్రైం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గీత కులాల సంక్షేమార్థం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన 18 మద్యం దుకాణాలను లక్కీడిప్ ద్వారా ఉపకులాలకు కేటాయించారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ఆనంద్ ఆధ్వర్యంలో కల్లు గీత కార్మికుల సంక్షేమ సమితి నాయకుల పరిశీలనలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లాటరీ విధానం ద్వారా గమళ్ల కులానికి 4, గౌండ్లకు 1, గౌడకు, గౌడ్‌కు 6 షాపులను కేటాయించినట్లు తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం షాపుల ఏర్పాటుకు ఆయా ఉపకులాలలోని ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. షాపుల లైసెన్స్ ఫీజులో వారికి 50 శాతం రాయితీ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతం	ఉపకులం
నెల్లూరు	గమళ్ల
కావలి	గమళ్ల
కందుకూరు	గౌడ్
ఆత్మకూరు	గౌడ
కందుకూరు రూరల్	గౌడ్
కలువాయి	గౌడ
లింగసముద్రం	గౌడ్
దగదరి	గౌడ
ఏఎస్‌పేట	గౌడ
కావలి రూరల్	గౌండ్ల
గుడ్లూరు	గమళ్ల
ఆత్మకూరు	గమళ్ల
జలదంకి	గౌడ
సంగం	గౌడ్
కలిగిరి	గౌడ్
అనంతసాగరం	గౌడ్
వింజమూరు	గౌడ
దుత్తలూరు	గౌడ

కాటేపల్లి పంచాయతీ కార్యదర్శి

విధుల నుంచి తొలగింపు

వింజమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాటేపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమారిని విధులు నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆనంద్ ఉత్త ర్వులు జారీ చేశారు. పంచాయతీలో రికార్డులు, సమావేశాలు సరిగా నిర్వహించకపోవడం, పంచా యతీ తీర్మానాలు అమలుపరచకపోవడం, సీఎఫ్ ఎంఎస్ నిబంధనల మేరకు నిధులు చెల్లింపు, ఇంటి పన్ను వసూళ్లను దుర్వినియోగం చేయడం, కంపచెట్లను పంచాయతీ ఆదాయానికి నష్టం చేకూర్చడం, విధులను విస్మరించడం తదితర కారణాలతో ఆమెపై వేటు పడింది. అదే విధంగా సాధారణ నిధులతో పాటు 14, 15వ ఆర్థిక సం ఘాల నిధుల నుంచి డ్రాచేసిన మొత్తం రూ.46,85,894 సంబం. దించిన రికార్డులను పొందుపరచ నందున చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఇందుకూరుపేట మండలంలోని ఓ గ్రామంలో 3.79 ఎకరాలను 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద భూసేకరణ చేయాలని నిర్ణయించారు. వాస్తవానికి అక్కడ ఓ ఎకరా విలువ రూ.5.15 లక్షలు. భూసేకరణ నిబంధనల ప్రకారం 1.25 రెట్లు పెంచేందుకు అవకాశముంది. దీంతో ఎకరం విలువ రూ.6.44 లక్షలు ఉండాలి. దీనికి వంద శాతం సొల్యూషన్ కలుపుకునేందుకు కూడా వీలు కల్పించారు. ఈ లెక్కన చూసుకుంటే ఒక ఎకరానికి రూ.12.96 లక్షలు మాత్రమే పరిహారం చెల్లించాలి. కానీ ఇక్కడ మాత్రం భూ యజమాని అడిగారన్న కారణంతో ఎకరం విలువను ఏకంగా రూ.23 లక్షలకు పెంచారు. ఇలా మొత్తంగా 3.79 ఎకరాలకు రూ.49.11 లక్షలను పరిహారం కింద చెల్లించాల్సి ఉండగా అందుకు రెట్టింపు అంటే రూ.87.17 లక్షలను చెల్లించారు.

టీపీ గూడూరు మండలంలోని మరో గ్రామంలో 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద 1.58 ఎకరాలను సేకరించారు. ఇక్కడ ఎకరం బేసిక్ వ్యాల్యూ రూ.6 లక్షలుగా ఉంది. నిబంధనల ప్రకారం 1.25 రెట్లు పెంచితే ఎకరం విలువ రూ.7.5 లక్షలుగా ఉంటుంది. దీనికి వంద శాతం సొల్యూషన్ కలుపుకున్నా ఎకరం విలువ రూ.15 లక్షలు మాత్రమే అవుతుంది. మొత్తం 1.58 ఎకరాలకు నిబంధనల ప్రకారం రూ.23.82 లక్షలు పరిహారం కింద చెల్లించాల్సి ఉండగా అందుకు భిన్నంగా రూ.34.76 లక్షలు చెల్లించారు. నెగోషియేషన్ పేరుతో అధికారులు ఎకరం వ్యాల్యూను రూ.15 లక్షల నుంచి రూ.22 లక్షలకు పెంచారు.

ఇవే కాదు... ఇటువంటి చిత్ర విచిత్రాలు జిల్లాలో అనేకం ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల స్థలాల పేరుతో భారీగా అవినీతి జరిగినట్లు మొదటి నుంచీ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా భారీ ధరలు ఖరారు చేసి నాడు దోచిపెట్టారన్న ప్రచారం జరిగింది. నివాస యోగ్యం కాని భూములను కూడా అధిక ధరలతో కొనుగోలు చేశారన్న ఫిర్యాదులు న్నాయి. అప్పట్లోనే ఎన్ని ఆరోపణలు వచ్చినా నాడు పట్టించుకున్న వారు లేరు. పేదల ఇళ్ల సంగతేమో గానీ వైసీపీ నేతలు మాత్రం అవినీతి సంపాదనతో భారీ భవంతులే కట్టుకున్నారన్న ఆరోపణలున్నాయి.

ఇళ్ల స్థలాల కొనుగోలు పేరుతో అక్రమాలు

పేదల మాటున బడా దోపిడీ!

• నిబంధనలకు మించి పరిహారాలు చెల్లింపు
• నివాసయోగ్యం కాని భూములకు కూడా అధిక ధరలు
• నాడు వైసీపీ నేతలపై వెల్లువెత్తిన ఆరోపణలు
• ఇప్పుడు విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
• రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలన

జిల్లాలో 1,109 లేఅవుట్లు వేయగా అందులో సుమారు 150 లేఅవుట్లకు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూమిని కొనుగోలు చేశారు. ఇందుకు రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించారు. ఈ కొనుగోలుకు ప్రభుత్వం కొన్ని విధివిధానాలు రూపొందించింది. కానీ చాలా చోట్ల అవేవీ పాటించ లేదని ఆ లేఅవుట్లను చూస్తేనే అర్థమవుతోంది. భూసేకరణ నిబంధనల ప్రకారం బేసిక్ వ్యాల్యూ కన్నా 1.25 రెట్లు అధికంగా చెల్లించవచ్చు. ఈ మొత్తానికి వంద శాతం సొల్యూషన్ కూడా కలుపుకోవచ్చు. అంతకుమించి చెల్లించేందుకు నిబంధనలు ఒప్పుకోవు. కానీ చాలా చోట్ల ఈ మొత్తాని కన్నా రెట్టింపు ధరను ఖరారు చేసి ప్రజాధనాన్ని దోచిపెట్టారు. తహసీల్దార్ నుంచి కలెక్టర్ స్థాయి వరకూ ప్రతి ఒక్కరూ ఇందులో పాత్రధారులుగా ఉన్నారు. కావలి మండలంలో భూసేకరణ విషయంలో భారీ ధరను పరిహారంగా చెల్లించాలని వైసీపీ నేతలు పట్టుబట్టగా నాటి కలెక్టర్ ఎంవీ శేషగిరిబాబు ఒప్పుకోలేదని, ఆయన బదిలీకి ఇదే ప్రధాన కారణమని నాడు ప్రచారం కూడా జరగడం గమనార్హం.

విజిలెన్స్ విచారణ ప్రారంభం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్లపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో అనేక చోట్ల నివాసానికి పనికి రాని లేఅవుట్లను వేసి ప్రజాధనాన్ని దోచుకున్నారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఈ లేఅవుట్లకు అవసరమైన భూమి కొనుగోలు దగ్గర నుంచి ఆ భూమిని చదును చేయడం వరకూ అవినీతి జరిగిందన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. లేఅవుట్ల లెవలింగ్‌పై డ్వామా క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఓ వైపు విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలోనే భూమి కొనుగోళ్లపై విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది. పేదలందరికీ ఇళ్లు పథకం కింద కొనుగోలు చేసిన భూముల వివరాలన్నింటినీ సేకరిం చింది. రికార్డుల ప్రకారం అన్ని వివరాలను సరిచూసుకున్న విజిలెన్స్ అధికారులు.. ఇప్పుడు క్షేత్రస్థాయి విచారణకు దిగారు. గడిచిన రెండు రోజులుగా విస్తృతంగా లేఅవుట్లను పరిశీలిస్తున్నారు. సగానికిపైగా లేఅవుట్ల పరిశీలన పూర్తయినట్లు సమాచారం. చాలా లేఅవుట్లలో అక్రమాలు గుర్తించినట్లు తెలుస్తోంది. త్వరలోనే విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు. ఈ నేపథ్యంలో భూమి కొనుగోళ్లలో ఎన్ని రూ.కోట్ల మేర అక్రమాలు జరిగాయి..? ఇందుకు ఎవరెవరు బాధ్యత వహించాల్సి ఉంటుంది? అన్నది ఆసక్తిగా మారింది.



- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

సర్వేపల్లిలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్

10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మాణం

రూ.20 కోట్ల అంచనాలతో టెండర్లు పిలిచిన నెడ్‌క్యాప్

ఇప్పటికే సర్వేపల్లిలో 15 ఎకరాల సేకరణ

నెల్లూరు చెత్తంతా ఇక ఆ ప్లాంట్‌కే

తక్కువ ధరకే కార్పొరేషన్‌కు విద్యుత్ సరఫరా

నెల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎప్పటి నుంచో ప్రతిపాదనల దశలో ఉన్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణంలో అడుగులు ముందుకు పడ్డాయి. చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్‌ను నెలకొల్పేందుకు నెల్లూరులో నెడ్‌క్యాప్ సిద్ధమైంది. రూ.20 కోట్ల అంచనాతో ఈ ప్లాంట్ ఏర్పాటుకు ఆ సంస్థ టెండర్లు ఆహ్వానించింది. ప్రతి రోజూ 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంటు నిర్మాణం చేపట్టనుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. ఇప్పటికే గుంటూరు, విశాఖ నగరాల్లో ఈ ప్లాంట్‌ను నిర్మించి విజయవంతంగా చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా ఇప్పుడు మూడో ప్లాంట్‌ను నెల్లూరులో నిర్మిస్తుండడం విశేషం. గతంలోనే ఈ ప్లాంట్ నిర్మాణానికి సర్వేపల్లిలో 15 ఎకరాల భూమిని గుర్తించారు. వచ్చే నెల 6వ తేదీతో టెండర్ల దాఖలుకు గడువు ముగుస్తుంది. ముందుకొచ్చే ఆసక్తి కలిగిన సంస్థల్లో ఒక సంస్థను ఎంపిక చేసి నెల్లూరు ప్లాంట్ బాధ్యతలను అప్పగిస్తారు. ప్రస్తుతం నెల్లూరులో రోజుకు 300 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, దొంతాలి డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తున్నారు. ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే ఇక నగరంలో వచ్చే చెత్తను అక్కడకు తరలిస్తారు. ఆ చెత్తను ప్రాసెసింగ్ చేసి దాని నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. దీంతో నెల్లూరు కార్పొరేషన్‌కు చెత్త డంపింగ్ చేసే సమస్య తప్పుతుంది. ఇక ప్లాంట్‌లో తయారయ్యే విద్యుత్‌ను కార్పొరేషన్‌కే తక్కువ ధరకు విక్రయిస్తారు. ఇక్కడ సరిపోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. విద్యుత్ తయారీ క్రమంలో వచ్చే యాష్ బయటకు వచ్చి పొల్యూషన్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ యాష్‌తో బ్రిక్స్‌ను తయారు చేస్తూ మరో వ్యాపారం చేస్తున్నారు. ప్లాంట్ మొత్తం గ్రీనరీగా తయారు చేస్తున్నారు. కాగా ఈ ప్లాంట్ ఏర్పాటుపై నెడ్ క్యాప్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డిని సంప్రదించగా నెల్లూరులో ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి హెడ్ ఆఫీస్ నుంచి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఈ ప్లాంట్ ఏర్పాటుతో నెల్లూరులో చెత్త డంపింగ్ సమస్య తీరుతుందని, తక్కువ ధరకే కార్పొరేషన్‌కు విద్యుత్‌ను అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.



ప్రమాదమని తెలిసినా...!



ఎంత హడావిడి జీవితమైనా, ఎన్ని అర్జెంటు పనులున్నా ప్రమాదాలకు ఎదురెళ్ల కూడదు. కానీ కొందరు తొందరగా వెళ్లాలన్న ఆతృతలో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నెల్లూరులోని సౌత్ రైల్వే స్టేషన్ వద్ద నిత్యం ఎంతో మంది ప్రమాదకరంగా రైలు పట్టాలు దాటుతున్నారు. రైలు ఎక్కాలన్న తొందర కొందరిదైతే... రైలు ఆగితే కాసేపు పట్టాలు దాటలేమన్న అసహనం మరికొందరిది. ఇంకొందరు రైలు వస్తుండగా కొన్ని సెకన్ల ముందు ట్రాక్ మీద నుంచి పరుగులు తీస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే కుటుంబం జీవితాంతం కన్నీరు పెట్టాల్సి వస్తుందని ఒక్క క్షణం ఆలోచిస్తే ఇలాంటి సాహసాలు చేయరు. రైలు రావడానికి ముందే స్టేషన్‌కు చేరుకోవడం, రైలు ఆగినా రెండు నిమిషాలే కదా అని ఓపిక పట్టి ఆ తర్వాత పట్టాలు దాటడం శ్రేయస్కరం అని గుర్తించాలి. మిత్రులారా.. బీ కేర్‌ఫుల్!

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్






జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి నోచుకోనంటోంది. రాజకీయ నాయకులు ఎన్నికల్లో ఇస్తున్న హామీలు ఆ తర్వాత అమలుకు నోచుకోవడం లేదు. పైగా చేసిన ప్రతిపాదనలు కూడా కాగితాల్లోనే ఉండిపోతున్నాయి. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలపై సంక్షిప్త సమాచారంతో ప్రత్యేక కథనం...



మైపాడు తీరంలో ఉల్లాసంగా గడుపుతున్న ప్రజలు

ప్రతిపాదనల్లోనే పర్యాటకం!

- అభివృద్ధికి నోచుకోనంటున్న వైనం
- నీటిమూటలవుతున్న పాలకుల హామీలు
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం



ఎన్నికల అస్త్రంగా దుర్గం

ఉదయగిరి : మనసు రంజింపచేసే ప్రకృతి శోభ కలిగిన ఉదయగిరి దుర్గంపై దట్టమైన అడవులు, కొండలు అందులో నుంచి ప్రవహించే జలపాతాలు, సెలయేళ్ల చూడముచ్చటగా ఉంటాయి. ఎందరో రాజులు, నవాబులు, బ్రిటీషు పరిపాలనకు కేంద్రంగా విరాజిల్లిన పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణం. ప్రతిసారి ఎన్నికల సమయంలో ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పిన నేతల మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. దుర్గం అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలు కాగితాల్లోనే ఉండిపోయాయి. దీంతో నానాటికీ శిథిలమవుతున్న అలనాటి చారిత్రక గుర్తులు భావితరాల వారు పుస్తకాల్లో చదివి చెప్పుకోవాల్సిన దుస్థితి నెలకొంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

దశాబ్దాలుగా ఉదయగిరి దుర్గం ఎన్నికల్లో నేతలకు అస్త్రంగానే మారింది. 1989లో అప్పటి ఎమ్మెల్యే మాదాల జానకీరామ్ కేంద్రమంత్రి జగదీష్ టైట్లర్‌ను దుర్గం సందర్శనకు తీసుకెళ్లి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. అప్పట్లో తొలివిడత రూ.2.16 కోట్లు మంజూరు చేశారు. మొదటి దశ నిధుల్లో రూ.40 లక్షలతో ఉదయగిరి నుంచి వల్లభరాయుని ఆలయం వరకు తారు రోడ్డు నిర్మించారు. వల్లభరాయుని దేవస్థానాన్ని అయ్యప్ప ఆలయంగా మార్చారు. దుర్గంపై అతిథిగృహ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అనంతరం జరిగిన పరిణామాల్లో నిధులు వేరే పనులకు మళ్లించారు. 2010లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉదయగిరి ఆనకట్ట సమీపంలో సుమారు రూ.10 లక్షలతో చేపట్టిన అతిథిగృహం, హోటళ్ల నిర్వహణ కోసం నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు అధికారులతో కలిసి దుర్గాన్ని సందర్శించి, ఎలాంటి అభివృద్ధి చేయవచ్చో టూరిజం శాఖ అధికారులతో చర్చించారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపారు. ఈ ప్రతిపాదనలు సైతం కాగితాలకే పరిమితమయ్యాయి. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా దుర్గం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందా అని ఈ ప్రాంత ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

'వేదగిరి'కి 'ప్రసాద్' హంగులు

నెల్లూరు రూరల్ : పుణ్యక్షేత్రమైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం పర్యాటక హంగులు దిద్దుకోనున్నది. కేంద్ర పర్యాటక శాఖ 'ప్రసాదం' పథకం ద్వారా రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో రూ.18 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసిన అధికారులు ఆ దస్త్రాలను న్యూఢిల్లీకి చేర్చారు. తుది పరిశీలనకు అక్కడ నుంచి ప్రత్యేక బృందం వేదగిరిని పరిశీలించేందుకు త్వరలో రానున్నది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు మొదలుపెట్టేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. దేవరపాళెం నుంచి ఆలయానికి వెళ్లే మెట్ల మార్గంపైన రేకులతో పైకప్పు, లైటింగ్, మెట్లు ఆధునీకరణ వంటి పనులు చేపట్టనున్నారు. ఆలయంలో భక్తులు రాత్రివేళ సేదతీరేందుకు వీలుగా డార్మెంటరీ నిర్మించనున్నారు. ఏడు కోనేళ్ల ఆధునీకరించడంతోపాటు కొండపైనున్న స్వామి వారి దశావతారాలపై కప్పు, పార్కులను ఏర్పాటు చేయనున్నారు. పార్కింగ్ ప్రాంతాలు, పర్యటక భవనం ఆధునీకరణతోపాటు ఆలయంలోని అర్చకులకు కాటేజీలను నిర్మించను న్నారు. అంతేగాక దేవస్థానం కార్యాలయ భవనం, ఆలయం చుట్టూ ప్రహరీని నిర్మించనున్నారు. కొండ కింద టోల్‌గేట్ నుంచి పైన ఆలయం వరకు లైటింగ్, ఏడు కోనేళ్ల వద్దనున్న గోవిందరాజుల స్వామి ఆలయ ప్రహరీ ఆధునీకరణ, స్వామి ఆలయంలో అంతర్గత పనులు చేపట్టనున్నారు.



వేదగిరి క్షేత్రం వ్యూ



మైపాడు బీచ్‌లో...

ఇందుకూరుపేట : నెల్లూరుకు 22 కి.మీ దూరంలో ఉన్న మైపాడు బీచ్ సందర్శకులను ఆకర్షిస్తోంది. కానీ ఆ స్థాయిలో ఇక్కడ వసతులు కరువయ్యాయి. ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపుల ఎటు చూసినా పచ్చని పొలాలు, కొబ్బరి చెట్లు, అరటి తోటలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. వీటిని దాటుకుని ముందుకెళితే ఎగిసిపడే అలల సవ్వడులు, మధ్యలో ఆధ్యాత్మికత పరిడవిల్లే జ్యోతిర్లింగాల క్షేత్రం ఉంది. అటు ఆహ్లాదం.. ఇటు ఆధ్యాత్మికత ఉట్టిపడే మైపాడు బీచ్ అలసిన మనసులను మైమరిపిస్తోంది. దీంతో జిల్లా వాసులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు తరలివస్తుంటారు. ఈ తీరంలో కొలువైన ద్వాదశ జ్యోతిర్లింగాలయం దేశాన్ని చుట్టి వచ్చిన అనుభూతులను కల్పిస్తోంది. పళని సుబ్రహ్మణ్యంస్వామి, వల్లిదేవసేన సమేత సూర్యచంద్ర పార్వతీ దుర్గాదేవిలు ఈ సాగరతీరంలోని ఒకే ఆలయంలో కొలువై ఉంది. ఆలయ ప్రాంగణంలో ఎత్తైన మహా శివలింగం తన్మయత్వం చెందేలా చేస్తోంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగి మైపాడు సముద్రతీరంలో పర్యాటకుల కోసం ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు నిర్మించిన రిసార్ట్ పూర్తిగా శిథిల వ్యవస్థలోకి చేరాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రిసార్ట్ గురించి పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మైపాడు బీచ్‌ను పర్యాటక ప్రాంతంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని పర్యాటకలు, స్థానికులు కోరుతున్నారు.



ఎర్త్‌డ్యాంపై బోసిపోయిన పచ్చదనం

సోమశిల కళావిహీనం

కూటమి ప్రభుత్వంపై ఆశలు

అనంతసాగరం : పర్యాటక రంగానికి ఎంతో ఊతమిచ్చే సోమశిల జలాశయం పాలకుల అనాలోచిత నిర్ణయాలతో కునారిల్లుతోంది. అభివృద్ధి మాట అటుంచితే కనీసం ఉన్నవాటిని కాపాడుకోలేని దైన్యస్థితి ఇక్కడ నెలకొంది. 1975లో నిర్మితమైన సోమశిల జలాశయం పదేళ్ల తర్వాత నీటి నిల్వ ప్రక్రియ, ఆయకట్టు అభివృద్ధి చర్యలు అందుబాటులోకి రావడంతో 1985లో జాతికి అంకితం చేస్తున్నట్లు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు సోమశిలలో పైలాన్ ఆవిష్కరించారు. అప్పట్లో టీడీపీ హయాంలోనే అభివృద్ధికి అంకురార్పణ జరిగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వం కూడా సోమశిల రూపురేఖలు మార్చిన దాఖలాలు లేవు. జలాశయం దిగువ ప్రముఖ పుణ్యక్షేత్రం సోమేశ్వరాలయం ఉంది. 2013లో రూ.2.79 కోట్లతో పర్యాటక పనులు అందుబాటులోకి తెచ్చారు. ఆరు పర్ణశాలలు, డార్మెంటరీ, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే, వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో సోమశిలకు వచ్చిన సందర్శకులు విడిది చేసే అవకాశం లేక వెనుతిరుగుతున్నారు. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన సోమశిల ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా అభివృద్ధి చెందుతుందన్న ఆశ స్థానికుల్లో నెలకొంది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కూడా సోమశిలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఎకోటూరిజంకు బాటలు వేస్తామని ఇటీవల ప్రకటించారు. ఆ దిశగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అందమైన పార్కులు, రిసార్ట్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండగా స్థానికుల ఉపాధి అవకాశాలు లభ్యం కానున్నాయి. ఇక బోటు షికారు వల్ల నెల్లూరు టూ కడప ప్రయాణం తగ్గుతుంది. నీటి అందాలు తిలకిస్తూ కడప జిల్లా సిద్దవటం వరకు షికారు చేసే సౌలభ్యం కలుగుతోంది.

- రాపూరు మండలంలోని కండలేరు డ్యాంలోనూ పర్యాటకాభివృద్ధిని గాలికివదిలేశారు. ఇక్కడ అతి పొడవైన మట్టి కట్టడం, పార్కు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. వీటి అభివృద్ధిపై పాలకులు పట్టించుకోవడం లేదు. డ్యాంలో బోటు షికారుకు ప్రతిపాదనలు చేసినా అమలుకు నోచుకోలేదు. ఇక పెంచలకోన అభివృద్ధికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్ అడుగు ముందుకు వేయనంటోంది.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్యామల

కేన్సర్, మానసిక ఆరోగ్యంపై
సర్వే పక్కాగా చేయాలి

- ఎన్‌సీడీ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్యామల

నెల్లూరు (వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేన్సర్, మానసిక ఆరోగ్యంపై సర్వే పక్కాగా నిర్వహించాలని ఎన్‌సీడీ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ఆర్ శ్యామల ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ హెచ్‌ఈవో, ఏఎన్ఎం, ఆశాలు ఒక బృందంగా ఏర్పడి ఆయా వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. 18 ఏళ్లు దాటిన వారిందరికీ తప్పనిసరిగా కేన్సర్, మానసిక వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. కేన్సర్ స్కీనింగ్ దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా జరుగుతోందని పేర్కొ న్నారు. దీన్ని నిరంతరం వైద్యాధికారులు పర్యవేక్షిస్తూ, ప్రతి గురువారం శిబిరాలు నిర్వహించాలని, అనుమానితులను రిఫరల్ ఆసుపత్రికి సిఫార్సు చేయాలని సూచించారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ వీ సుజాత మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన ఇళ్లను ఎట్టి పరిస్థితిలో పూర్తిసర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ రాష్ట్ర కన్సల్టెంట్ రాజ్‌కుమార్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ సురేష్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాసవి, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

పకడ్బందీగా గణతంత్ర దినోత్సవం



పోలీస్ కవాతు మైదానంలో రూపుదిద్దుకుంటున్న సభావేదిక

(5వ పేజీ తరువాయి)

దినోత్సవ ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలిసి జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పది స్టాళ్లు, పది శకటాలను ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంచినీరు, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జేసీ వెంట ఏఎస్‌పీజీ మునిరాజా, డీఎస్‌పీ చంద్రమోహన్, డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు, ఆర్డీవో అనూష, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు గంగాభవానీ, నాగరాజకుమారి, డీఎంహెచ్‌ఓ సుజాత, డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్చి 19 నుంచి
'డీకేడబ్ల్యూ' వజ్రోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ మహిళా (డీకేడబ్ల్యూ) ప్రభుత్వ కళాశాల వజ్రోత్సవాలు ఈ ఏడాది మార్చి 19, 20 తేదీలలో నిర్వహించాలని ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నిర్ణయించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన పూర్వ విద్యార్థులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. విద్యా బోధనలో డీకేడబ్ల్యూ అత్యుత్తమ ర్యాంకు సాధించిందన్నారు. వజ్రోత్సవాల్లో భాగంగా పూర్వ విద్యార్థులకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ అధ్యాపకులు, సిబ్బందికి సత్కారాలు జరుగుతాయని తెలిపారు. వజ్రోత్సవాల సందర్భంగా సావనీర్ ప్రచురిస్తామని, దీనికి పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు వారి జ్ఞాపకాలను అందించాలని కోరారు. ఆర్టికల్స్‌ను dkalumni1964@gmail.comకు మెయిల్ చేయాలన్నారు. పూర్తి వివరాలకు 93987 79966, 99494 05595, 94415 40317, 77891 49360, 89781 54116, 91829 23406 నెంబర్లను సంప్రదించాలని కోరారు. మీడియా సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు వీ జ్యోతిరెడ్డి, కార్యదర్శి కే కుసుమకుమారి, ట్రెజరర్ టీ జానకి, వైస్‌ప్రెసిడెంట్ జక్కా శేషమ్మ, జాయింట్ సెక్రటరీ ఎన్ జయలక్ష్మి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వజ్రోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

స్వర్ణాల చెరువులో మీనోత్సవం



స్వర్ణాల చెరువులో చేప పిల్లలను వదులుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు స్వర్ణాల చెరువులో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలే మీనోత్సవ కార్యక్రమం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రధాన మంత్రి మత్స్య యోజన (పీఎంఎంఎస్‌వై) పథకంలో భాగంగా ప్రతి సంవత్సరం రిజర్వాయర్లు, చెరువుల్లో చేప పిల్లలను వదులుతారు. అందులో భాగంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, 41వ డివిజన్ కార్పొరేటర్ కువ్వాకుల విజయలక్ష్మి, ఇన్‌చార్జి బాబీ యాదవ్, 35వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బర్నాబాస్, టీడీపీ నాయకుడు కువ్వాకుల మధు 5లక్షల చేప పిల్లలను వదిలారు. మత్స్యకారుల జీవన ఉపాధి కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ రంనాథబాబు, మత్స్య అభివృద్ధి అధికారి సంజయ్ స్టీఫెన్, అధికారులు పాల్గొన్నారు.

ఆకాశవాణిలో నేడు సర్వభాషా కవితా సమ్మేళనం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి కేంద్రం రూపొందించిన సర్వభాషా కవితా సమ్మేళనం శనివారం అన్నీ ఆకాశవాణి కేంద్రాల్లో ప్రసారం కానుంది. ఈ కార్యక్రమం ప్రాంతీయ భాషల్లో శనివారం రాత్రి 10గంటలకు నెల్లూరు ఆకాశవాణి కేంద్రం ఎఫ్ఎం 101.9 చానెల్‌లో ప్రసారమవుతుందని, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం ఎండబ్ల్యూ 738 కేహెచ్‌జడ్‌పైన ప్రసారం అవుతుందని హైదరాబాద్ కేంద్ర కార్యక్రమ విభాగాధిపతి కేఎల్ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రోతలు ఈ కార్యక్రమాన్ని విని ఆనందించాలని కోరారు.

నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థత

నెల్లూరు (వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వేదాయపాళెంలో ఉన్న దుర్గా నర్సింగ్ కళాశాలలో 13 మంది విద్యార్థినులు శుక్రవారం మధ్యాహ్నం ఆహారం తీసుకున్న తర్వాత అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడటంతో కళాశాల నిర్వాహకులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. జీజీహెచ్ వైద్యులు చికిత్సలు అందించారు. 11 మంది విద్యార్థినులు కాసేపటికి కోలుకోవడంతో కళాశాలకు వెళ్లిపోయారు. మిగిలిన ఇద్దరు సాయంత్రం వరకు వైద్యం చేయించుకుని కాలేజీకి వెళ్లారు. విద్యార్థినుల అస్వస్థతకు ఫుడ్ పాయిజనే కారణమన్న అనుమానం వ్యక్తం అవుతోంది.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

పొదలకూరు : ఆర్థిక సమ స్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరుపూరులో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మరుపూరులో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న ఆకురాతి కోటేశ్వరరావు ఆర్థిక ఇబ్బందులతో తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యు లు చికిత్స నిమిత్తంవ స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనీఫ్ తెలిపారు.

కనీస మద్దతు ధర కోసం రేపు రైతుల ట్రాక్టర్ల ర్యాలీ

నెల్లూరు (వ్యవసాయం) : పంటలకు కనీస మద్దతు ధరను గ్యారెంటీ చేస్తూ చట్టం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం ట్రాక్టర్ల ర్యాలీ జరగనుంది. దీనిని విజయవంతం చేయాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. ఆదివారం ఉదయం నెల్లూరులోని బోసుబొమ్మ కూడలి నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలో జంటనాగుల శిలాప్రతిష్ఠ


వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు

కావలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం జంటనాగుల శిలాప్రతాష్ఠ కార్యక్రమం, అశ్వథనారాయణ కల్యాణంను నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఈ వేడుకలో పాల్గొనగా ఆయనకు ఆలయకమిటీ బాధ్యులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందరర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కాలనీలో రూ.1.7కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, బాలగురుస్వామి, వెంకట్రావు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యేల ఫొటోలకు పాలభిషేకం

కావలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మ పేరు నామకరణం చేయడంతో టీడీపీ నేత తిరువీధి ప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ అభిమానులు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కావలిలోని ఐకాన్ సెల్ఫీ సెంటర్ వద్ద సాయంత్రం జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేతలు, మాగుంట అభిమానులు పాల్గొన్నారు.

2027 నాటికి కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యం

సంగం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2027 నాటికి కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్ వలీ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిరుమనతిప్ప, ఎస్టీ కాలనీలో జరుగుతున్న కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేస్తే అంగవైకల్యం నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి, అశోక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈఓ

లింగసముద్రం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 100రోజుల కార్యక్రమాన్ని అమలు చేయాలని డీఈఓ బాలాజీరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఆయన లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం బ్లాక్‌బోర్డుపై గణితంలో కొన్ని లెక్కలు వేసి వాటికి సమాధానాలు చేయించారు. దాతలు, పూర్వ విద్యార్థులు సహకారంతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను హెచ్‌ఎం మాధవరావు డీఈఓకు వివరించారు.

పకడ్బందీగా సర్వేలు నిర్వహించాలి


పంచాయితీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో జే మోహనరావు

చేజర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో జే మోహనరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎమ్ ఎస్ఎమ్ఈ సర్వే, మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, పీఏసిఏస్ సర్వే, జియోకోఆర్డినేట్ సర్వే, కమ్యూనిటీ అసెట్స్ తదితర సర్వేలపై తగు సూచనలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులందరూ సచివాలయ సిబ్బందితో కలిసి సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం చేజర్ల సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలలిత, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేపై సమీక్ష

కలువాయి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై నిర్వహిస్తున్న సర్వేపై శుక్రవారం కలువాయి సచివాలయంలో సిబ్బందితో జిల్లా పరిషత్తు ఉప కార్య నిర్వాహణాధికారి జే మోహన్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పలు సర్వేల ప్రగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఈవో పీఆర్డీ రమేష్, ఎంపీడీవో కార్యాలయం పరిపాలనాధికారి శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

మహదేవపురం సర్పంచ్ టీడీపీలో చేరిక


ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరిన మహదేవపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పద్మ, వెంకటరావు

కందుకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహదేవపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పద్మ, ఆమె భర్త కొమ్మిరెడ్డి వెంకటరావు మరో 15కుటుంబాల సభ్యులతో కలిసి శుక్రవారం తెలుగుదేశంలో చేరారు. వారి వెంట వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రావినూతల రాజు, అన్నపురెడ్డి వెంకటరావు ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, గుళ్లా శ్రీనివాసులు, గుళ్లా బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు సందర్శన

కందుకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డును సాయంత్రం ఎమ్మెల్యే సందర్శించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యత పరీక్షల కోసం ఏర్పాటు చేసిన అగ్రి టెస్టింగ్‌ల్యాబ్‌ను పరిశీలించారు. వార్షిక రాబడి, సెస్సు వసూళ్ల తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట ఏఎంసీ కార్యదర్శి రామాంజనేయులు, అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఇంఛార్జి గీత ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

ఉదయగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లి, ఉదయగిరి ఉర్దూ బీసీ కాలనీ తెలుగు, ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను శుక్రవారం ఎంఈవో-2 శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు సులభరీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరు జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అపస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ (ఎంఎంటీఎస్ఈ) పాఠశాల, నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం సీఐ జి గంగాధర్, అపస్మా నేతలు బహుమతులను అందజేశారు. ముందుగా పట్టణంలోని రెయిన్‌బో ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో అపస్మా నేతలు కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఎంఎంటీఎస్ కన్వీనర్ రమణారెడ్డి, అపస్మా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఈగ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఫిబ్రవరి 4న టాలెంట్ టెస్ట్ నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

నష్టాల ఊబిలో అన్నదాతలు

తగ్గిన దిగుబడి, దిగజారిన ధర


కల్లాల్లో రైతులు ఆరబోసిన వరిధాన్యం

ఉదయగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తగ్గిన దిగుబడి, దిగజారిన ధరలతో అన్నదాతలు నష్టాల ఊబిలో కూరుకుపోతు న్నారు. ప్రభుత్వం చెబుతున్న రై తు పండించిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైందని రైతులు ఆరోపిస్తున్నారు. మండల ంలో గత ఖరీఫ్ సీజన్‌లో సుమా రు 400 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. తుపాన్‌ల ప్రభా వంతో ఆశించిన మేర దిగుబడి రాలేదని, దీనికితోడు మద్దతు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చిందని తెలుపుతున్నారు. దళారులు రైతుల వద్ద నుంచి 75 కేజీల బస్తా రూ.1,400కు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటకు తగిన ప్రతిఫలం రాక ఆరుగాలం కష్టమే మిగులుతోందని రైతన్నలు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధరకు వరి పంటను కొనుగోలుచేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోయా



- కాశిరెడ్డి, రైతు, కృష్ణారెడ్డిపల్లి

మూడెకరాల్లో రూ.1.20 లక్షల పెట్టుబడితో వరిపంట సాగు చేశా. ఎకరాకు 20-25 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. ప్రస్తుతం బస్తా రూ.1,400లు కంటే ఎక్కువ ధర పలకడంలేదు. ఈ ధరతో పెట్టుబడులే తప్ప ఆరుగాలం పడిన కష్టం, శ్రమ వృథా అయ్యింది.

గిట్టుబాటు ధర కల్పించండి



- కాకు వెంకటయ్య, రైతు సంఘం నాయకులు

రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలి. బహిరంగ మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు

ఆత్మకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బాలికల సంరక్షణ సామాజిక బాధ్య త అని, బాలికా విద్యను ప్రోత్సహించడమే కా కుండా, వారికి ఉన్న హక్కులు, చట్టాలపై అవ గాహన కల్పించాలనే లక్ష్యంతో బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎల్‌ఆర్ పల్లి అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్ సుప్రజ, షేక్ షకీలా ఆధ్వర్యంలో చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఆర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ఏఎస్ పేట: బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల తెలిపారు. స్థానిక కేజీ బీవీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పోషకాహారం, అంటువ్యాధులు, బాల్య వివాహాలు, చట్టపరమైన హక్కులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రషీద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీని వాసులు, ఏఎన్‌ఎం శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.
- అనంతసాగరం: కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో ఎంఈవో కే ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధరదేవి, ఉపాధ్యాయులు హజరత్, వెంకటరమణమ్మ, మనోజ్‌కుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.
- సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డితోపాటు గురుకుల పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- చేజర్ల: మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్- బ్యాడ్ టచ్ తదితర అంశాలపై ఐసిడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- మర్రిపాడు: కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొని బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- కావలి టౌన్ : టీపీఎస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని బాలికల వసతి గృహంలో మానసిక వైద్య నిపుణురాలు రమ్య, ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ముసునూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో జమాతె ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కావలి శాఖ బాధ్యురాలు ఫాతిమ పాల్గొన్నారు.

కావలి రూరల్ : మన్నంగిదిన్నె పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరత్నం జాతీయ బాలికా దినోత్సం సందర్భంగా విద్యార్థినులతో ప్లకార్డులు చేతపట్టుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

- కందుకూరు: కేజీబీవీలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ రజనీ ఆధ్వర్యంలో వరల్డ్‌విజన్ మేనేజరు యషియా విద్యార్థినులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో, టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కలగట్ల హజరత్తయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
- వలేటివారిపాలెం : జమీన్‌ఉప్పలపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సూపర్‌వైజర్ సునీత మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ గోవర్ధినీ, పీహెచ్ఎన్ నవమణి, టీచర్లు, పాల్గొన్నారు.



కావలి: జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫాతిమ


కందుకూరులో బాలికా దినోత్సవంలో ప్రసంగిస్తున్న వక్తలు


'సంగంలో బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

అప్రమత్తతతోనే రోడ్డుప్రమాదాల నివారణ : ఎంవీఐ



ఆత్మకూరు: రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నిరారించవచ్చని ఎంవీఐ శ్రీరాములు, సీఐ జి గంగాధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస ఇంగ్లీష మీడియం స్కూల్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ప్రైవేట్ స్కూల్ వాహనాల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలన్నారు. మత్తుపానీయాలు సేవించి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని సూచించారు. రోడ్డు మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం షేక్ కరీమున్నీసా, ఏఎమ్ రాజ్‌కుమార్, ఏఎంవీఐ మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- సంగం: స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణంలో ఆటో డ్రైవర్లకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీఐ వేమారెడ్డి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమనిబంధనలు పాటించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ, పాల్గొన్నారు.
- అనంతసాగరం: హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలంటూ అనంతసాగరం పోలీసులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సిబ్బందితో పాటు స్థానికులు తమ ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి, ఏఎస్ఐ మస్తాన్ పాల్గొన్నారు.


ఉదయగిరి : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐలు, సిబ్బంది

- ఉదయగిరి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ ఎన్.వెంకటరావు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది, పట్టణ ప్రజలతో కలిసి హెల్మెట్ వినియోగంపై పట్టణంలోని మెయిన్ బజార్, సినిమాహాలు వీధి, నాగులబావి వీధి, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.
- వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి నుంచి తోటచెరువుపల్లి వరకు శుక్రవారం గ్రామస్థులతో కలిసి పోలీసులు హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో వాహనాలపై హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వరికుంటపాడు, ఉదయగిరి ఎస్ఐలు రఘునాథ్, ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- కలిగిరి : హెల్మెట్ ప్రయాణం సురక్షితం అని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఉమాశంకర్ సూచించారు. ఈ విషంయపై శుక్రవారం పోలీసు సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
- జలదంకి: ఎస్ఐ లతీఫున్నీసా ఆధ్వర్యంలో పోలీసులు మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుండి గట్టుపల్లి కూడలి వరకు ఈ ర్యాలీని చేపట్టారు. అనంతరం రోడ్డుపై ప్రయాణించే ద్విచక్రవాహనదారులతో మాట్లాడి నిబంధనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి

- లేఅవుట్ రాళ్లను తొలగించిన ఎంపీడీఓ


ఆముదాలదిన్నె సమీపంలోని రాళ్లను తొలగిస్తున్న ఎంపీడీఓ, పంచాయతీ అధికారులు

కావలి రూరల్, జనవరి24: అనధికార లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు కొనుగోలుదారులను మోసగిస్తున్నారని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆముదాలదిన్నె సమీపంలోని సుబ్రమణ్యం లేఅవుట్‌లో పంచాయతీ అనుమతులు లేకుండా వేసిన రాళ్లను ఎక్సవేటర్‌తో తొలగింపు జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలో నుడా అనుమతులు లేని లేఅవుట్ల జాబితా తమకు అందిందని పంచాయతీ అధికారులను ఆదేశించారు. శంకరమఠం లో లేఅవుట్లు ఉన్నట్లు వాటిని తగు చర్యలు తీసుకుంటామన్నారు. లేఅవుట్ వేసేటప్పుడు ఆయా పంచాయతీల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఆ భూమి లో పంచాయతీకి 10శాతం ఇవ్వాలన్నారు. అలాగే ఓపన్ స్పేస్ కు 14శాతం చలానా కట్టాలని, అనధికార లేఅవుట్లతో కన్వర్షన్ చేసుకుని రైతుల నుండి నేరుగా ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో రిజిస్టేషన్ ఫీజులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీఆర్వో శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అబ్దుల్ సమద్, ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటరమణ, సర్వేయర్ సంజు సుల్తానాపాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సినిమా థియేటర్ యాజమాన్యానికి నోటీసు

కావలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు ఈనెల 15 నుంచి 23 వరకు మాత్రమే అధిక ధరలకు టిక్కెట్లను అమ్ముకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. అయితే 24న కూడా టికెట్లను అధిక ధరలకు శ్రీవెంకటేశ్వర సినిమా థియేటర్ యాజమాన్యం అమ్ముతున్నారని పట్టణానికి చెందిన వెంకటేశ్వరరావు మరికొంత మందితో ఆర్డీవో ఎం.వన్నీ వంశీ క్రిష్ణకు శుక్రవారం అభియోగాలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వమని ఆర్డీవో థియేటర్ యాజమాన్యానికి నోటీసు పంపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉదయగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చాకలవీధిలో శుక్రవారం శిథిలావస్థకు చేరిన ఓ విద్యుత్ స్తంభం ఇంటి గోడపై కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే సిబ్బందికి సమాచారం అందించడంతో వారు విద్యుత్ సరఫరా నిలిపేశారు. అనంతరం నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

బిజ్జంపల్లిలో కొండచిలువ మృతి

ఉదయగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపాన గల వరి పొలాల్లో శుక్రవారం కొండచిలువ దర్శనమిచ్చింది. యంత్రంతో వరి పంటను నూర్పిడి చేస్తుండగా అందులో చిక్కుకుని కొండచిలువ మృత్యువాత పడింది. గమనించిన రైతులు దానిని బయటకు తీశారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా పాఠశాల ప్రహరీ ఎత్తును పెంచేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్‌కు సూచించారు.

ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి

ఉదయగిరి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గండి పాళెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజరు శోభన్‌బాబు అన్నారు. శుక్రవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా బస్టాండ్ సెంటర్, ప్రధాన వీధుల్లోని చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఇంతియాజ్, క్లర్కులు రమేష్, అజయ్, మెసెంజరు చిన్నఖాశిం పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ఆత్మకూరు : రైతులు, పశుపోషకులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ కూరు పశుసంవర్ధక శాఖ ఏడీ ఎస్ జయచంద్ర కోరారు. అప్పారావుపాళెంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు పలు రకాల మందులను పశుపోషకులకు అందజేశారు.

- సీతారామపురం : పాడి రైతుల కోసం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు కోరారు. గుండుపల్లి పంచాయతీలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా విఏ మాలాశ్రీ మాట్లాడుతూ పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రీయ గోకుల మిషన్ కింద ఖనిజ లవణ మిశ్రమాన్ని పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌ఏ కొండయ్య, శ్రీను, వీఏఏ నరేంద్ర పాల్గొన్నారు.

బెల్టు దుకాణంపై దాడి

కావలి రూరల్ : అన్నగారిపాలెం బెల్టుదుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. జెడ్డా వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 10మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

కలువాయి : మండలంలోని వెరుబొట్లపల్లిలో దళిత యువ కులపై జరిగిన దాడి కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ శుక్రవారం తహసీల్దారుకు ఏడీపీయస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్ వినతి పత్రం అందజేశారు. కౌంటర్ కేసు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగునీటిని వృథా చేయొద్దు

అల్లూరు : ఏటీఎస్ చానల్ ఆయకట్టు పరిధిలోని రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ఇరిగేషన్ ఏఈ సుధీర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నూతనంగా ఏర్పడిన నీటి సంఘం డైరెక్టర్లతో ఆయన తొలి సమీక్షించారు. కార్యక్రమంలో మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, వరంధామరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అంబటి రాజేంద్ర, రామకృష్ణారెడ్డి, అల్లాభక్షు పాల్గొన్నారు.

నూతన ధర్మకర్త మండలి ఏర్పాటు

అల్లూరు : తూర్పుగోగులపల్లి శ్రీరామ మందిరానికి నూతన ధర్మకర్త మండలిని శుక్రవారం గ్రామస్థులు ఎన్నుకున్నారు. ఆలయ చైర్మన్‌గా ముంతా శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా నెల్లూరు కాంతారావుతో ఏడు సామాజిక వర్గాల్లోని 21 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తోట శ్రీనివాసులు, కీర్తి వెంకయ్య పాల్గొన్నారు.

వీర్లగుడిపాడు సర్పంచ్ మృతి

సంగం : వీర్లగుడిపాడు సర్పంచ్ జి చెంచురత్నం నాయుడు (55) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. కాగా, సర్పంచ్ మృతివార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు.